

# సనాతన సారథి

ఫిబ్రవరి 2021

"మధురవాక్కులందు మందహాసమునందు మంత్రశక్తి పుట్టి మదిని దోచు"

# సనాతన సారథి

సత్య, ధర్మ, శాంతి, ప్రేమలద్వారా మానవజాతి సామాజిక,
నైతిక, ఆధ్యాత్మిక అభివృద్ధికి అర్పితము

సంపుటము 64
సంచిక 2

ఫిబ్రవరి 2021

ప్రచురణ తేదీ
జనవరి 23


| | | | |
|---|---|---|---|
| 1. | రామకథారస వాహిని (ధారావాహికం) | భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారు | 4 |
| 2. | స్వామి ఆశించేది నిష్కామ సేవ | అవతారవాణి | 7 |
| 3. | దివ్యసన్నిధిలో నేర్చిన పాఠాలు | పి. కృష్ణ కుమార్ | 12 |
| 4. | 'నీవు నా సొత్తు, నేను నీ సొత్తు' | అనుగ్రహపూర్వక లేఖ | 17 |
| 5. | అంతర్యామికి హృదయాంజలి | డా॥ సురేంద్ర ఉపాధ్యాయ | 18 |
| 6. | 'శివుడు మెచ్చు సేవ చేయరయ్య' | శ్రీ సత్యసాయి పద్యసుధ | 24 |
| 7. | అవతార వైభవంలో అద్భుత ప్రదేశాలు - 9 | పి.వి. చలం | 25 |
| 8. | ప్రేమామృతధార | బి.వి.ఎస్. సాగర్ | 31 |
| 9. | శరణాగతవత్సలుడు | బి.ఎస్. వరదరాజన్ | 34 |
| 10. | ప్రశాంతి సమాచారం | డా॥ దివి చతుర్వేది | 38 |
| 11. | లోకపితా | 'సనాతన సారథి' 1961 ఫిబ్రవరి సంచికనుండి | 41 |


**కవితాంజలి**


| | | | |
|---|---|---|---|
| 1. | సేవాచందనం | డా॥ వజ్జల సత్యకమలాకర్ | 33 |
| 2. | మనకోసం పుట్టిన దేవుడు | పలివెల సుబ్బారాయుడు | 42 |
| 3. | సర్వదేవతాతీతుడు | గాదె శ్రీరామచంద్రమూర్తి | 42 |


© శ్రీ సత్యసాయి సాధనా ట్రస్టు, పబ్లికేషన్స్ విభాగం, ప్రశాంతినిలయం

**టెలిఫోన్: 08555-287375** (సనాతన సారథి Extn. 128, పుస్తకాలు, ఆడియో వీడియో సీడీలకొరకు ఆర్డర్లు Extn. 162)

**గమనిక:** అడ్రసు కవరుపై గల మీ చందానెంబరు ప్రక్కన మూడు పువ్వుల గుర్తు (*** ) ఉన్నట్లయితే మీ చందాను వెంటనే రెన్యువల్ చేయించుకోగలరు.

**E-mail:** subscriptions@sssbpt.org, editor@sssbpt.org

శ్రీ సత్యసాయి సాధనా ట్రస్టు, పబ్లికేషన్స్ విభాగం, ప్రశాంతి నిలయం, అనంతపురం జిల్లా (ఆం.ప్ర) - 515134 తరఫున ప్రశాంతి నిలయంలోని శ్రీ సత్యసాయి ఆశ్రమ పరిధిలో ఉన్న శ్రీ సత్యసాయి ప్రెస్ షెడ్ (120'X40')లో ముద్రింపబడి ప్రచురింపబడింది.

**ప్రింటర్ అండ్ పబ్లిషర్ : కె.ఎస్. రాజన్, ఎడిటర్ : వి. శ్రీనివాసులు**

భగవాన్ శ్రీ సత్యసాయీశ్వర విరచిత

# రామకథారస వాహిని

(గత సంచిక తరువాయి - 83వ భాగం)

దూత చేతులు జోడించుకొని రావణునితో యిట్లు విన్నవించెను: "ఓ నాథా! మీరు కటాక్షించి శాంతముగా నా మాటలను వినుడు. ఎపుడు మీ సోదరుడు శ్రీ రామునితో సఖ్యము చేసుకొనెనో, అపుడు మీ తమ్మునకు శ్రీరాముడు లంకా రాజ్యమునకు పట్టము కట్టెను. నేను తమ దూతనని తెలిసికొని వానరులు నన్ను బాధించిరి. నేను రాముని మీద ఒట్టు బెట్టినందున నా ముక్కు చెవులను ఛేదించక విడిచిపెట్టిరి. వేయి ముఖములతో నయినను నేనా వానరదళ బలమును వర్ణించలేను; రంగురంగుల వానరులును, జాంబవంతులును కలరు. వారిని చూచినను, వారిని తలచినను భయము కలుగును. మీ కుమారుని చంపి పట్టణమును దహించిన వానరుడొక్కడు. ఏపాటి బలము వానికి కలదు! శ్రీరాముని ప్రతాపము వలన అత్యల్పుడగు వానరుడు సహితము మహాబలవంతుడయ్యెను. అనేక నామములు కల వానరయోధులు కలరు. అనేక యేనుగుల బలము ఒక్కొక్కనికి కలదు. ద్వివిద, మైంద, నీల, నల, అంగద, వికట, దధిముఖ, కేసరి, కుముద, గజ, గవాక్ష, జాంబవంత - ఈ మహాబలులు సేనాధిపతులు. వారందరూ సుగ్రీవునితో సరిసమాన బలవంతులు. ఇంకను వారితో సరిసమాన బలవంతులైనవారు లక్షలకు కలరు. లెక్కకెక్కువైన వానరులను లెక్కించ సాధ్యముకాదు. వారందరూ అతి పరాక్రమవంతులు, తృణమువలె మూడు లోకములను క్షణములో సాధించగలరు, జయించగలరు.

"ఓ రాజా! వారు పదునెనిమిది పద్మముల వానరులని వినియుంటిని. వారికి వేరువేరు సేనాధిపతులు కలరు. ఓ రాజా! యుద్ధములో నిన్ను జయింపలేనని అధైర్యపడిన వానరుడొకడు వారిలో కనబడడు. ఈ పట్టణముపై దుముకుటకు సిద్ధపడి చేతులు నలుపుకొనుచున్నారు. ఇంతవరకు శ్రీరాముని ఉత్తరువు లేదు. సముద్రుడు మార్గమిచ్చిననూ, లేకపోయినను వారు సముద్రమునకు పాషాణములతో వారధి గట్టి వారి కార్యమును సాధించుటకు సిద్ధముగా నున్నారు. రావణుని ఒక్క క్షణములో నలిపి భస్మము గావింతుమని వానరులు అనేక విధముల పండ్లు కొరుకుచున్నారు. వారి గర్జనలు; వారి వీరాలాపములు వినిన భయము కలుగును. మీ పేరు వినగానే వృక్షములను వేళ్ళవరకు భూమినుండి లాగి, బంతులవలె విసరివేయుచున్నారు. లంకా నగరమును భక్షించుటకు ఉబ్బితలూగుచున్నారు. వానర భల్లూకములే మహాశూరులు. అందులకుతోడు శ్రీరాముడు యజమానుడు. కోటి కాలాంతకులను ఒక్క క్షణమున మ్రింగగలరు. ఇక, శ్రీరాముని తేజోబలమును, బుద్ధిని శతసహస్ర శేషులు సహితము వర్ణించి చెప్పలేరు. ఒక్క బాణముతో సముద్రమునే శోధించగలడు. మీ తమ్ముడు పూర్వము చెప్పినటుల

అతడు పరమకృపాళుడు” అని శుకసారణులు చెప్పిన వచనములను విని రావణుడు పక్కున నవ్వి, “అతడింత బుద్ధిమంతుడా! అతని సైనికులు వానరులా! విభీషణుడు పిరికిపంద. వాని మాటలను నమ్మి మీరు ఆ మూర్ఖుని వర్ణించుచున్నారా? కోతుల బలతేజోసంపన్నతలను గురించి ఇంతగా వర్ణించుటలో అర్థము లేదు. మీ బకవాదము చాలింపుడు; ఇంత బలవంతులా ఆ వానరులు! ఛీ, ఛీ! చాలు! చాలు! ఇంతకుపూర్వమే నేను సుగ్రీవుని బలమును గురించి వినియుంటిని. పిరికిపందయైన విభీషణుడు మంత్రియై యుండ శ్రీ విజయ విభూతులు శ్రీరామునకు లభించవు.”

ఈ ప్రకారము రావణుడు పలికిన పలుకులకు సారణుడు లోలోన అతని విపరీతబుద్ధికి చింతించి, చేతులు జోడించుకొని నిలిచెను. అంత రావణుడు సారణుడు అందించిన ఉత్తరమును వెగటుగా నవ్వుచూ చించి చూచెను. తరువాత దానిని మంత్రి చేతికి అందించి, “ఓరీ! మూర్ఖుడా! పెక్కు మాటలవలన ప్రయోజనము లేదు! తీతువపక్షి తన పిల్లలను రక్షించుటకు పాదములను మీదికెత్తి ఆకాశము పడకుండా కాపాడును. ఈ తపశ్శాలురు, ఈ అర్భకులు మాటలతో బెదిరించుచుండిరి. మాటలతో నన్ను జయించగలరా?” అని గర్జించుచున్న రావణుని చూచి, శుకుడు, “ఓ నాథా! ఇదియంతయూ సత్యము. ఆ ఉత్తరములో వ్రాయబడిన సంగతులను లెస్సగా విచారించి నీ అభిమానమును విడచిపెట్టుము. నా మాటను మన్నింపుము. శ్రీరామునితో వైరము జాలింపుము. అతని స్వభావ మతికోమలము, అతడు త్రిలోకాధిపతి! నీవు అతనిని సమీపించినయెడల అతడు నిన్ను రక్షించును. నీ అపరాధములను మన్నించును. జానకిని అతనికి సమర్పించుము. నా విన్నపములను మన్నింపుము” అని అనేకవిధములుగా బతిమిలాడెను. రావణుడు విని కండ్లెఱ్ఱ చేసి, “నన్ను అపరాధిగా యెంచితివా? మూర్ఖుడా! నన్ను వెళ్ళి ఆ అర్భకుని శరణుజొచ్చుమని పలికితివా? ఎంతటి ధైర్యము!” అని గర్జించి తన కాళ్ళతో అతనిని తన్నెను.

అంత ఆ శుకుడు లంకను త్యజించి రాముని చరణములవద్దకు వెళ్ళెను. వానరులు తిరిగి ఈ దూతను బంధించి ఉద్రేకమును అణచుకొని రామాజ్ఞకొరకై వేచిరి. సుగ్రీవుడు ఈ వచ్చిన శుకుని రాముని సన్నిధికి గొంపోయెను. శుకుడు రాముని పాదములపైబడి తన వృత్తాంతమంతయు చెప్పుకొని విభీషణునివలె తానునూ శరణుజొచ్చుచున్నాననియు తనను కాపాడవలెననియు పరిపరివిధముల ప్రార్థించెను. శ్రీరాముడు కరుణాస్వభావుడు కనుక తత్క్షణమే వానర వీరులను రప్పించి, శుకుని కూడా మీలో ఒక సోదరునిగా భావించుడని ఆజ్ఞాపించి శుకుని మన్నించెను. శుకుడు ధన్యుడనైతినని శ్రీరాముని అనేకవిధముల వర్ణించెను. శ్రీరామలక్ష్మణులకు నమస్కరించి ధన్యుడాయెను.

శ్రీరాముడు లక్ష్మణుని పిలచి, “ధనుర్బాణములు తీసికొనిరమ్ము. అగ్నిబాణములచే సముద్రుని శోషింప జేయుదును. మూర్ఖులకు వినయము, కుటిల స్వభావులకు ప్రీతియు, స్వాభావిక కృపణులకు నీతి బోధనలును, మమకారము కలవారలకు జ్ఞానమును, లోభులకు వైరాగ్యమును, కోపస్వభావులకు శాంతమును, కామాతురులకు హరికథలును వూసర క్షేత్రమున బీజములు చల్లిన విధమున వ్యర్థములు” అని ఈ ప్రకారము పలికి ధనుస్సు నెక్కుపెట్టి బాణమును సంధించెను.

శ్రీరాముని పరాక్రమమును చూచి లక్ష్మణుడు భయపడెను. రాముడు బాణములను సంధించు నప్పటికి సముద్రునకు గుండెలో వేడి పుట్టెను. మీన, మకరములు మొదలగునవి వ్యాకులపడెను. సముద్రుడు భయపడెనా అన్నట్లు జలము శోషించెను. సముద్రుడు రామచరణములకు నమస్కరించుచున్నాడా అన్నట్లు అలలు ఒకదానిపై నొకటి శ్రీరాముడు కూర్చున్న స్థానమునకు వచ్చి పాదముల స్పృశించెను. అంత యొక అశరీరవాణి, “నాథా! మీ కటకములో నల నీలులని ఇరువురు సేనాపతులు కలరు. చిన్నతనములో వారికి మునిశాపం దగిలెను. ఆ శాపమిప్పుడు ఆశీర్వచనములయ్యెను. పూర్వపు వృత్తాంతము ఆలకించుడు” అని సముద్రుడే ఈరీతిగా తెలిపెను:

“నదీతీరమున ఋషుల ఆశ్రమము కలదు. చిన్నతనములో వీరు ఆ ఋషులు తపస్సు చేయుచుండినపుడు వారి సాలగ్రామములు అపహరించి వాటిని నీటిలో విసరివేయుచుండిరి, ‘మీరు నీటిలో వేయుచుండిన వస్తువులన్నియూ నీటిపై తేలి కదలకయుండుగాక! నీరు ప్రవహించినను వస్తువులు మాత్రము నీటిపై తేలియాడును గాక!’ అని ఋషులు శపించిరి. కాన, వారు నీటిలో వేసిన ప్రతీ రాయియూ తేలియాడును. అందులో మీ నామము తేలియాడునట్టిది కనుక దానిపై మీ నామము వ్రాసి వేయించుడు. పర్వతములుకూడా నాపై తేలియాడును. నేనుకూడా సహాయము చేతును. సీతాన్వేషణలో ప్రకృతి సహాయ పడగలదు” అని చెప్పగా, శ్రీరాముడు సంధించిన బాణము వెనుకకు తీసుకొనుటకు వీలుకానందున ఒక వనమువైపున ప్రయోగించెను. ఆ బాణప్రభావము వలన ఆ ప్రదేశము జలశూన్యమయ్యెను. ఆ ప్రదేశము ప్రకృతి సంపదలతో నిండెను.

మంత్రులను పిలిచి, విలంబనము చేయక సేతువు నిర్మించుడని ఆజ్ఞాపించెను. హనుమంతుడు, “రామా, తమ నామమే జీవులకు భద్రమైన సేతువు. దానికి మించినది మరేమున్నది?!” అని పలికెను. జాంబవంతుడు, “ఓ నాథా! మీ ప్రతాపమనునట్టి బడబాగ్నిచే ఈ సముద్రము శుష్కించును, యుద్ధమున మాచే సంహరింపబడిన రాక్షసుల భార్యల దుఃఖముచే తిరిగి ఈ సముద్రము నింపబడును. కనుక దీని జలము ఉప్పగా నుండును” అని చేతులు జోడించి చెప్పెను. శ్రీరాముడు ఈ మహావీరుల వచనములు విని చిరునవ్వు నవ్వెను.

జాంబవతుడు నీలుని, నలుని బిలిచి అశరీరవాణిగా సముద్రుడు చెప్పిన మాటలను వారికి మరొకతూరి జ్ఞప్తికి తెప్పించెను. శ్రీరాముని ధ్యానించుచు పర్వతములు, గుండ్లు, బండలు తెచ్చి సముద్రమున పడవేయుడు అని ఆజ్ఞాపించెను. వానరులు ఆ మాట వినగానే గంతులు వేయుచూ కొండలు చెండ్లవలే యెత్తి, ‘రామా, రామా’ అంటూ బారులుదీరి సాగరమున వేయదొడగిరి; మధ్యమధ్య పెద్దపెద్ద వృక్షములు వేరులవరకు పెకలించి సముద్రమున దొర్లించిరి. ఆనాడంతయూ విశ్రాంతి లేక, ఆహారము సహితము తీసుకొనక, వానర వీరులు తెచ్చిన పర్వతములను, గుండ్లను నలుడు, నీలుడు, తమ హస్తములతో అందుకొని దానిని నిర్మించుచూ వచ్చిరి.

ఆనాడు పూర్తి పదునాలుగు యోజనములు సేతువు నిర్మించిరి. రాత్రి బాగా విశ్రాంతి తీసుకొని, తెల్లవారి బ్రహ్మముహూర్తముననే లేచి, ‘శ్రీరామప్రభువునకు జై’ అని గర్జించి నలుమూలలా పరుగిడి, పర్వతములను తెచ్చి తీరమున బడవైచిరి. ఆనాడు ఇరువది యోజనములు, మూడవ దినము ఇరువది యొక్క యోజనములను, మొత్తము నూరు యోజనములు ఐదు దినములలో నలుడు, నీలుడు అత్యంత ఉత్సాహముతో విశ్రాంతి అన్నది ఆశించక రామకార్యము ప్రధానమను లక్ష్యముతో రాముని స్మరించుచూ దర్శించుచూ పూర్తి గావించిరి.

**(సశేషం)**

అవతారవాణి:

# స్వామి ఆశించేది నిష్కామ సేవ

కులమత ద్వేషాలు కూలద్రోయుడటంచు
చేయెత్తి బోధనల్ చేయవలయు
దీనుల సేవయే దివ్యమార్గమటంచు
పలుమారు గట్టిగా పలుకవలయు
నామ చింతన నరుని నామి సన్నిధి జేర్చి
అమృతత్వమందించు ననగవలయు
భక్తి విశ్వాసంబు బాగుగా గలవారె
మనవారలని ముద మందవలయు
జ్ఞానబోధలు నరులకు చేయువారు
ఇష్టులౌదురు స్పష్టము ఎంతయేని
భేదభావంబు విడనాడి ప్రీతితోడ
కలిసియున్నచో సాయికి కల్గు ప్రేమ.

పవిత్రాత్మస్వరూపులారా!

అన్నజీవితము అల్పజీవితము, ఆత్మజీవితము అనంత జీవితము. మనము ఆశించవలసినది దీర్ఘజీవితము కాదు, దివ్యజీవితము. మనము పెంచుకోవలసినది ఆయుః ప్రమాణము కాదు, గుణములయొక్క అభివృద్ధి. "సర్వం దుఃఖం దుఃఖం, సర్వం క్షణికం క్షణికం, సర్వం శూన్యం శూన్యం" – ఈ వాక్యములను మనము నిత్యము మననము చేయుచువచ్చుచుండిన, "పరోపకారార్థమిదం శరీరమ"నే సత్యమును గుర్తించి వర్తించటానికి వీలౌతుంది. "హ్యాండ్స్ యిన్ ది సొసైటీ, హెడ్ యిన్ ది ఫారెస్ట్." మనము నిజముగా తపస్సు ఆచరించుటకు మన చేతులతో సమాజ సేవ చేయుటకు పూనుకోవాలి. కాలమును పవిత్రము గావించుకొనే కర్తవ్యముగా ఏర్పడిన కాయమును సమాజ సేవయందు అంకితము గావించినప్పుడే జన్మ సార్థకము కాగలదు. మానవుడు కేవలము తైలముపైనున్న నీటిబొట్టు వలె ఏకాకిగా జీవించుటకు వీలుపడదు. సమాజమును వదలి క్షణమైనా జీవించుటకు వీలుకాదు. సమాజములో జన్మించి, సమాజములో పెరిగి, సమాజమునుండి సుఖ సంపదలను అనుభవించి, సమాజమునకు అర్పితము గావించుకోని జీవితము కేవలము నిరర్థకమైన జీవితమని చెప్పవచ్చును. కాని, దురదృష్టవశాత్తు అనేకమంది కేవలము సోమరత్వాన్ని పెంచుకొంటూ సోఽహంతత్వాన్ని స్మరించక కాలమును వ్యర్థము గావిస్తున్నారు.

## సాయి సంస్థలలో ప్రేమయే ప్రధానమైన ప్రాణం

'సమస్త లోకాస్సుఖినో భవంతు' సర్వులు క్షేమంగా ఉంటుండాలి. సర్వులు ఆనందాన్ని అనుభవించాలి. సర్వులు సుఖమయ జీవితాన్ని అనుభవించాలి అనే ఆశయమే సత్యసాయి ఆశయము. కనుక, ఇక్కడ మనము ఏవిధమైన భేదభావములకు చోటివ్వక, అహంకార అసూయలకు స్థానమునివ్వక, పవిత్రమైన భావముచేత ఏకోన్ముఖులమై సేవలలో పాల్గొనాలి. ఈ టంబ్లర్‌లో ఉన్న పదార్థమును అమెరికన్స్ 'వాటర్' అంటారు.

ఉత్తరప్రదేశమువారు, 'పానీ' అంటున్నారు. మద్రాసు స్టేట్‌వారు దీనిని 'తన్ని' అంటున్నారు. సంస్కృతమువారు 'వారి' అంటున్నారు. తెలుగువారు 'నీరు' అంటున్నారు. ఇన్ని పేర్లు చెబుతున్నా ఈ పదార్థము మారలేదు కదా! అదేవిధముగ 'ఏకోఽహం బహుస్యాం' ఒక్క ఆత్మస్వరూపంగానే ఉండి అనేకంగా కనిపిస్తున్నాను. 'ఏకం సత్ విప్రాః బహుధా వదన్తి' ఒకే పదార్థమును అనేకమంది అనేక పేర్లతో పిలిచినట్లుగా ఒకే ఆత్మస్వరూపమైన దివ్యత్వాన్ని అనేక రూపనామములుగా మనము చూస్తున్నాము. కనుక, మనమందరము ఆత్మస్వరూపులమని భావించుకోవటమువలన ఎట్టి భేదములకూ అవకాశము లేకుండా ఉంటుంది.... భిన్నత్వములోనున్న ఇట్టి ఏకత్వాన్ని మాత్రమే గ్రహించే ప్రయత్నానికి సేవాదళమువారు ముందంజ వేయాలి. సత్యసాయి సంస్థలలో ప్రేమయే ప్రధానమైన ప్రాణంగా మనము విశ్వసించాలి. సత్యసాయి సంస్థలలోనున్న సభ్యులలో ఒకరిపైన ఒకరు ద్వేషమో లేక ఒకరిపైన ఒకరు అసూయనో, లేక ఒకరిపైన ఒకరికి కొన్ని విధములైన భేదాభిప్రాయములో కలిగినప్పుడు అదొక పాపంగా రూపొందుతుంది. ఇది సంస్థలకే ద్రోహము చేసినట్లవుతుంది. ఇట్టి దుష్టబుద్ధులను మన నుండి దూరము చేసుకోవటానికి ప్రయత్నము చేయాలి. ఇట్టి దుర్భావములు ఉన్నటువంటివారు సంస్థలలో చేరటానికి ఏమాత్రము అధికారము లేదు.

ముఖ్యంగా సేవాదళములో పరుల దోషములను వెదుకుటకంటె, తనలోనున్న దోషములు వెదకటము అత్యవసరము. పరుల దోషములు వెతికే అధికారము ఎవరికి ఉంటుంది? అంటే, దోషరహితునికి మాత్రమే ఉంటుంది. దోషరహితునియొక్క గుణములు ఎలాంటివి? తాను దోషరహితుడు కావటముచేత తనకు ఎక్కడను దోషములే కనిపించవు. ఇంక ఇతరులలో దోషములను తాను ఏరీతిగా వెతకగలడు? 'నేను దోషరహితుడను' అని అనుకొంటే దోషములను వెతికే అవకాశమే లేదు. 'నేను దోషిని' అనుకొంటే దోషములను వెతికే అధికారమే లేదు. కనుక, మన దోషములను మనము చక్కగా గుర్తించుకొని వాటిని నిర్మూలము చేసుకొని, పవిత్రతను అభివృద్ధి గావించుకోవటము అత్యవసరం.

## దురభ్యాసములు మాన్పించండి, అదే గొప్ప సేవ

"మేము కొన్నికొన్ని గ్రామాలను 'అడాప్ట్' (దత్తత) చేసుకొన్నాము, ఆ గ్రామాల పరిస్థితిని, ఆ గ్రామాలయొక్క పవిత్రతను ఎంతో చక్కగా తీర్చిదిద్దుతున్నాము" అని అనేక సంస్థలవారు తమ నివేదికలలో పేర్కొన్నారు. దత్తత తీసుకొన్న గ్రామములలో మనము చేసే పని ఏమిటి? "రోడ్డు వేస్తున్నాము, కాలువలు పరిశుద్ధము చేస్తున్నాము, బజార్లు ఊడుస్తున్నాము, భజనలు చేస్తున్నాము, ఉపన్యాసాలు ఇస్తున్నాము," ఇంతేనా మనం చేయవలసిన సేవ? వీధులను శుభ్రపరచవచ్చు, కాలువను శుభ్రపరచవచ్చు, ఉపన్యాసాలు చెప్పవచ్చును. కానీ, జనులలో వస్తున్న మార్పు ఏమిటి? మనస్సును పరివర్తన గావించే ప్రయత్నము సేవాదళ్ చేపట్టాలి. ఈ భౌతికమైన పనులు చేయవచ్చు, చేయకూడదని చెప్పటము లేదు, వీటితోబాటు జనులలో మార్పుకూడా రావాలి. ఈ టంబ్లరులో నీరు పోసుకొని మనము త్రాగుతున్నాము. ఈ టంబ్లరు చుట్టూ మాత్రమే పరిశుద్ధము చేసి లోపల అశుద్ధంగా ఉంటే నీరు త్రాగటానికి వీలౌతుందా! లోపలా వెలుపలా పరిశుద్ధము చెయ్యాలి. ప్రత్యేకంగా లోపలనే పరిశుద్ధము కావాలి.

అట్లే, గ్రామాలను బాహ్యంగా పరిశుద్ధం చేయటంతో పాటు గ్రామములో నివసించే వ్యక్తులయొక్క హృదయాలు పరిశుద్ధము గావించే విషయములో కూడా ముందంజ వేయాలి. ఒక్కొక్క పల్లె తీసుకొందాము. ఈ పల్లెలలో కొన్ని నూర్లు, వేలు ఉండే ప్రజలలో ఎన్ని దుర్గుణాలున్నాయి, ఎన్ని దురభ్యాసములు ఉంటున్నాయి, ఎన్ని దురాచారము లుంటున్నాయి అనేదాన్ని మొట్టమొదట మనము యోచించి ఆ దురభ్యాసములను, దుర్భావములను, దుశ్చేష్టలను మాన్పించి వారిని సన్మార్గములోకి తెప్పించే ప్రయత్నము చేయాలి. రూరల్ డెవలప్‌మెంట్ అని ప్రభుత్వము కూడను చాలావరకు ప్రయత్నము చేస్తున్నది, కోట్లకొలది వ్యయము చేస్తున్నది. ఆ గ్రామములకు ఆసుపత్రులు కట్టటమో, అనుకూలములు చేయటమో, నీరు సప్లై చేయటమో

ఇలాంటివి చేస్తున్నారు. ఇవి కూడను వారికి అవసరమే. కానీ, సత్యసాయి సేవాసంస్థలవారు చేయవలసిన పరిశుద్ధము ఇంకా పవిత్రమైనదిగా ఉంటున్నది. మనము ఏ పల్లెలో ప్రవేశించినప్పటికిని ఆ పల్లెలో జరుగుతున్న దురాచారములు, దురభ్యాసములు ఏమిటని మొట్టమొదట గుర్తించాలి. జూదము, త్రాగుడు ఈవిధమైనవాటివల్ల ఎన్ని కుటుంబాలు నాశనమైపోతున్నాయి! కనుక, ఇలాంటివి గుర్తించి, వారికి చక్కని బోధలుచేసి త్రాగుడు, జూదములు మాన్పించి అనేకవిధములుగా వారిని సరిచేసినప్పుడే నిజముగా 'రూరల్ డెవలప్‌మెంట్' అనేది జరగటానికి వీలౌతుంది.

"మేము కొన్ని గ్రామాలు దత్తత తీసుకొన్నాము... ఈ గ్రామములో చాలా అభివృద్ధి వచ్చింది, చాలా మార్పు వచ్చింది స్వామీ" అని చెబుతుంటారు చాలామంది. ఏమి మార్పు వచ్చిందని ప్రశ్నించినప్పుడు అందరూ భజనకు వస్తున్నారు, నగరసంకీర్తన సల్పుతున్నారు అంటారు. ఇవా మనం తెప్పించవలసిన మార్పులు? వాని దురభ్యాసమును మాన్పించకపోతే, వాడు తప్ప తాగి భజనకు వచ్చి తప్పుడు తాళాలు వేసుకొంటూ ఊగుతూ పడుతుంటే అది భజన చేయటమా?! వాడు భజనకు రాకపోయినా ఫరవాలేదు, వాని దురభ్యాసమును మాన్పించండి. అదే గొప్ప సేవ. ఇలాంటి దురభ్యాసములు మాన్పించటంలో మన సత్యసాయి సేవాసంస్థలవారు ఈనాటినుండి కొన్ని నూతనమైన పద్ధతులను అవలంబించాలి.

ప్రేమస్వరూపులారా! జీవులను బాధించి, దేవుని పూజించినంత మాత్రమున అది భక్తి కాదు. మొట్టమొదట మనము పరులయొక్క దుర్భావములను, దురభ్యాసములను దూరము చేసేముందుగా మనలో అలాంటి దుర్భావములు, దురభ్యాసములు లేకుండా చూచుకోవాలి. అలాంటివారే ఈ సేవాసంస్థలో చేరటానికి అధికారము ఉంటున్నది. మానవునియొక్క ఊహలు, మాటలు, చూపులు, వేషములు ఇవన్నియూ తన నిజస్వభావాన్ని నిరూపిస్తుంటాయి. కనుక, సేవాదళముయొక్క తలంపులు పవిత్రమైనవిగా ఉంటుండాలి. వారియొక్క పలుకులు పవిత్రమైనవిగా ఉంటుండాలి. వారు వేసే డ్రస్సు పరిశుద్ధమైనదిగను, గౌరవప్రదమైనదిగను ఉంటుండాలి. పరులను అనుసరించే అనుకరణలో మాత్రము సేవాదళ్ ఏమాత్రము ప్రవేశించ కూడదు. సేవాదళమువారికి ఏవిధమైన ఆడంబరముగాని, అనుకరణగాని ఉండకూడదు. ఇది ప్రధానమైన క్వాలిటీ. ఎవరో ఒకరు బెల్‌బాటమ్ వేసుకొన్నారంటే తాను బెల్‌బాటమ్ వేసుకోవటం! ఇది బజార్ల వెంబడి ఊడుస్తూ పోతుంది, ఇంక తాను ఏమి ఊడ్చేది! నిజంగా ఆడంబర రహితమైన సేవకులుగా మనము తయారుకావాలి. తలలు పెంచుకోవటము, సైడ్‌బర్న్ పెంచుకోవటము ... ఈవిధమైన వికారవేషములతో వీరు సేవను ఏరీతిగా చేయగలరు?! ఇది కేవలము మమకార అహంకారములను పెంచుకొనే మార్గములే తప్ప ఇవి సేవావృత్తులకు సంబంధించినవి కావు. కనుక, అనుకరణ చాలా ప్రమాదమైనది.

ఈనాడు అనుకరణ అనే కొత్త వ్యాధి ఒకటి బయలుదేరినది. మనకొక మనస్సున్నది. బుద్ధి యున్నది, సంకల్పమున్నది. మన దేశమందు పరమ పవిత్రమైన ప్రాచీన సంస్కృతి యున్నది. వీటిని విస్మరించి, పరుల మనస్తత్వము, పరులయొక్క సంకల్పములు, పరుల సంప్రదాయములను అనుకరించి వారి బానిసలుగా బ్రతకటము బలహీనత కాక ఇంకేమి?! ఒక చిన్న విత్తనము; దానిని మట్టిలో పెట్టినాము; దానికి నీరు పోసినాము; తరువాత ఎరువు వేసినాము; తదుపరి, అది మొక్కగా బయలుదేరి, వృక్షముగా పెరిగినది. మట్టితో కలిగిన సంసర్గమువలన అది మట్టిగా మారలేదు; నీరుతో సఖ్యము చేసినదానివలన అది నీరుగా మారలేదు. ఎరువుతో చేరి ఎరువు కాలేదు. అన్నిటిలోనూ తనకు ఏది మంచిదో దానినే స్వీకరించి తాను తానుగనే పెరిగినది. అట్లే, పదిమందితో చేరినపుడు ఆ పదిమందిలోని మంచితనమును గ్రహించి, తన తత్త్వమును కాపాడుకొనుట బుద్ధిమంతుని లక్షణము.

## సోదరభావం కంటె ఏకాత్మభావం గొప్పది

మన సేవ యావత్ ప్రపంచమునంతటినీ ఏకత్వముగా రూపొందించే సంబంధ బాంధవ్యము నేర్పరచుతుంది. మీరనుకోవచ్చు. మేమంతా బ్రదర్స్‌వలె జీవిస్తున్నామని. కానీ, ఈ సోదరభావంకూడ నా దృష్టిలో చిన్నస్థాయి. 'బ్రదర్‌హుడ్ ఆఫ్ మేన్, ఫాదర్‌హుడ్ ఆఫ్ గాడ్'

(మానవసోదరత్వము, దైవపితృత్వము) అంటున్నారు. దీనికంటే ఉన్నతమైనది ఒకటి ఉన్నదనే సత్యాన్ని గుర్తించుకోవాలి. బ్రదర్స్‌గా ఉన్నవారుకూడ తమలో తాము కలహించి, ఆస్తిపాస్తుల నిమిత్తమై ఎన్నో ప్రమాదాలకు గురియైనవారున్నారు. ఒక ఇంటికే నాలుగు తలుపులు తీసే బ్రదర్స్ ఈనాడు ఉన్నారు. కాబట్టి, మన సేవాదళ్ సభ్యులు 'బ్రదర్‌హుడ్ ఆఫ్ మేన్' కంటే యింకా ఉన్నతస్థాయి అయిన "ఏకాత్మ భావం" కలిగి ఉండాలి. "ఏకం సత్ విప్రాః బహుధా వదంతి," "ఏకోహం బహుస్యామ్," "ఏకం యేవ అద్వితీయం బ్రహ్మ," "ఈశ్వర స్సర్వభూతానాం," "ఈశావాస్యమిదం సర్వం" - ఈ ఉపనిషద్వాక్యముల అంతరార్థం యిదే. ఒక్క ఆత్మయే అనేక జీవులలో దేహరూప విభాగంలో అనేకముగా గోచరిస్తున్నదని, ఈ అనేకత్వములోని ఏకత్వమనే సత్యమును ఉపనిషత్తులు ప్రబోధిస్తూ వచ్చాయి. ఏదో ఒకరికి అపకారం చేసి, కీడును కలిగించి, బాధను కలిగిస్తున్నామని ఉప్పొంగరాదు. అది ఎవరికో కాదు, నీకు నీవే చేసుకుంటున్నావు. ఎవరికో సహాయం చేస్తున్నానని, మేలు చేస్తున్నానని భావించరాదు; అది నీకు నీవే చేసుకుంటున్నావు. ఏది చేసినా, ఏది చెప్పినా, ఏది తలచినా, అది నీకు నీవేకాని పరులకు కాదు అనే అంతరార్థాన్ని గుర్తించాలి.

ఒక చిన్న ఉదాహరణ: ఒకనాడు ఒక యింటిలో మూడు కప్పుల కాఫీని తయారుచేశారు. అందులో భార్య ఒక కప్పు, భర్త ఒక కప్పు త్రాగితే యింకా ఒక కప్పు మిగిలింది. ఈ ఒక్క కప్పు కాఫీని చెరిసగం త్రాగుదామా? లేక ఎవరో ఒకరు మాత్రమే త్రాగుదామా? అని అనుకుంటూ ఉండే సమయంలో ఎవరో ఒక స్నేహితుడు వచ్చాడు, అతనికి ఆ కప్పు కాఫీ యిచ్చారు. రెండు నెలలు గడిచాయి. మూడవ నెలలో ఆ స్నేహితునితో ఏదో పని వచ్చి, ఈ గృహయజమాని అతని యింటికి వెళ్లాడు. ఆ స్నేహితుడు ఆనాడు ఒక కప్పు కాఫీ యితనికి యిచ్చాడు. చూశారా! ఇతడు రెండు నెలల క్రిందట అందించిన కాఫీ ఈనాడు తిరిగి వచ్చేసింది. అదేవిధముగా ప్రతి కర్మ మనం తెలిసి చేసినా, తెలియక చేసినా మనకు తిరిగి చేరుతుంది. చెడ్డ చేసినా, మంచి చేసినా ఏదో ఒక కాలంలో మనకే తిరిగి వస్తుంది.

**కర్మమున పుట్టు జంతువు**
**కర్మముననె వృద్ధి పొందు, కర్మమున చనున్**
**కర్మమె నరులకు దైవము**
**కర్మమె సుఖదుఃఖములకు కారణమిలలోన్.**

కనుకనే, నీవు పవిత్రమైన కర్మలు, నిష్కామకర్మలు భగవత్ప్రీత్యర్థమనే భావంతో చేయటం, చిత్తశుద్ధితో చేయటం, అనంతమైన ప్రేమతో ఉండటం - ఈ మూడింటిచేత దైవత్వాన్ని అతిసులభంగా చేరటానికి అవకాశం ఉంటుంది. ఈవిధమైన సేవద్వారా ఈవిధమైన కర్మలద్వారా దైవాన్ని పొందడానికి, దైవాన్ని చెందడానికి తగిన రాజమార్గం వేసుకోవటం సేవాదళ్ సభ్యులకుకానీ, అధికారులకుకానీ సరైన మార్గంగా విశ్వసించాలి.

### *భగవంతుడు కర్మఫల ప్రదాత*

ఈ నిష్కామకర్మ అనేదానిని ప్రత్యేకంగా భగవద్గీత విశిష్టమైన మార్గంగా ప్రబోధించింది. 'కర్మణ్యేవ అధికారస్తే' - నీవు కర్మకు మాత్రమే అధికారివి కానీ ఫలితానికి కాదు అన్నాడు. భగవంతుడు కర్మఫల ప్రదాత కానీ కర్మదాత కాడు. నీవు ఎట్టి కర్మలు ఆచరిస్తావో అట్టి కర్మఫలితాన్ని అందిస్తాడు. నీవు సత్కర్మలు చేయక, ఎన్ని విధముల ప్రార్థించిననూ భగవంతుడు ఆలకించవచ్చును గానీ, నీ ప్రార్థనలను, అభీష్టమును ఫలింపజేయడానికి ముందుకు రాడు. ఒక చిన్న ఉదాహరణ: ఆనాడు మహా భారతమునందు భారతీయ సంప్రదాయం ప్రకారం సంక్రాంతి దినమున చెఱకు తినడం వాడుక. కొంతమంది గోపికలు తనకు అందించిన చెఱకును కృష్ణుడు లీలగా తింటున్నాడు. ఈ ఆధునిక కాలమువలె చెఱకును పిప్పి చేసి రసము తీసే మిషన్లు ఆనాడు లేవు. కృష్ణుడు ఆ చెఱకును తింటూ ఉన్నప్పుడు చిటికెన వ్రేలు కోసుకొని రక్తపుబొట్టు క్రిందికి కారింది. అనేకమంది గోపికలు, సత్యభామ, రుక్మిణి, జాంబవతి అంతా ఉంటున్నారక్కడ. ద్రౌపది కూడా అక్కడే ఉంది.

సత్యభామకు కృష్ణుని భార్యనని అహంకారం మెండు. వెంటనే కృష్ణుని వ్రేలికి కట్టు కట్టడానికి గోపికలను వెళ్ళి

బట్టలను తెమ్మని ఆదేశించింది. గోపికలు అటూ, ఇటూ పరుగెడుతున్నారు. ప్రక్కనే ఉన్న ద్రౌపది మాత్రం వెంటనే తన చీరను చించి "కృష్ణా!" అని కట్టు కట్టింది. సరే, ఇంతలో కావలసినంత బ్యాండేజిలు వచ్చినాయి. కానీ అవి కృష్ణునికి నిరూపయోగంగా మారినవి.

కొంతకాలమైన తరువాత దుష్టులు, దుర్మార్గులు అయిన దుర్యోధన దుశ్శాసనులు ద్రౌపదిని పరాభవం చేయడానికి సభకు ఈడ్చుకొని వచ్చారు. ద్రౌపది కృష్ణుని "ద్వారకావాసీ! గోకులవాసీ! ఆపద్బాంధవా! అనాథ రక్షకా! హృదయవాసీ!" అని పలువిధాలుగా ప్రార్థిస్తూ వచ్చింది. కృష్ణుడు ఇవన్నీ వింటున్నాడు. కానీ ఆమెకు ఈవిధమైన సహాయం చేయడానికి పూర్వం ఈమె చేసిన కర్మయేమిటి? ఏమైనా మంచి చేసిందా? అని యోచించాడు. ఈరకమైన సహాయం పొందటానికి తగిన కర్మ ఇదివరకు ఆమె ఆచరించిందా? అపుడే ఆమెకు సహాయం చేయడానికి వీలవుతుంది. యోచన చేశాడు. ఆనాడు సంక్రాంతి దినమున ఆమె తన చీరను చించి చిటికెన వ్రేలికి కట్టుకట్టింది. కనుక, ఈనాడు ఆమెకు చీరలివ్వడానికి వీలుంది. అదే చిటికెన వ్రేలును తిప్పాడు. అదే చీర అక్షయంగా వచ్చింది.

కనుకనే, "కర్మణ్యేవ అధికారస్తే"– మనము కర్మలకు అధికారులం కావాలి. సత్కర్మలు ఆచరించినప్పుడు సత్ఫలితాన్ని భగవంతుడు అందిస్తాడు. కనుకనే, ఆనాడు గోపికలంతా "తస్మై నమః కర్మణే" – అని మొట్టమొదట "మేము చేసే కర్మకు నమస్కారము" అని నమస్కారం చేసి, ఆ కర్మను ఆచరించేవారు. ఎందుకనగా, మనము దేవునికి నమస్కారం చేసినా, మనము చేసినవి సత్కర్మలు కాకపోతే దేవుడు కూడా అనుగ్రహించడు. కర్మలు సరియైనవి కానినాడు సరైన ఫలితము రాదు. కనుకనే మన మంచికి గాని, చెడ్డకుగాని మనము చేసిన కర్మలే ఫలితాన్ని అందిస్తాయని, కర్మలకు నమస్కారం చేస్తూ వచ్చారు ఆనాడు గోపికలు. ఎలాంటి కర్మలు మంచివి అంటే, భగవత్ప్రీత్యర్థము చేసే కర్మలు, భగవంతుని ప్రసన్నుని చేసే కర్మలు.

## ఆజ్ఞను పాలిస్తే అనుగ్రహం లభిస్తుంది

గోకాక్ తన ప్రసంగంలో, "భగవాన్ ఈజ్ ది గ్రేటెస్ట్ వాలంటీర్", ఇంకా "భగవాన్ ఈజ్ ది గ్రేటెస్ట్ సేవాదళ్ లీడర్" అన్నాడు. కనుకనే ఆ 'లీడర్'ను మీరు ఫాలో చేయాలి. ఎందుకనగా తెల్లవారినది మొదలు రాత్రి వరకు ప్రతి చిన్న కార్యమును తాను స్వయంగా చేసి చూపుతున్నాడు. అందువలననే "మై లైఫ్ ఈజ్ మై మెస్సేజ్" (నా జీవితమే నా సందేశం) అని చెబుతాను. భగవాన్ వేరు, భగవాన్ వాణి వేరు కాదు. కనుక మీరు స్వామి చేసినట్లుగా చేయుటము, స్వామి చెప్పినట్లుగా చేయుటము – ఈ రెండు రకములుగా చేయటంచేత ఇదే మీకు భగవంతుని అనుగ్రహమును, సన్నిహితత్వమును కలిగిస్తుంది. ఈవిధంగా చేస్తే మీరు స్వామి అనుగ్రహానికి పాత్రులవుతారు. స్వామికి కావలసినది నిష్కామ కర్మ; ఫలితం ఆశించకుండా చేసే సేవ. "నాకు పేరు రావాలి, నాకు పదవి రావాలి, నా పేరు పెద్ద అక్షరాలతో పేపరులో పడాలి" అని అనుకోకూడదు. సేవాదళ్ కార్యవర్గంలో ఎవరెవరికీ అభిప్రాయ భేదాలు లేకుండా చూసుకోవాలి. వ్యక్తిగతమైన ద్వేషములకు ఏమాత్రం అవకాశం ఉండకూడదు. ఎవరిని నీవు ద్వేషించినా నీ స్వామిని నీవు ద్వేషించినవాడవవుతావు. తెలిసో తెలియకో కొన్ని పొరపాట్లు రావచ్చు. "పాస్ట్ ఈజ్ పాస్ట్, ఫర్గెట్ ది పాస్ట్" జరిగిపోయింది నీవు మరచిపోయి, ఇకనైనా అన్యోన్యతతో, ఏకాత్మభావంతో సేవలో పాల్గొనుటచేత మన సత్యసాయి సేవాదళ్ సభ్యుల కీర్తి ప్రపంచవ్యాప్తం అయ్యే అవకాశం ఉంటుంది. ఆదర్శవంతంగా ఉండటానికి అవకాశం ఉంటుంది. నిస్వార్థ సేవ అనే ఆదర్శంపైన మీ జీవిత సౌధాన్ని నిర్మించుకోవాలి. నిష్కామసేవద్వారా మీరు మిగిలిన ఆదర్శాలనన్నీ చేర్చుకుంటారు. దీనినే మీరు లక్ష్యమునందుంచుకొని, దీనినే ఆదర్శంగా ఉంచుకొని, మున్ముందు మీరు చేయవలసిన కార్యములలో ముందంజ వేస్తారని నేను ఆశిస్తూ, ఆశీర్వదిస్తూ నా ప్రసంగాన్ని విరమిస్తున్నాను.

**('దివ్యసారథ్యంలో శ్రీ సత్యసాయి సేవాసంస్థలు' నుండి సంకలితము)**

# దివ్యసన్నిధిలో నేర్చిన పాఠాలు

❖ పి. కృష్ణ కుమార్ ❖

## త్రాగునీటి పథకం నేర్పిన పాఠాలు

అనంతపురం త్రాగునీటి పథకం పనులు ముమ్మరంగా జరుగుతున్న రోజులవి. ఆ పథకంకోసం సెంట్రల్ ట్రస్ట్ దాదాపు రూ॥ 300 కోట్లు వెచ్చించింది. ఆధ్యాత్మిక కోణంలో అన్నిటికీ తామే కర్త అయిన స్వామివారు, లౌకిక కోణంలో సహితం పథకం రూపకల్పన దగ్గర్నుంచి పూర్తయ్యేవరకు, ప్రతి ఒక్కటీ తామై నడిపించారు. ఇందులో భాగంగా బిల్లుల పరిశీలన, చెల్లింపులకు పంపడం, సరఫరాదారులతో సంప్రదింపులు, ఒప్పందంలోని లావాదేవీల విషయంలో కాంట్రాక్టర్‌తో సమన్వయం- ఇవన్నీ నాకు అప్పగించిన బాధ్యతలు. సర్వదా, కర్తను నేను కానన్న స్పృహతో మెలగడంవల్ల, అన్నీ సజావుగా సాగిపోయాయి. ఎప్పుడైనా కించిత్తు అహం నాలో పొడసూపితే, స్వామి మృదువుగా మునివేళ్ళపై తట్టి, దైవం చేతిలో పరికరంగా ఉండాలన్న పాఠం బోధించేవారు.

ఒకసారి నా అంతట నేనుగా ఆశ్రమవాసులతో మాట్లాడి సెంట్రల్ ట్రస్టుకు విరాళాలుగా ఇచ్చేందుకు, వారి నుంచి సుమారొక పాతిక చెక్కులు దాక ప్రోగుచేసేను. పదివేల నుంచి పాతికవేల రూపాయలదాక రాసిచ్చిన చెక్కులవి. వాటిని తీసుకువెళ్ళి స్వామికి సమర్పించినప్పుడు వెంటనే స్వామి, "ఇలా విరాళాలు సేకరించాలనే ఆలోచన నీకు ఎవరిచ్చారు?" అని అడిగారు. **"గత డెబ్బై ఏళ్లుగా, నేను ఎవరినీ ఏమీ అడగలేదు. మన సంకల్పం స్వార్థరహితమయినప్పుడు, మనం తలపెట్టిన కార్యానికి డబ్బు దానంతట అదే సమకూరుతుంది. మనం ఎవరినీ విరాళాలు అడగకూడదు. డబ్బు తప్పక వస్తుంది. లోకకళ్యాణంకోసం చేపట్టే కార్యక్రమాలకోసం ఇప్పుడే కాదు, భవిష్యత్తులో కూడా అవసరాలకు తగినంత డబ్బు సమకూరుతుంది.** విరాళాలు ఇచ్చినవారందరికీ వారివారి చెక్కులు తిరిగి ఇచ్చెయ్యి. ఆశ్రమంలో వారు చేస్తున్న సేవలకు స్వామి సంతోషిస్తున్నారని, అవి డబ్బు కన్నా ఎంతో విలువైనవని వారికి చెప్పు. వారు ఇలాగే సేవలు కొనసాగించాలని, అది వారికెంతో మేలు చేస్తుందని చెప్పు" అన్నారు.

ట్రస్టు చేసే సేవలకు దోహదపడాలనే ఉద్దేశ్యంతో నేను చేసిన ఈ చిరుప్రయత్నానికి స్వామి సంతోషిస్తారని అవివేకంగా ఆలోచించినా, చక్కని పాఠం నేర్చుకున్నాను. ఒకవిధంగా శ్రమకు తగిన ఫలితం దక్కింది.

## ఓర్మితో సత్ఫలితాలు

ప్రశాంతినిలయంలో ఉన్న కాలంలో, స్వామి నాకు మరికొన్ని పాఠాలు నేర్పాలని నిర్ణయించుకున్నారు. మరింత గురుతర బాధ్యతలు నిర్వహించగల పరికరంగా నన్ను మలుచుకోవాలన్నది వారి సంకల్పం కావచ్చు. స్వామిది

వేయితల్లుల ప్రేమ. అలాంటి దివ్యమైన ప్రేమను పొంది కూడా మనమేమీ మారకపోతే, మనని సరైన దోవలో పెట్టే ఇతర పద్ధతులు ఉండనే ఉన్నాయి. ఆరేళ్లపాటు నన్ను ఎంతో చేరదీసిన స్వామి, హఠాత్తుగా నాతో మాట్లాడడం మానేశారు. దిక్కుతోచని స్థితిలో మానసికంగానూ, శారీరకంగానూ కృంగిపోయాను. నాకు లభించిన స్వామి సాన్నిధ్యం, నేను నిర్వహిస్తున్న పదవీ బాధ్యతలు, స్వామికి నామీద ఉన్న నమ్మకం వగైరాల దృష్ట్యా, ప్రస్తుత పరిస్థితిని అస్సలు ఊహించలేదు. స్వామి మనని దూరం పెట్టినపుడే, మన వ్యక్తిత్వానికి అసలు పరీక్ష మొదలవుతుంది. తాము తీసుకునే చర్యలకు కారణాలేమిటో స్వామి చెప్పరు. మనవల్ల ఏమి తప్పు జరిగిందో కూడా చెప్పరు. మనమే గ్రహించుకోవాలి. జరిగిన సంఘటనలకు సంబంధించి మన ప్రతిస్పందన, మన ఉద్దేశ్యాలు, ప్రవర్తనల గురించి, నిరంతరం ఆత్మపరిశీలన జరగాలంటారు. అది చాలా కష్టమైన పని. అందుకు కారణం, సామాన్యంగా మనం మన వాస్తవ స్థితి ఏమిటనేది గుర్తించడానికి, మన తప్పులను ఒప్పుకోవటానికి ఇష్టపడం. మనని మనం సమర్థించుకోవడానికి నెపం దేవుడిపైనో, మరొకరిపైనో నెట్టేస్తాం. మన మానసిక స్థితి అలా ఉన్నప్పుడు, మన గురించిన వాస్తవ స్థితి మనకు ఎలా తెలుస్తుంది?! ఎలాగైనా సరే, ఎక్కడ తప్పు జరిగిందో తెలుసుకోవాలని నేను ప్రతిరోజు ప్రయత్నిస్తూనే ఉన్నాను. అందుకు పునస్సమీక్ష, ఇతరులతో చర్చించి వాళ్ళ అభిప్రాయాలు తెలుసుకోవటం, అటువంటి పరిస్థితిని ఇతర భక్తులు ఎలా ఎదుర్కొన్నారో తెలుసుకునేందుకు వాళ్ళు వ్రాసిన పుస్తకాలు చదవడం వంటి పలు మార్గాలను అనుసరించాను. ఒక్కోసారి మనలోని ప్రతికూల భావనలు త్వరగా బయటకుపోయేలా కొన్ని సన్నివేశాలు కల్పించి, స్వామివారు మనకో పరిష్కారం దొరికేలా చేస్తారు.

1997లో స్వామి పుట్టుపండుగ వేడుకలకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఆ సందర్భంగా స్వామి స్వయంగా తమ విద్యార్థులకు, సిబ్బందికీ దుస్తులు పంచిపెడుతున్నారు. ఇక్కడయితే స్వామి తప్పకుండా నన్ను చూస్తారు, నాకు కూడా దుస్తులు ప్రసాదిస్తారనే నమ్మకంతో నేను మందిరం వరండాలో ఒక మంచి చోటు చూసుకుని కూర్చున్నాను. స్వామి పంపిణీ ప్రారంభించారు. స్వామి ఏదో ఒక లైన్లో ప్రవేశించి, ఆ లైను చివరివరకు దుస్తులు పంచి మరొక లైన్లోకి వెళతారని అనుకుంటాం. కాని అన్నివేళలా అలా జరుగకపోవచ్చు. 'అమ్మయ్య, పక్క లైన్ అయ్యింది, స్వామి ఇక నావైపుకు వస్తారు, అనుకునేలోగానే, స్వామి మరోవైపు మళ్ళుతూ పంపిణీ కొనసాగించారు. నాలో క్షణక్షణం ఉత్కంఠ పెరిగిపోతోంది. స్వామివారు నాకు దుస్తులు ప్రసాదించకపోతే సాటివారిలో నా పరువుపోతుందనే బెంగ నన్ను తినేస్తోంది. చివరికి నాకు ఇవ్వకుండానే స్వామి, ఆ రోజుకి దుస్తుల పంపిణీ ముగించారు. ఆ ఆశాభంగం తట్టుకోవడం నావల్ల కాలేదు. అవమానాన్ని (కాదు, ఆశీర్వాదమే!) దిగమింగి, ఏమీ జరగనట్లే ప్రవర్తించడం మొదలెట్టాను.

సంక్రాంతి వెళ్ళిన రెండు నెలలకి ఒక రోజున, ప్రశాంతినిలయంలో ఎవరో నా గదికి వచ్చి, తలుపు తట్టారు. తలుపు తీసేసరికి, అక్కడ చాలా సీనియర్ భక్తులొకరు, చేతిలో ఒక ప్యాకెట్ పట్టుకుని నిలబడి ఉన్నారు. అది నాకు ఇస్తూ, "స్వామి నీకోసం రెండు డ్రెస్సులు పంపారు. పుట్టు పండుగనాడు నీకు ఇవ్వలేదని, ఇప్పుడు రెండు జతలు పంపుతున్నానని చెప్పమన్నారు" అని చెప్పారు.

ఆ మాట చెవిన పడగానే ఎంత ఆనందించి ఉంటానో మీరే ఊహించుకోండి. ఒకపక్కన ఆనందపడుతూనే, ఆ సంఘటన నుంచి నేర్చుకోవలసిన పాఠమేమయి ఉంటుందని ఆలోచనలో పడ్డాను. మనని సంస్కరించే పని, రోడ్డును రిపేరు చేయడం వంటిదంటారు స్వామి. రిపేరులో ఉన్న దోవన ఎవరూ పోరు కదా. అలాగే స్వామి కూడా మనల్ని సంస్కరణకు గురి చేస్తున్నప్పుడు, మనలో వస్తున్న మార్పుకు ఆటంకం కలగకూడదని, మనల్ని తప్పుకు తిరుగుతారు. స్వామిచేత నిర్లక్ష్యానికి గురయినప్పుడు మన మెంత బాధపడతామో, మన వేదన చూసి, స్వామివారు కూడా అంత బాధపడతారు. కానీ, ఆత్మపరిశీలన ద్వారా మనలో చోటుచేసుకునే మార్పు ప్రక్రియ పూర్తయ్యేవరకు వారు వేచి ఉంటారు. పరిస్థితి చక్కబడాలని, మనకన్న

స్వామివారే ఎక్కువ ఆరాటపడతారు. దైవానికి కాఠిన్యాన్ని ఆపాదించడం కేవలం అజ్ఞానం. దైవమెప్పుడూ పరిపూర్ణ ప్రేమస్వరూపుడే. నిజానికి ప్రేమే స్వామి, స్వామే ప్రేమ.

## వ్యామోహం బంధం-నిర్వ్యామోహం ముక్తి

స్వామి ఒకసారి నాకొక కానుక ఇచ్చారు. అది ఇచ్చిన వెంటనే నేను, "స్వామీ, నాకున్నవన్నీ మీరు ఇచ్చినవే. అదే పదివేలు. మళ్లీ ఇప్పుడీ బహుమతి దేనికి?" అన్నాను. "నువ్వు అడిగావా? నేను ప్రేమతో ఇస్తున్నాను. తీసుకో. అది నిన్నేమీ కట్టి పడెయ్యదులే. కానీ నువ్వు ఏమైనా అడిగితే మాత్రం, అది నీకు బంధమవుతుంది సుమా" అన్నారు. ఆధ్యాత్మికతను నేర్పే చక్కని పాఠం! మనమడిగితే అది కోరికయి, బంధకారణమవుతుంది. అనంతమయిన ప్రేమతో దైవము తనకు తానుగా ఇచ్చేది స్వీకరించడం బంధం కాబోదు. అసలు జీవితంలో ఏదైనా ఎందుకు కోరుకోవాలి?! బంధవిముక్తికి ఇంతకన్న రాచబాట మరేముంటుంది?!

ఈ కథ అంతటితో అయిపోలేదు. మా దగ్గరి బంధువు ఒకరు, నన్ను చూడడానికి వైట్‌ఫీల్డ్‌లో నా గదికి వచ్చారు. ఆయన వెళ్ళేటప్పుడు ఆయనకు ఏదైనా ఇవ్వాలనిపించింది. నాకు స్వామి ఇచ్చిన కానుక గుర్తుకొచ్చింది. ఆయనకు ఇద్దామని దానిని బయటకు తియ్యబోయేసరికి, స్వామి ఎంతో ప్రేమతో నాకు ఇచ్చిన కానుకను మరొకరికి ఇవ్వడం సరికాదనిపించింది. మూడుసార్లు ప్రయత్నించి విరమించుకున్నాను.

పదిహేను రోజుల తరువాత, స్వామి సన్నిధిలో నెలవారీ సమావేశంకోసం ప్రశాంతినిలయం వెళ్లాను. ఆ మధ్యాహ్నం స్వామి నన్నూ, నా సహోద్యోగిని ఇంటర్వ్యూకు పిలిచారు. కాస్సేపు వైట్‌ఫీల్డు ఆస్పత్రి వ్యవహారాలు మాట్లాడాక, ఉన్నట్టుండి నాకేసి తిరిగి, చిరునవ్వు చిందిస్తూ, "నేను నీకు బహుమతిగా ఇచ్చిందేదైనా మరొకరికి ఇవ్వడం తప్పు కాదు. నేను నీకు ప్రేమతో ఇచ్చాను. నువ్వుకూడా ప్రేమతో దానిని మరొకరి ఇవ్వాలనుకున్నావు. అందులో తప్పేముంది?" అన్నారు.

ఆ మాట వినగానే నాకు ఊపిరాడనంత పనయింది. పదిహేను రోజుల క్రిందట, వైట్‌ఫీల్డ్‌లో నాకు వచ్చిన ఆలోచన గురించి నేనెవరికీ చెప్పలేదు. ఇప్పుడిక్కడ పర్తిలో స్వామి యథాలాపంగా నా సందేహం తీర్చారు. ఇలా స్వామి తమ సర్వజ్ఞతను చూపడం నాకేమీ కొత్త కాదు. లెక్కలేనన్నిమార్లు జరిగింది. అసలీ విశ్వంలో వారికి తెలియనిదేమైనా ఎలా ఉండగలదు!

## భక్తుల నమ్మకాన్ని నిలబెట్టాలి

ఒకసారి స్వామి సన్నిధిలో కార్యనిర్వాహకులం కొందరం సమావేశమయినప్పుడు, ఏదో ఒక విషయంలో ఒక ఖర్చు అనావశ్యకమనిపించి, ఆ విషయాన్ని విన్నవించాను. స్వామివారి సొమ్మును మనము వృథా చెయ్యకూడదన్నాను. స్వామివారు వెంటనే నా మాటను సరిదిద్దారు. **"సొమ్ము స్వామిది కాదు. స్వామిమీద నమ్మకంతో, సద్వినియోగమవుతుందనే ఉద్దేశ్యంతోనూ, భక్తులు ఇచ్చే సొమ్మది. వారి నమ్మకాన్నెప్పుడూ మనము వమ్ము చేయకూడదు. ఆ సొమ్ము వాళ్ళు ఎందు నిమిత్తం ఇచ్చారో, ఆ పనికి వినియోగపడేలా మనం జాగ్రత్తగా ఖర్చు చెయ్యాలి. లేకపోతే దుర్వినియోగం చేసినట్టవుతుంది"** అన్నారు.

## విశాల హృదయం

ఒకానొక సందర్భంలో భక్తులందరికీ పంచిపెట్టగా మిగిలిన ప్రసాదం ప్యాకెట్లను అమ్మకానికి పెట్టాలన్న ప్రతిపాదనను కొందరు కార్యనిర్వాహకులు స్వామి సన్నిధిలో ఉంచగా, 'అల్పబుద్ధులు, అల్పబుద్ధులు' అంటూ వాళ్ళను స్వామి గట్టిగా మందలించారు. ఆ సమయంలో అక్కడే ఉన్న నాతో, "కనీసం నీవైనా వీళ్ళ మాదిరి ప్రవర్తించకుండా జాగ్రత్తపడు. ఈరోజు ప్రసాదంగా పంచిన స్వీటునే మర్నాడు అమ్మకానికి పెడితే భక్తులు ఏమనుకుంటారు?! చిన్నచిన్న లాభాలకోసం ఆశ పడకూడదు. మనం ఎప్పుడూ విశాల హృదయంతో ఉండాలి. అయినా విశాల హృదయం అలవడాలంటే కూడా ప్రాప్తం ఉండాలిలే" అంటూ నాకొక గొప్ప గుణపాఠం నేర్పారు.

అగోచరమయిన దైవకృపకు, ప్రసాదం అనేది భౌతిక రూపం. లౌకిక వ్యవహారాలలో మునిగిపోయి మనము

దైవము మనపై అపారంగా కురిపించే కృపావృష్టిని గుర్తించలేకపోతుంటాం. ప్రసాద రూపంలో దైవం తన కృపను కురిపిస్తున్నప్పుడు ఆ ప్రసాదం, మనకు దైవానికి నడుమ ఉన్న ప్రేమబంధాన్ని గుర్తుచేస్తుంది. అది హృదయంతో హృదయానికి ఉండే అనుబంధం. ప్రసాదం స్వీకరించినప్పుడల్లా మనం దైవాన్ని గుర్తుచేసుకుంటాం. అయితే, దైవాన్ని సదా మన ఆలోచనల్లో నిలుపుకోవడానికి, మనకు లభించే ప్రతి ఒక్కటీ ప్రసాదంగానే స్వీకరించాలి. అవి తినుబండారాలు కావచ్చు, నిత్యజీవితంలో జరిగే సంఘటనలే కావచ్చు. ఫలితంగా మనసులోంచి 'నేను, నాది' అనే భావన పూర్తిగా తుడిచిపెట్టుకుపోతుంది. అటువంటి ఉదాత్తమయిన భావనతో ముడిపడి ఉన్న ప్రసాదాన్ని తాత్కాలిక ప్రయోజనాలకోసం వాణిజ్య వస్తువును చేస్తే, ప్రసాద వితరణ వెనుక ఉన్న ఉన్నతాశయం కాస్తా నీరు కారిపోతుంది కదా! అపారమయిన ప్రేమతో స్వామివారు నాలో అటువంటి సంకుచితమైన ఆలోచనలు కలుగకుండా నివారించాలన్న ఉద్దేశ్యంతో, విశాలమైన హృదయం అలవరచుకొమ్మని హెచ్చరించారు.

"వ్యాపకత్వమే జీవితం" అంటారు స్వామి. కేవలం ప్రేమతోనే అది సాధ్యమన్నది సుస్పష్టం. ప్రేమే మన నిజ ప్రవృత్తి, అని కూడా చెప్పారు స్వామి. ప్రేమ అనేది కేవలం వ్యక్తికీ, కుటుంబానికీ, బంధువర్గానికే పరిమితం కాకుండా అందరినీ కలుపుకునేలా విస్తరించాలని నేను గ్రహించాను. మనలో ప్రేమభావన విస్తరించి అందరిపై ప్రసరించినప్పుడు, ఇక సంకుచితమైన ఆలోచనలకు అవకాశం ఉండదు. సరియైన సమయంలో నాకు స్వామివారి మార్గదర్శకత్వం లభించింది. ఈ సంఘటన జరిగాక నేను ప్రతి విషయంలోనూ స్వామివారి ఆదేశం మేరకు నడుచుకుంటున్నానా లేదా అని ఆత్మపరిశీలన చేసుకుంటూ ఉంటాను.

*(వ్యాసకర్త వృత్తిరీత్యా ఛార్టర్డ్ అక్కౌంటెంట్. ప్రస్తుతం శ్రీ సత్యసాయి సాధనా ట్రస్టు, ప్రశాంతినిలయంలో సేవలందిస్తున్నారు)*

**తెలుగుసేత: వసంతభాను**

# ఎక్కడ సత్యమో అక్కడే ఆనందము



**మీ** మానవత్వమును ధన్యము చేసుకొనుటకు ఇది చక్కని అవకాశము. ఇంద్రియ భోగములలో, విషయవాంఛలలో, వస్తువాహనాదులలో ఆనందము ఉన్నదని; దానిని సులభముగా, శాశ్వతముగా అందుకోవలయునని మీరు ఆశించుచుందురు. కానీ అమృతత్వములోనే ఆనందము, త్యాగములోనే అమృతత్వము చిక్కును అని ఋషులు స్వానుభవముతో బోధించిరి. అయితే, నిజానందము దేనివలన దొరుకును? దేనిలో ఉన్నది? దాని లక్షణములేవి? అని గుర్తించే ప్రయత్నము యెక్కడను కనపడటం లేదు. నిజానందము సత్యమందే దొరకును. ఎక్కడ సత్యమో అక్కడే ఆనందము. 'సత్యాన్నాస్తి పరో ధర్మః' సత్యముకంటే మించిన ధర్మము మరొకటి లేదు, రాదు. మానవుని స్వభావమే సత్యము. ప్రేమయే మానవుని రక్తము. సహనమే వానియొక్క ప్రాణము. దీనిని గుర్తించి వాటిపై జీవితమును ఆధారపెట్టితే మానవత్వము సార్థకమగును. నేటి మానవుడు తలను నమ్ముకొని తన ప్రయాణము సాగించుచున్నాడు. తలను నమ్మితే మానవునకు యేమాత్రము క్షేమముండదు. హృదయమును పరిపక్వము చేసి పరిశుభ్రముగా ఉంచితే, అప్పుడే క్షేమము. ఎందుకంటే, పరమాత్ముడు హృదయవాసి. బుద్ధివాసి కాదు. హృదయవాసియైన పరమాత్ముడు జీవిత రథమును నడుపును. తాను అందరిలోనూ సారథిగా మెలగుచున్నాడు, వెలుగుచున్నాడు అనే విశ్వాసము, వినయము దృఢపడితే, నిశ్చలమైన శాంతి సంతోష భద్రతలు నిస్సందేహముగా చేకూరును.

**- శ్రీ సత్యసాయి**

# Bhagawan Sri Sathya Sai Baba

PRASANTHINILAYAM P.O.,
VIA BUKKAPATNAM,
ANANTAPUR DIST.
ANDHRA PRADESH

"BRINDAVAN"
KADGODI P.O.,
BANGALORE DIST.
MYSORE STATE

3·9·65

[illegible]

1965లో భగవాన్ బాబావారు ఆనందకుమార్ అనే భక్తునికి వ్రాసిన అనుగ్రహపూర్వక లేఖ

అనుగ్రహపూర్వక లేఖ:

# "నీవు నా సొత్తు, నేను నీ సొత్తు"



నాయనా! ఆనందకుమార్!

అందుకో ఆశీర్వాదములు.

నేను గడచిన నెల 25వ తేదీ బెంగళూరు మీదుగా మద్రాసు చేరి, అక్కడ సభలు చూచుకొని, అక్కడినుండీ 28వ తేదీ ప్లైనులో హైదరాబాద్ వెళ్లి అక్కడ సభలు దిగ్విజయము గావించి 2వ తేదీ ప్లైనులో బెంగళూరు చేరి, అక్కడినుండీ నేరుగా పర్తికి చేరితిని. ఇప్పుడే నీ కమ్మని కమ్మను కాంచితిని. ఆనందము. నాయనా! ఇక్కడ నవరాత్రుల కార్యక్రమములు విరామము లేక జరుగుచున్నవి. మందిరమునకు సున్నము వేయటము, రంగులు వేయటము, మిగిలిన వచ్చు భక్తుల వసతులకై యేర్పాట్లు చేయటము ఇత్యాది కార్యక్రమములు భక్తులందరూ చేరి ఉల్లాసముగా వురుకులు తీస్తూ చేయుచున్నారు. మన ప్రశాంతినిలయమున 25వ తేదీనుండి నవరాత్రులు ప్రారంభం. 26వ తేదీ మన ఆంధ్రా గవర్నర్ పట్టంతానుపిళ్లె వస్తున్నారు. అతనే నవరాత్రులు ప్రారంభోత్సవము చేయుచున్నారు. 29 మన ముఖ్యమంత్రి బ్రహ్మానందరెడ్డి వచ్చి యజ్ఞము ప్రారంభోత్సవము చేయుచున్నారు. 28 బలరామిరెడ్డి, య.ఆర్. అప్పారావుగారు వచ్చి ప్రశాంతి విద్వన్మహాసభలు ప్రారంభోత్సవములు చేయుచున్నారు. అక్టోబరు 5వ తేదీవరకూ దసరా కార్యక్రమములు జరుగును. ఇవి మన ప్రశాంతినిలయపు పండుగ విశేషములు.

బంగారూ, నిత్యోత్సవమయిన ప్రశాంతినిలయములో దసరా మహోత్సవములు జరుపుట నవ్వులవలె నుండును. కానీ బాహ్యరీతిగా భక్తులకు ఇదొక పర్వదినము కదా! పోనీ, నీ విషయము చూతము. బంగారూ, నీ సాయి నీ వెంట జంటా నిరంతరమూ వుండి కంటికి రెప్పవలె కాచుచుండగ నీవు యోచనలకు చోటెందుకిత్తువు? నీ సర్వస్వము సాయిరాముడే. నీ భవిష్యత్తు పూర్తీ బాబానే చూచుకొనునని నిశ్చింతగా వుండు. వివరములకు వ్యవధి లేదు కనుక, నీ హృదయమును బాధపెట్టుటకు ఇష్టము లేక ఈ రెండు ముక్కలయినా వ్రాయుచున్నానేకానీ లేకున్న యెవ్వరికీ ఇప్పటిలో వ్రాయుట లేదు.

ఉపనయనము పెండ్లికి ముందు నేనే జరుపుదును. నీవు నా సొత్తు, నేను నీ సొత్తు. కాన ఆ విషయమున యోచన వద్దు. 25, 26 వచ్చి కార్యక్రమములు చూచి వెళ్ళు. తరువాత వీలుపడిన రావచ్చు దశమి కడా దినాలలో. నీ అనుకూల మెట్లో అట్లే చేయుము – ***బాబా***

# అంతర్యామికి హృదయాంజలి

❖ డా॥ సురేంద్ర ఉపాధ్యాయ ❖

ఈనాడు ప్రపంచం ఎటువంటి క్లిష్ట పరిస్థితులను ఎదుర్కొంటోందో, అదేవిధమైన పరిస్థితులు ద్వాపర యుగంలో కూడా ఏర్పడ్డాయి. ఆనాటి ఒక దివ్యమైన సంఘటనను ఈ వ్యాఖ్యానానికి ఉపోద్ఘాతంగా వివరిస్తాను. ఇందులో ఆనాడు భగవానుడు కనపరచిన అద్వితీయమైన కరుణ, ప్రేమలు మన అందరి హృదయాలను భగవానుని యెడల భక్తి, ప్రపత్తులతో నింపివేస్తాయి.

కురుక్షేత్ర సంగ్రామం ప్రారంభం కావడానికి ముందు రోజున అర్జునుడు తనను యుద్ధభూమికి తీసుకు వెళ్ళమని, అలాగైతే తాను ఏ స్థానంలో తన రథాన్ని నిలిపి యుద్ధం చేయడానికి బాగుంటుందో చూసుకుంటానని కర్తృత్వభావాన్ని తనపైననే వేసుకుంటూ, శ్రీకృష్ణునితో అన్నాడు. సర్వజ్ఞుడైన శ్రీకృష్ణుడు చిరునవ్వు నవ్వి అలాగేనన్నాడు. వాళ్ళిద్దరు యుద్ధభూమికి చేరుకునేసరికి సూర్యాస్తమయం కాబోతోంది. ఇంతలో ఒక చిన్న పక్షి ఎగురుకుంటూ వచ్చి వారి రథంపై వాలింది. అది శ్రీకృష్ణునితో తన గోడు వెళ్ళబోసుకోవడానికి అక్కడకు వచ్చింది. అయితే శ్రీకృష్ణ సాన్నిధ్యంలో ఉండడంవల్ల ఆ పిట్ట మాటలు అర్జునునికి చక్కగా అర్థమయ్యాయి. ఆ పిట్ట శ్రీకృష్ణునితో ఇలా అంది – "స్వామీ! ఇప్పుడిక మీరే నాకు దిక్కు. ఈ ప్రదేశానికి పెద్దపెద్ద ఏనుగులు వచ్చి ఇక్కడ ఉన్న మహావృక్షాలన్నింటినీ కూల్చివేస్తూ, నేలను చదును చేసేస్తున్నాయి. నా బంధుమిత్రులంతా ఈ ప్రదేశాన్ని విడిచి వెళ్ళిపోయారు, ఐతే నేను ఎక్కడకూ వెళ్ళలేను. ఎందుకంటే రెండురోజుల క్రిందటనే నేను పొదిగిన గుడ్లలోనుండి చిన్నచిన్న పిల్లలు బైటకు వచ్చాయి. వాటికి ఇంకా రెక్కలు రాలేదు. అందువల్ల అవి ఎగరలేవు".

ఈ మాటలు విన్న శ్రీకృష్ణుడు ఆ పిట్టతో, "ఓ పులుగా! రేపు ఇక్కడ భయంకరమైన యుద్ధం జరుగబోతోంది. ఆ యుద్ధంలో లక్షలమంది ప్రాణాలు కోల్పోతారు. నేను ఆ పరిస్థితులను గురించి యోచిస్తూ ఉంటే, నువ్వు నీ గోడంతా వెళ్ళబోసుకుంటావేమిటి?" అన్నాడు. అప్పుడు ఆ పిట్ట, "స్వామీ! మీరు దైవం కాబట్టి మీకు అన్నీ తెలుసు. అయితే నేను మామూలు చిన్న పక్షిని, నాకు రేపు ఏం జరుగబోతోందో ఎలా తెలుస్తుంది? నేను నా బాధ్యత నిర్వహిస్తూ పిల్లలను కాపాడుకోవడానికి ఆ చెట్టుమీద గూడు కట్టుకున్నాను. నాకు మాతృత్వవరాన్ని ఇచ్చినది మీరే. సృష్టిలోని అన్ని ప్రాణులను రక్షించే బాధ్యత మీదే. నాకు మీయందు అచంచలమైన విశ్వాసం, కావలసినంత ఓర్పు ఉన్నాయి. నేను మీకే శరణాగతి చేస్తున్నాను. ఇక నా భారమంతా మీదే" అంటూ శ్రీకృష్ణునికి మూడు ప్రదక్షిణలు చేసి, తన గూడువైపు ఎగిరిపోయింది.

అర్జునుడు ఇదంతా ఆశ్చర్యంగా వింటున్నాడు. ఇంతలో ఒక పెద్ద ఏనుగు, పక్షిగూడు ఉన్న చెట్టును కూల్చి వేయడానికి దూరంనుండి వస్తూ కనిపించింది. అది చూసి శ్రీకృష్ణుడు, "అర్జునా! నీ గాండీవం, ఒక బాణం ఇలా ఇవ్వు" అని అడిగాడు. అర్జునుడు, "కృష్ణా! ఏం చేయాలో నాకు చెప్పు, నీకు తెలుసు కదా, ధనుర్విద్యలో నన్ను మించిన మొనగాడు మరెవ్వరూ లేరు" అన్నాడు.

అర్జునునిలోని ఆ 'నేను' అన్న అహాన్ని తొలగించాలని భావించి శ్రీకృష్ణుడు, "లేదు లేదు, అర్జునా! నీకెందుకీ చిన్న పని? నేను చూసుకుంటాను" అంటూ అర్జునునివద్ద గాండీవం తీసుకుని, వేగంగా చెట్టును సమీపిస్తున్న ఏనుగుపైకి బాణం విడిచాడు. అదే క్షణంలో ఏనుగు చెట్టును ఢీకొట్టడం, చెట్టుతో సహా పక్షిగూడు పడిపోవడం జరిగాయి. అయితే కృష్ణుడు విడిచిన బాణం ఏనుగుకు కాక, దాని మెడలో వ్రేలాడుతున్న పెద్ద గంటకు కట్టిన త్రాటికి తగిలి గంట క్రిందపడిపోయింది. "అయ్యో! కృష్ణుడు గురి తప్పాడే! ఆ పని నన్ను చేయనిచ్చి ఉండవచ్చు కదా!" అనుకున్నాడు అర్జునుడు. భగవాన్ బాబావారి విషయంలో కూడా వారి దివ్యమైన చర్యలను అర్థం చేసుకోలేని మనమంతా కూడా కొన్ని సందర్భాలలో ఇలాగే అనుకుని ఉంటాం. భగవంతుని గురిపై నమ్మకం లేకపోవడంవల్లనే మనకు భగవంతునిపై గురి కుదరడం లేదు.

పద్దెనిమిది రోజుల భయంకర సంగ్రామం ముగిసింది. శ్రీకృష్ణుడు, అర్జునుణ్ణి పిలిచి తాను ఏనుగుపై వేసిన బాణంవల్ల తెగిపడిన గంటను వెదికి తెమ్మన్నాడు. 'కృష్ణుడు బాణం గురితప్పి వేయడమేకాక, అదేదో ఘనకార్య మన్నట్లు, ఇప్పుడా గంట తెమ్మంటున్నాడు' అనుకున్నాడు అర్జునుడు. గంట ఎక్కడ పడిందో తనకు తెలిసినా, అర్జునునికి ఓ గొప్ప పాఠం నేర్పదలచుకున్నాడు కృష్ణుడు. కొద్ది ప్రయత్నం తరువాత అర్జునుడు గంటను కనుక్కుని, "కృష్ణా! ఇదిగో, ఆ గంట ఇక్కడ పడింది" అన్నాడు. శ్రీకృష్ణుడు నెమ్మదిగా అక్కడకు చేరుకుని గంటను తీయమన్నాడు. అర్జునుడు ఆ గంటను పైకెత్తగానే దాని క్రిందనుండి ఆ చిన్న పిట్ట, తన నాలుగు చిన్న పిల్లలతో సహా ఆకాశంలోకి తుర్రున ఎగిరిపోయింది. అర్జునుడు ఈ దృశ్యాన్ని ఆశ్చర్యంగా చూస్తూ ఉండగానే, ఆ పిట్ట తిరిగి వచ్చి శ్రీకృష్ణునికి మూడు ప్రదక్షిణలు చేసి, "స్వామీ! మీ దయవల్ల నేను, నా పిల్లలు ఇంత కాలమూ, ఈ గంట క్రింద క్షేమంగా ఉన్నాం. ఏదో ఒకరోజున మీరు వచ్చి నన్ను, నా పిల్లలను విడుదల చేస్తారనే నమ్మకంతో, మీ నామస్మరణ చేస్తూ ఉన్నాను" అంటూ కృతజ్ఞతలు తెలియజేసి ఎగిరిపోయింది.

భగవాన్ బాబావారు మనలో ప్రతీ ఒక్కరితోను 'నేను నిన్ను తప్పక రక్షిస్తాను' అని అనకపోయినా, వారి రక్షణ ఎల్లవేళలా అందరికీ ఉంటుంది, అయితే మనలో ఉండవలసినదల్లా, ఇప్పుడు చెప్పిన కథలోని పిట్టలో ఉన్నటువంటి అచంచల భక్తివిశ్వాసాలు, శరణాగతి భావము. నా ఈ చిన్నపాటి ఆధ్యాత్మిక ప్రయాణంలో ఎన్నో పర్యాయాలు స్వామివారు నాకు ఇలాంటి ఎన్నో దివ్య అనుభూతులను తమ అపారమైన కరుణ, ప్రేమలతో అనుగ్రహించారు.

మీలో చాలామంది స్వామివారి అనన్య భక్తులు విక్టర్ కానూగారిని గురించి వినే ఉంటారు. వారు ఒకసారి జాంబియాలో ఒక వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. ఇది ఒక అంతర్జాతీయ వైద్యశిబిరం కావడంవల్ల, దీనికి అమెరికా, ఇంగ్లండ్ వంటి దేశాలనుండి ఎంతోమంది వైద్యనిపుణులు వచ్చారు.

రెండవ ప్రపంచయుద్ధ కాలంలో ఉపయోగించబడి ప్రస్తుతం నిరుపయోగంగా ఉన్న ఒక ఎయిర్‌పోర్టుని మాకు ఈ వైద్యశిబిరం నిర్వహించడానికి కేటాయించారు. ఈ శిబిరానికి ఎంతో దూరదూర ప్రాంతాలనుండి ప్రజలు రాసాగారు. మొదట్లో మేము చిన్నచిన్న శస్త్రచికిత్సలు చేద్దామనుకున్నాము. అయితే సమీపంలో ఉన్న ఆసుపత్రి వైద్యులు లేని కారణంగా మూతపడిపోవడంవల్ల మేము కొన్ని పెద్ద తరహా శస్త్రచికిత్సలు, ప్రధానంగా కంటికి, ప్రసూతివైద్యానికి సంబంధించినవి కూడా నిర్వహించ వలసివచ్చింది. ఈ శస్త్రచికిత్సలకోసం మేము మూతపడిన ఆసుపత్రిలోని ఆపరేషన్ థియేటర్‌ను ఉపయోగించుకోవా లనుకున్నాము. వెంటనే సేవాదళంవారు ఎంతో చాకచక్యంగా పనిచేసి ఆ ఆపరేషన్ థియేటర్ మాకు వీలుగా ఉండేటట్లు సిద్ధం చేశారు. మరి ఆక్సీజన్ సిలిండర్లు ఎక్కడినుండి తెప్పించాలని మేము చర్చించుకుంటూ ఉండగా ఒక సేవాదళ్ వచ్చి ఆసుపత్రికి చెందిన ఒక నేలమాళిగలో కొన్ని ఉపకరణాలున్నాయని, అవి మాకు ఉపయోగపడతాయేమో వచ్చి చూడమన్నాడు. మేము వెళ్ళి చూసేసరికి మాకు అవసరమైన ఆక్సీజన్ సిలిండర్లు అక్కడ ఉన్నాయి. స్వామి సంకల్పం అద్వితీయం, అనూహ్యమని మరొకసారి మాకు అర్థమైంది.

చిన్నచిన్న శస్త్రచికిత్సలకు లోకల్ ఎనస్తీషియా ఇస్తే సరిపోతుంది, కానీ మరీ చిన్న పిల్లలకు శస్త్రచికిత్స చేయవలసివస్తే జనరల్ ఎనస్తీషియా ఇవ్వాలి. అయితే అటువంటి వైద్యనిపుణుడు మా బృందంలో ఎవరూ లేరు. అందువల్ల నేను విక్టర్ కానూతో సంప్రదించి, స్థానిక రేడియోలో ఎనీస్తటిస్ట్ కావాలని ఒక ప్రకటన ఇప్పించాను. రెండు రోజులు గడచినా ఎవరూ రాలేదు. ఆనాడే మేము శస్త్రచికిత్సలు ప్రారంభించాలి. ఇంతలో ఉదయం పది గంటలవేళ ఒకతను మా శిబిరానికి వచ్చి మాతో, 'మీరంతా ఎంతో దూర దేశాలనుండి మా దేశానికి వచ్చి ఇలా పేదలకు సేవ చేస్తున్నారని తెలిసి వచ్చాను. నాకు చేతనైన సహాయం చేస్తాను. నేనొక ఎనీస్తటిస్ట్‌ను' అన్నాడు. మేము ఎంతో సంతోషంగా ఆయనను స్వాగతించాము.

ముందు నిర్ణయించుకున్న ప్రకారమే మధ్యాహ్నం రెండు గంటలకు శస్త్రచికిత్సలు ప్రారంభించాము. మొదటి ఆపరేషన్ చక్కగా ముగిసింది. రెండవ ఆపరేషన్ ఒక చిన్న పిల్లవానికి చేస్తున్నాను. ఇంతలో దూరంనుండి తుపాకులు పేలుతున్న ధ్వని వినవచ్చింది. ఆ మరుక్షణమే కొత్తగా వచ్చిన ఎనీస్తటిస్ట్ లేచి తాను వెంటనే వెళ్ళాలి అన్నాడు. నాకు చాలా కంగారు అనిపించి, అతనితో ఈ ఆపరేషన్ ముగిసేవరకు ఉండమని అభ్యర్థించాను, కానీ అతను, "డాక్టర్! మీకు ఇక్కడి పరిస్థితులు తెలియవు. చీకటి పడితే ఇక్కడ ఉగ్రవాదుల బెడద చాలా ఎక్కువగా ఉంటుంది. అక్కడ నా కుటుంబమంతా ఆందోళనతో ఉంటుంది. అందువల్ల నేనిప్పుడే వెళ్ళాలి" అంటూ మరి కొంతసేపు ఉండమని నేను కాళ్ళావేళ్ళా పడుతున్నా పట్టించుకోకుండా వెళ్ళిపోయాడు.

నేను ఆపాదమస్తకం భయంతో వణికిపోయాను. ఆపరేషన్ జరుగుతున్న పిల్లవాడిని ఎనస్తీషియా మత్తులో నుండి బైటకు తీసుకురావడమే అప్పటి నా సమస్య. నాకేమీ పాలుపోవడం లేదు. అప్పుడు నాకు సహాయంగా ఉన్న ఒక నర్స్ నాతో, "డాక్టర్! మీరెందుకు భయపడతారు? మీరే మాతో అంటూ ఉంటారు కదా, 'వై ఫియర్, వెన్ హీ ఈజ్ హియర్', స్వామి మనకు తోడునీడగా ఉండగా భయమెందుకు?" అన్నది. నేను మనసులోనే స్వామిని తీవ్రంగా ప్రార్థిస్తూ ఈ సమస్యనుండి రక్షించమని వేడుకోసాగాను. మనం వంద మంచి పనులు చేసినా ఎవరూ పట్టించుకోరు, కానీ చిన్న పొరపాటు జరిగితే మాత్రం మీడియావాళ్ళు పెద్దపులుల్లా మీద పడిపోతారు. నాకేదో చెడ్డపేరు వస్తుందని నేను భయపడలేదు. నా పొరపాటువల్ల శ్రీ సత్యసాయి సంస్థకు ఏమైనా మచ్చవస్తుందేమోనని నా భయం.

నేను స్వామిని ప్రార్థిస్తూనే పిల్లవానికి ఆఖరు కుట్టువేసాను. అదే క్షణంలో ఆపరేషన్ థియేటర్‌కున్న ప్లాస్టిక్ తలుపులు భళ్ళున తెరుచుకున్నాయి. అక్కడ ఒక ఆజానుబాహువు జీన్ పాంట్, టీ షర్ట్ ధరించి, చూడటానికి ఆఫ్రికన్ లాగ ఉన్న వ్యక్తి నిలబడి ఉన్నాడు. అతడు నాతో, "మీరు ఇక్కడ ఏం చేస్తున్నారు?" అని అడిగాడు. ఎంతో ఆందోళనలో ఉన్న నాకు చాలా కోపం వచ్చి, "ఏం? ఇక్కడ మేం ఫుట్‌బాల్ ఆడుకుంటున్నామనుకుంటున్నావా?" అన్నాను. అతడు, "అలా కోపగించుకోకండి డాక్టర్‌గారూ, నేను ఈ ఆసుపత్రికి చెందిన ఎనీస్తటిస్ట్‌ని, మూతపడిన ఈ ఆసుపత్రిలోని ఈ ఆపరేషన్ థియేటర్లో లైటు వెలుగుతూ ఉండడం చూసి, ఆశ్చర్యమనిపించి, ఈ త్రోవన వెళుతూ ఇలా వచ్చాను" అన్నాడు ఈ మాటలు వినగానే నాకు ప్రాణం లేచివచ్చినట్లైంది. "ఆహా! మీరు ఎనీస్తటిస్టా? కాదు కాదు, మీరు మా పాలిటి దైవమే. దయచేసి మాకు సహాయం చేయండి" అన్నాను. అతడు వెంటనే ప్రక్కనున్న గదిలోకి వెళ్ళి ఆపరేషన్‌కు సంబంధించిన దుస్తులు ధరించి వచ్చాడు. ఆ తరువాత అంతా సజావుగా జరిగిపోయింది. ఎంతో అవసరమైన క్షణాల్లో వచ్చి ఆదుకున్నందుకు నేను అతనికి కృతజ్ఞతలు తెలియజేస్తుంటే, "ఇంతకీ రేపు ఎన్ని గంటలకు ఆపరేషన్‌లు ప్రారంభిస్తారు? ఇంకా ఎన్ని రోజులు ఆపరేషన్లు ఉన్నాయి?" అని అడిగాడు. ఇంకా మూడు రోజులని నేను చెప్పాను. అతడు వరుసగా మూడు రోజులూ మా శిబిరానికి వచ్చి మాకు ఎంతో సహాయం చేశాడు.

వైద్యశిబిరం ముగిసిన తరువాత మేమంతా సమావేశమై సంభాషించుకుంటున్న సమయంలో మాకు సహాయం చేసిన ఎనీస్తటిస్ట్ ప్రస్తావన వచ్చింది. ఎవరా

ఎనీస్తటిస్ట్ అని విక్టర్ కానూ అడిగితే నేను విషయమంతా వివరించాను. అది విన్న విక్టర్ కానూ ఆశ్చర్యపోయి, ఈ మూతపడిన ఆసుపత్రికి సంబంధించి ఎనీస్తటిస్ట్ ఎవరూ లేరని చెప్పారు. అయితే, నాతో సహా శిబిరంలో పనిచేసిన వారంతా ఎనీస్తటిస్ట్ మూడు రోజులపాటు వచ్చి సేవలందించిన విషయం ధ్రువపరచాకా, విక్టర్ కానూ ఆసుపత్రికి సంబంధించిన అధికారులవద్దకు ఒక వ్యక్తిని వాకబు చేయటానికి పంపారు. ఆ వెళ్ళిన వ్యక్తికి ఆసుపత్రి అధికారులు చెప్పిన విషయమేమిటంటే, "అసలు ఆసుపత్రి మూసివేయడానికి గల ప్రధాన కారణం ఎనీస్తటిస్ట్ ఎవరూ మాకు లభించకపోవడమే. అందువల్లనే ఆసుపత్రికి చెందిన అన్ని విభాగాలను దగ్గరలో ఉన్న వేరువేరు పట్టణాలకు తరలించడం జరిగింది".

ఈ మాటలు విన్న తరువాత, "మా మొర ఆలకించి స్వామివారే ఎవరినో, ఎక్కడినుండో శిబిరానికి పంపారన్నమాట" అని అనుకున్నాము.

కొన్ని నెలల తరువాత నేను పుట్టపర్తి వెళ్ళినప్పుడు దర్శన సమయంలో స్వామివారు, "జాంబియాలో మెడికల్ క్యాంప్ ఎలా జరిగింది?" అని అడిగారు. "స్వామీ! మీ అనుగ్రహంవల్ల అంతా బాగా జరిగింది" అన్నాను. "సంతోషం, సంతోషం!" అని స్వామి నా కళ్ళలోకి చూస్తూ, "అయితే మీరు అక్కడ ఆపరేషన్ థియేటర్‌లో ఫుట్‌బాల్ ఆడుకున్నారా?" అని చిరునవ్వులు చిందించారు. ఆ క్షణంలో ఆ వచ్చిన ఎనీస్తటిస్ట్ ఎవరన్నది నాకు అవగతమైంది. అందుకే కదా స్వామివారిని అనంత కరుణా సముద్రులని అంటారు. ఏ క్షణంలో, ఎక్కడ, ఏ రూపంలో ఎలా, స్వామివారు మనల్ని అనుగ్రహిస్తారన్నది మాత్రం అనూహ్యమైన విషయం.

❖❖❖

భక్తులు తరచు హిందీలో 'హరి అనంత్ హరికథా అనంత్' అంటూ భగవల్లీలా వైభవాన్ని కొనియాడుతూ ఉంటారు. నిజం చెప్పాలంటే భగవంతుని లీలల వర్ణన మానవులకు అసాధ్యమైనదే. ఒకసారి స్వామి నాతో చాలా స్పష్టంగా ఇలా అన్నారు: **"నువ్వు నన్ను ప్రత్యేకంగా సేవించవలసిన అవసరం లేదు. నువ్వు ఎవరిని సేవిస్తున్నావో వారిలో నేనే ఉన్నానని నువ్వు భావిస్తే, నన్ను సేవించినట్లే".** స్వామివారి సర్వజ్ఞతను, సర్వాంతర్యామిత్వాన్ని తెలిపే ఒక అద్భుతమైన విషయం మీకు చెప్పాలనుకుంటున్నాను.

నావద్ద ఒక డెబ్భై సంవత్సరాల వృద్ధుడు వైద్యం చేయించుకుంటూ ఉండేవాడు. దురదృష్టవశాత్తు అతనికి ఒక కంటిచూపు పూర్తిగా పోయింది. అతడు కూడా స్వామివారి భక్తుడే. ఒకసారి అతడు పుట్టపర్తి వచ్చాడు. ఆ రోజులలో భక్తులు ఉదయాన్నే మందిర ప్రాంగణానికి వచ్చి అక్కడ తాము కూర్చునే స్థానాలలో తమ దిండ్లు వేసి, తరువాత క్యాంటీన్‌కు వెళుతూ ఉండేవారు. క్యాంటీన్‌లో ఉపాహారం ముగించుకుని, స్వామివారి దర్శనానికి తిరిగి వచ్చేవారు.

ఒకనాడు ఈ వృద్ధుడు మందిర ప్రాంగణంలో తన దిండు పెట్టుకుని క్యాంటీన్‌కు వెళ్ళి తిరిగి వస్తున్నాడు. దృష్టి సంబంధమైన ఇబ్బందితోపాటు ఆయనకి మోకాళ్ళ నొప్పులు కూడా చాలా తీవ్రంగా ఉండడంవల్ల చాలా నెమ్మదిగా నడుస్తూ వెళుతున్నాడు. మీలో చాలామంది చూసే ఉంటారు. సౌత్ ఇండియన్ క్యాంటీన్ నుండి పూర్ణచంద్ర హాలుకు వచ్చే త్రోవలో ఒక పెద్ద చెట్టు ఉండేది. ఆ రోజున ఆ చెట్టుక్రింద కాళ్ళు సరిగ్గాలేని ఒక వ్యక్తి కూర్చుని ఉన్నాడు. అతడు ఆ త్రోవన వెళ్ళే వాళ్ళందరినీ తనకు క్యాంటీన్ నుండి ఒక కప్పు కాఫీ తెచ్చిపెట్టమని అభ్యర్థిస్తున్నాడు. ఇతే అందరూ దర్శనానికి వెళ్ళే హడావుడిలో అతనిని పట్టించుకోవడం లేదు. అయితే ఈ వృద్ధుడు నెమ్మదిగా నడుస్తూ అక్కడకు వచ్చేసరికి ఈ చెట్టుక్రింద కూర్చున్న వ్యక్తి ఇతనిని తనకు కాఫీ తెమ్మని కోరాడు. ఇతడు ఒక క్షణం ఆలోచించి, అలాగేనని మళ్ళీ కాళ్ళీడ్చుకుంటూ క్యాంటీన్‌కు వెళ్ళి కాఫీ తెచ్చి ఇతనికి ఇచ్చాడు. ఆ తరువాత స్వామివారి దర్శనానికి వెళుతూ, "ఈపాటికి స్వామి దర్శనానికి వచ్చేసి ఉంటారు, ఇక నేను లోపలకు వెళ్ళటానికి వీలుండదు, పోనీ గేటు బైట నిలబడే దర్శనం చేసుకుంటాను" అనుకున్నాడు. అలాగే వెళ్ళి గేటు వద్ద నిలబడ్డాడు. అప్పుడు స్వామివారు స్త్రీలవైపు దర్శన మిస్తున్నారు. ఈ వృద్ధుడు గేటువద్దకు రాగానే స్వామివారు సూటిగా, వేగంగా ఇతనివద్దకు వచ్చి, "ఈ రోజు నువ్వు తెచ్చిన కాఫీ చాలా మధురంగా ఉంది సుమా" అంటూ,

అతనికి దర్శనంతోపాటు, సంభాషణ భాగ్యాన్ని కూడా కలిగించారు. ఇది చూశాక నిష్కామ భావంతో చేసే సేవలు ఎటువంటి దివ్యమైన అనుభవాల నిస్తాయో అక్కడున్న వారందరికీ తెలిసింది. భగవానులు ఎప్పుడూ తమ దివ్యోపన్యాసాలలో, 'మీరు అందరిలోనూ దైవాన్ని దర్శించండి' అంటూ ఉంటారు. అయితే ఎన్ని పర్యాయాలు ఈ దివ్యబోధ విన్నా ఎంతమంది అర్థం చేసుకొని ఆచరణలో పెట్టగలుగుతున్నారు? మరోమారు మనకు ఆ విషయాన్ని బోధించడానికే స్వామి ఆ సంఘటనను కల్పించారు కాబోలు.

❖❖❖

స్వామివారిపట్ల రష్యన్లకు గల ప్రేమ తేనెప్రవాహం వంటిది. అందులో మునక వేసినవారు అంత సులభంగా బైటపడలేరు. ఒకసారి నేను వైద్యశిబిరం నిమిత్తమై రష్యా వెళ్ళినప్పుడు, అక్కడి భక్తులను చూసి ఆశ్చర్యం వేసింది. ఆ యుగంలో మనము గోపీ గోపాలురను చూశామో లేదో గానీ, ఈ యుగంలో రష్యన్ సాయి భక్తులను చూస్తే ఆనాడు గోపీ గోపాలురు కూడా ఇలాగే ఉండేవారేమో అనిపిస్తుంది. ఒకసారి రష్యాలో మేము కొంతమందిమి మెడికల్ క్యాంపు ముగించుకొని బస్సులో బయల్దేరగా ఇద్దరు వ్యక్తులు బస్సు వెనుకనే పరుగెత్తుతూ రావడం కనిపించింది. ఆ సమయంలో బాగా వర్షం కురుస్తూ, వాతావరణం తీవ్రమైన చలితో కూడి ఉంది. నేను ఒకసారి బస్సునాపించి క్రిందకు దిగి వెళ్ళి వాళ్ళను, "మీరు ఇలా ఎందుకు బస్సు వెనుక పరుగెత్తుతున్నారు? మీకు ఏం కావాలి?" అని అడిగాను. అప్పుడు వాళ్ళు నాతో, "సార్! మీరు దైవాన్ని చూశారు. మేం చూడలేదు, అయితే దైవాన్ని చూసిన మీ కళ్ళను మేం చూస్తే దైవాన్ని చూసినట్లే" అన్నారు.

భగవాన్ బాబావారి యెడల రష్యన్లకున్న భక్తి, ప్రపత్తులు అనిర్వచనీయమైనవి. సేవల విషయంలో వారి నిబద్ధత అనూహ్యమైనది. ఒకసారి నేను పుట్టపర్తిలో ఉండగా రష్యానుండి గాలియా, సోఫియా అనే ఇద్దరు సోదరీమణులు వచ్చారు. వీళ్ళు స్వామివారి సాహిత్యాన్ని ఎంతో భక్తి, శ్రద్ధలతో రష్యన్ భాషలోకి అనువదించారు. నేను ఎన్నో అద్భుతమైన అనుభవాలను పొంది ఉన్నానని

తెలుసుకుని, వీళ్ళిద్దరు పుట్టపర్తిలో నన్ను కలిశారు. ఆ సందర్భంలోనే స్వామివారు ఈ సోదరీమణులతోపాటు, నన్ను కూడా ఇంటర్వ్యూకని పిలిచారు. అప్పుడు ఈ మహిళలు స్వామితో, వైద్యశిబిరాల నిర్వహణకై నన్ను రష్యా పంపమని కోరగా, వెంటనే స్వామి నాతో, "సైబీరియాకు వెళ్ళు" అన్నారు. నేను ఆశ్చర్యంతో, "స్వామీ! సైబీరియాకా?" అన్నాను. "ఔను సైబీరియాకే, ఏమీ భయపడకు, నేను నీ వెంట ఉంటానులే!" అన్నారు.

నేను లండన్‌కు తిరిగి వచ్చిన తరువాత రష్యన్ రాయబార కార్యాలయానికి వెళ్ళి వీసాకోసం దరఖాస్తు చేశాను. నాకు వెంటనే అనుమతి లభించింది, ఎందుకంటే ఆ రోజులలో ఎవరూ రష్యా వెళ్ళటానికి సుముఖంగా ఉండేవారు కాదు. నేను రష్యాలో సైబీరియాకు వెళతాననగానే రాయబార కార్యాలయంలో ఉన్నవాళ్ళు ఆశ్చర్యపోయారు. నా వీసాపత్రాలు పరిశీలిస్తున్న మహిళ లోపలకు వెళ్ళి వచ్చి, నాతో తన పై అధికారి నన్ను చూడాలనుకుంటున్నారని చెప్పింది. నేను లోపలకు వెళ్ళగానే ఆ అధికారి ఎంతో మర్యాదగా నన్ను పలకరించి, "సార్, ఇంతకీ మీరు సైబీరియా ఎందుకు వెళ్ళాలనుకుంటున్నారు?" అని ప్రశ్నించాడు. నేను అతనితో, "సర్! నన్ను నా గురుదేవులు సైబీరియా వెళ్ళమన్నారు.

వారు తమ ప్రేమను అక్కడి ప్రజలకు సేవల రూపంలో అందించమన్నారు" అన్నాను. అతను సరేనని తలపంకించి, "మీకు సైబీరియా వెళ్ళటానికి అనుమతిస్తాను, ఐతే మీరు అక్కడ భగవంతుని ప్రస్తావన మాత్రం తీసుకు రాకండి. అంతేకాదు, మీరు సైబీరియా నుండి తిరిగి వచ్చాకా, అక్కడి మీ అనుభవాలు నాకు తప్పక తెలియజేయండి" అన్నాడు.

మేము రష్యా చేరుకున్నాకా అక్కడ సైబీరియాలో వైద్యశిబిరం ప్రారంభించి పేదలకు సేవలు అందించే ముందుగా ఒక అధికారి అనుమతి తీసుకోవలసివచ్చింది. నేను ఆ అధికారివద్దకు వెళ్ళాను. మా సంభాషణ దుబాసీ సహాయంతో జరిగింది. అతడు నావైపు గంభీరంగా చూస్తూ, "అసలు మీరు మా దేశంలో ఉచితంగా ఎందుకు సేవలందించాలనుకుంటున్నారు? మాది మరీ అంత పేద దేశమేమీ కాదే!" అన్నాడు. అప్పుడు నేను, "సర్! మీ దేశం ఎంతమాత్రం పేద దేశం కాదు. పైగా చాలా మహోన్నతమైనది. అంతరిక్షంలోకి యూరీ గగారిన్‌ను పంపి చరిత్ర సృష్టించిన దేశం మీది. 'యుద్ధము మరియు శాంతి'లాంటి ఉత్కృష్టమైన గ్రంథాలను ప్రపంచానికి అందించి, నోబెల్ సాహిత్య పురస్కారాన్ని అందుకున్న లియో టాల్‌స్టాయ్ మీ దేశస్థుడే. అలాంటప్పుడు మీది పేద దేశమనే పొరపాటు భావం మాలో ఎలా వస్తుంది? మేము ఇక్కడకు వచ్చి సేవలందించడమనేది కేవలం మా గురుదేవుల ఆదేశం మేరకు చేస్తున్నాము. పెద్ద పెద్ద పట్టణాలకు వెళ్ళలేని ప్రజలకు, నిస్సహాయ స్థితిలో ఉన్నవారికి, నాణ్యత కలిగిన ఉన్నత సాంకేతిక నైపుణ్యంతో కూడిన వైద్యసేవలు అందించమని మా గురుదేవుల ఆదేశం. మేము వైద్యశిబిరాల నిర్వహణకు ఏ దేశం వెళ్ళినా ఆ దేశంలోని వైద్య ఆరోగ్య వ్యవస్థకు సంబంధించిన విషయాలలో జోక్యం చేసుకోవద్దని, కేవలం స్థానికుల సహకారంతో సేవలందించమని వారు మాతో చెప్పారు. అందువల్ల మేము మీ సహాయం కోరుతున్నాం" అన్నాను. ఈ మాటలు వినగానే ఆ అధికారి ముఖంపై చిరుదరహాసం ప్రత్యక్షమైంది. అతడు సంతోషంగా మాకు అనుమతి నిచ్చాడు. మేము కిరోగ్రాడ్ అనే ప్రాంతంలో వైద్య శిబిరం నిర్వహించాలని నిర్ణయించుకున్నాం.

వైద్యశిబిరం ఏర్పాటు చేసే ముందుగా ఆ ప్రదేశాన్ని క్షుణ్ణంగా పరిశీలించాలని స్వామివారు ఎప్పుడూ మాకు సూచిస్తూ ఉండేవారు. అందుకని మేము ముగ్గురు సభ్యులం ఒక మామూలు కారులో ఆ ప్రాంతానికి బయలుదేరాం. ఈ కిరోగ్రాడ్ యూరల్ పర్వతశ్రేణుల సమీపంలో ఉంది. ఆ ప్రాంతమంతా మంచుతో కప్పబడి మొదటిసారి చూసేవారికి చాలా ఆశ్చర్యాన్ని కలిగిస్తుంది. మేము అలా ప్రయాణిస్తూ ఉండగా నాకు, 'ఈ నిర్జన ప్రదేశంలో ఒకవేళ ఈ కారు ఆగిపోతే మా గతేమిటి?' అన్న ఒక నెగెటివ్ ఆలోచన వచ్చింది, అయితే అక్కడి సుందర దృశ్యాలను చూస్తూ మమ్మల్ని మేము మరచిపోయాం. 'ఈ దృశ్యాలను ఫోటో తీస్తే బాగుంటుంది' అని మా బృందంలో ఒకరు సూచించారు. నేను వెంటనే నా కెమేరాను క్లిక్ మనిపించాను, అంతే మరుక్షణంలో కారు ఆగిపోయింది. ఇప్పుడెలా భగవంతుడా? అని నేననుకుంటూ ఉండగానే స్వామివారి మాటలు గుర్తుకు వచ్చాయి – "మీరు ఎక్కడికైనా వైద్యసేవలందించడానికి వెళ్ళినప్పుడు దానికే ప్రాధాన్యతనివ్వాలి. ప్రకృతి దృశ్యాలను చూడటానికి మీరు వెళ్ళటంలేదు. మీ పని పూర్తి అయిన తరువాతనే మీరు చూడదలచుకున్న ప్రదేశాలను చూడవచ్చు" అనేవారు స్వామి. ఇప్పుడు కారు పరిస్థితి ఏమిటని డ్రైవర్ని అడిగితే, కారు బాగుచేయటానికి కొంత సమయం పడుతుందని చెప్పాడు.

తప్పనిసరిగా మేము కారులోనుండి బైటకు రావలసి వచ్చింది. అక్కడ మంచు కురుస్తూ ఉండడంవల్ల చలి చాలా భయంకరంగా ఉంది, అయితే నేను భారతీయ సైన్యానికి చెందిన వైద్యవిభాగంలో పనిచేస్తూ సముద్ర మట్టానికి పద్నాలుగువేల అడుగుల ఎత్తునున్న లద్దాక్‌లో కూడా పనిచేయడంవల్ల ఆ చలిని భరించగలిగాను. మేము అలా కొంత దూరం నడచి వద్దామని బయలుదేరాం. కొంత దూరం వెళ్ళేసరికి అత్యాశ్చర్యకరంగా మాకు, "బ్రహ్మమురారి సురార్చిత లింగం, నిర్మల భాసిత శోభిత లింగం" అంటూ శ్రావ్యమైన కంఠంలో లింగాష్టకం వినిపించింది. సూదంటురాయివైపు లాగబడిన ఇనుప ముక్కల్లా మేము ఆ లింగాష్టకం వినవస్తున్నవైపు అడుగులు వేశాం. మాకు అక్కడ ఒక గుహలో శివాలయం

కనిపించింది. ఆలయంలో ఒక పూజారిగారు శివలింగానికి అభిముఖంగా నిలబడి హారతినిస్తూ లింగాష్టకం చదువుతున్నారు. ఈ యూరల్ పర్వతప్రాంతంలో ఏ భారతీయుడు వచ్చి నివాసముంటున్నాడా అని మాకు ఆశ్చర్యం కలిగింది.

హారతి పూర్తి చేసి పూజారిగారు మావైపు తిరిగి, “ఆహా! మీరు వచ్చారా!” అన్నారు. ఆయన మా గురించే ఎదురు చూస్తున్నాడా అని మాకనిపించింది. అయితే, ఆ పూజారిగారు భారతీయులు కారు, ఆరడుగుల పొడవైన ఆజానుబాహువు, ఒక రష్యన్! నాకు నోటమాట రాలేదు. నేను ఆయనతో, “అయ్యా! మీరు ఎంతో శ్రావ్యంగా లింగాష్టకం చదువుతున్నారు, ఇంతకీ ఇది మీకు ఎవరు నేర్పించారు?” అని ప్రశ్నించాను. “నాకు మా గురుదేవులు నేర్పించారు” అంటూ ఆయన శివలింగం ప్రక్కన వెలుగుతున్న కొవ్వొత్తిని ఎత్తి పట్టుకుని గోడపైనున్న చిత్రాన్ని చూపిస్తూ, “ఇదిగో, వీరే మా గురుదేవులు” అన్నారు. ఆ క్షణంలో నా శరీరం రోమాంచితమైపోయింది. అక్కడ గోడమీద భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి మనోజ్ఞ, మనోహర చిత్రం ఉంది. సరిగ్గా పుట్టపర్తిలోని ఇంటర్వ్యూ గదిలో స్వామి నాతో, “సైబీరియాకు పో, ఏమీ భయంలేదు, నేను అక్కడ నీ వెంటనే ఉంటాను” అంటున్నప్పుడు ఏ భంగిమలో అభయహస్త ముద్ర నను్రగహించారో, అదే భంగిమ ఆ చిత్రంలో ఉంది. స్వామివారి ఏ పలుకూ ఏనాడూ వ్యర్థం కాదని, ఆ పలుకుల్లోని సత్యాన్ని గుర్తించలేకపోవడం మన అజ్ఞానమేనని అర్థమైంది. ఇక వేరే చెప్పేదేముంది! అటు తరువాత వైద్యశిబిరం చాలా విజయవంతంగా నిర్వహించగలిగాము.

స్వామివారియందు అచంచలమైన భక్తి, ప్రపత్తులు కలిగి ఉంటూ వారు మనకు దయతో అనుగ్రహించిన సేవలను నిబద్ధతతో చేస్తూ మన జీవితాలను ధన్యం చేసుకొనేందుకు కృషి చేద్దాం.

**తెలుగుసేత: డా॥ వజ్జల సత్యకమలాకర్**

**శ్రీ సత్యసాయి పద్యసుధ:**

# ❖ ‘శివుడు మెచ్చు సేవ చేయరయ్య’ ❖

సకల వేదాంత గ్రంథాల సారమెల్ల
ఒక్క వాక్యాన చెప్పుదు నొక్కసారి
సకలజీవులయందున్న ఆత్మ నేను
ఒక్కటేయని మది తలపోయరయ్య.

శిలల పూజలందు శ్రేష్ఠుడు నీవౌచు
ప్రజల మెప్పుకొరకు పాటుపడియు
ఇట్టి పూజలెల్ల ప్రజలు మెచ్చిరిగాని
శివుడు మెచ్చు సేవ చేయరయ్య!

సాయి అర్థించు మీనుండి సద్గుణములు
సర్వమానవ సోదర సఖ్యబుద్ధి
స్వార్థత్యాగంబు పరిశుద్ధ సంఘసేవ
సాయికిచ్చెడి ధనమిదె సత్యముగను

సద్గుణంబులు త్యాగంబు సత్యనిష్ఠ
లేని జీవుడు ప్రాణంబు లేనివాడె
సేవ చేయని జీవుండు చీకటింట
అంధ జీవుడంచు ననగవచ్చు

సత్యధర్మమహింసయు శాంతిప్రేమ
మానవుని పంచప్రాణాలు మహిని చూడ
పంచప్రాణాలలో ప్రేమ ఎంతొ హెచ్చు
కాన హృదయాన ప్రేమను గట్టిపరచు

సేవవలన మనకు చేకూరు ఆనంద
మదియె శాంతి సుఖములందియిచ్చు
శాంతికన్న మిన్న సౌఖ్యంబు లేదయా
ఉన్నమాట తెలుపుచున్నమాట ❖

# అవతార వైభవంలో అద్భుత ప్రదేశాలు:

## 9. వైభవ శోభల వెంకటగిరి

పి.వి. చలం

భగవాన్ బాబావారు వెంకటగిరిలో ప్రసాదించిన వైభవ శోభలను ప్రస్తావించుకునే ముందు నాందీ ప్రస్తావనగా భగవత్ సంకల్పాల విశిష్టతను, భక్తులవద్దకు భగవంతుడు తరలివెళ్ళిన అద్భుత సంఘటనలను, భగవంతుడు భక్తులను తమ చెంతకు చేర్చుకునే వైనాన్ని ముచ్చటించుకుంటూ ముందుకు సాగుదాం.

భగవంతునికి, భక్తునికి ఉన్న అనుబంధాన్ని విశ్లేషించుకుంటుంటే హృద్యంగా అనిపిస్తుంది. భక్తుడు భగవంతుని భజిస్తూ ఆయనను ప్రసన్నుణ్ణి చేసుకుని ఇష్టకామ్యాలు తీర్చుకుంటూ జీవితాన్ని సుఖమయం చేసుకోవాలని తాపత్రయపడుతూ ఉంటాడు. అలా అని అందరూ ఐహిక విషయాలకే పరిమితమై ఉండరు. యుగధర్మాన్ని అనుసరించి సంసారంలో ఉంటూనే అపూర్వంగా లభించిన మానవజన్మను భగవంతుని చేరుకొనే నావగా మలచుకొని ఉన్నత స్థితిని పొందటానికి సాధన సలుపుతూ ఉంటారు కొందరు.

ఇక భగవంతుని విషయానికి వస్తే యుగాలు ఏవైనా, అవతారాలు ఎన్నయినా అవతార ధ్యేయం మానవోద్ధరణే. సృష్టిలోని 84 లక్షల జీవరాశులలో మానవునికి ఒక్కనికే షడైశ్వర్యస్వరూపుడైన భగవంతుని వైభవాన్ని తెలుసుకునే జ్ఞానాన్ని ప్రసాదించాడు భగవంతుడు. జీవప్రజ్ఞకు తోడుగా దైవప్రజ్ఞ అన్నట్లు తమ అద్భుత చర్యలద్వారానూ, బోధనల ద్వారానూ ప్రజలలో నిబిడీకృతమై ఉన్న భక్తిప్రపత్తులను చైతన్యపరుస్తూ తనకు చేరువ చేసుకునే ప్రయత్నం చేస్తాడు భగవంతుడు.

పాఠశాలలో ఉపాధ్యాయుడు తరగతిలోని విద్యార్థు లందరికీ ఏ అంశాన్నయినా ఒకేరకంగా బోధిస్తూ ఉంటాడు. అయితే, ఆయా విద్యార్థుల శ్రద్ధాసక్తులను బట్టి, గ్రాహ్యశక్తిని బట్టి అవగతం చేసుకునే స్థాయి, ఫలితాలు పొందే స్థితి ఉంటుంది. ఆధ్యాత్మికంలో కూడా అదే పరిస్థితి. పక్వస్థితికి చేరుకున్న సాధకులవల్ల సమాజానికి శ్రేయస్సు కలుగుతుంది. వారి సత్ప్రవర్తన, సద్బుద్ధి, సత్యనిరతి చుట్టూ ఉన్న సమాజాన్ని ప్రభావితం చేసి సన్మార్గంవైపు పయనింపజేయటానికి ఆధారభూతులు అవుతారు. అట్టివారిని తన అవతారవైభవాన్ని ప్రజలకు చేరువచేయటానికి ఉపకరణాలుగా మలుచుకుంటాడు భగవంతుడు. ఈ విషయమై మన అవగాహనకోసం మన ప్రియతమ భగవాన్ బాబావారి దివ్య అవతారగాథనే తీసుకుందాం.

పుట్టిననాటినుంచీ.... ఆ మాటకొస్తే పుట్టుక ముందు నుంచే అనేక దివ్య సంఘటనలద్వారా తమ దివ్యత్వాన్ని లోకానికి ప్రస్ఫుటం చేస్తూ వచ్చారు. 'సత్యం' నామధేయంతో విరాజిల్లుతున్న సమయంలో... 'సత్యం' దివ్యబాలుడన్న దృఢవిశ్వాసం ప్రజలలో నెలకొన్న తరువాత 1940వ సంవత్సరంలో 14 యేళ్ళ ప్రాయంలో, "నేను సాయిబాబాను" అని అవతార ప్రకటన చేస్తూ పలికిన, "నా భక్తులు నన్ను పిలుస్తున్నారు. నేను సంకల్పించుకొని వచ్చిన కార్యమును ఆరంభించవలసియున్నది" అన్న అమృతవాక్కులు భవిష్యత్ ప్రణాళికా సూచకాలు. యుగావతారిగా ప్రకటన చేసిన తరువాత వేగంగా భక్తులను తమ దరికి చేర్చుకోవటం ప్రథమ కర్తవ్యం కదా.

ఆ దిశలో భక్తులను తమ దరికి చేర్చుకోవటానికి భగవంతుడే భక్తుల కడకు తరలివెళ్ళిన ఒక అద్భుత ప్రయాణాన్ని గురించి ఇప్పుడు తెలుసుకుందాం.

1944వ సంవత్సరం ఫిబ్రవరి నెలలో 18 యేళ్ళ కౌమార దశలో ఉన్నప్పుడు బాబావారు బెంగళూరుకు ప్రయాణమైనారు. ఆ ప్రయాణానికి బాబావారి వెంట కరణం సుబ్బమ్మగారు, ఆమె సోదరుడు పప్పూరు

సత్యనారాయణగారు, కరణం కమలమ్మగారు ఉన్నారు. వీరంతా పుట్టపర్తినుంచి ఎడ్లబండిలో బయల్దేరి పెనుగొండ చేరుకొని, అక్కడినుండి రైలులో బెంగళూరుకు వెళ్ళి, లాల్‌బాగ్ సమీపంలో ఉన్న మాపల్లె రామారావుగారి చిన్న ఇంటిలో దాదాపుగా పదిరోజులు బసచేశారు. కమలమ్మ గారి బంధువులు అప్పటికే బాబావారి మహిమలను, సంకల్పమాత్రాన వ్యాధులను నయం చేస్తున్న వైనాన్ని ప్రత్యక్షంగా తిలకించినవారవటంచేత, ఆ ఇంటికి వెళ్ళి బాబావారిని దర్శించుకొని, తమ గృహాలను పావనం చేయవలసిందిగా ప్రార్థించారు.

ఆ సంవత్సరంలోనే బాబావారు మరో నాలుగుసార్లు బెంగళూరు పర్యటనలు గావించారు. ప్రతి పర్యటనకూ భక్తుల సంఖ్య మూడింతలు నాలుగింతలు కాసాగింది. తదనుగుణంగా పెద్దపెద్ద భవనాలలో, విశాలమైన ప్రాంగణాలలో భజనలు, దర్శనాలు ఆరంభమైనాయి. ఆవిధంగా బాబావారి అవతార వైభవంలో నరసింహ నాయుడు, నవనీతనాయుడు, తిరుమలరావు, ఇన్‌స్పెక్టర్ జనరల్ రణజోత్‌సింగ్, కాఫీతోటల యజమానురాలు సాకమ్మ, నాగమణి పూర్ణయ్య, కేశవ విఠల్, ఆడిటర్స్ వెంకట్రామన్ మరియు శ్రీనివాసన్ గారల గృహాలు, విశాల ప్రాంగణాలు వేదికలై లక్షలాది భక్తులు స్వామివారి దర్శన, స్పర్శన, సంభాషణలతో పునీతులయినారు. బాబావారి అనుగ్రహ రక్షణలో సేదదీరారు. శేషగిరిరావుగారు బాబావారి ఆశీస్సులతో అనేకమంది భక్తుల గృహాలలో గురువారం భజనలు మొదలుపెట్టారు.

ఈవిధంగా ఆధ్యాత్మిక చైతన్యం వెల్లివిరుస్తున్న తరుణంలో ఎందరో బాబావారి అవతారోద్యమంలో పాత్రధారులై తమ జీవితాలను ధన్యం చేసుకున్నారు. అట్టివారిలో ప్రముఖంగా చెప్పుకోవలసినవారు వెంకటగిరి రాజావారైన వెలుగోటి సర్వజ్ఞకుమార కృష్ణ యాచేంద్రగారు. మొదటిగా రాజాగారి సోదరి పెద్ద పొన్నిగారు బాబావారిని దర్శించుకుని, విశేషంగా ప్రభావితురాలై రాజావారు స్వామిని దర్శించుకునేవిధంగా ప్రోత్సహించారు. రాజావారు ప్రథమంగా 1949 జులై 26వ తేదీన కాఫీతోటల యజమానురాలు, సేవా తత్పరురాలు అయిన సాకమ్మగారి గృహంలో స్వామివారిని

భగవాన్ సన్నిధిలో వెంకటగిరి రాజాగారు

దర్శించుకున్నారు. బాబావారి దివ్యదర్శన ప్రభావం సర్వజ్ఞకుమార కృష్ణ యాచేంద్రగారి కుటుంబంపై ఎంతగా పడిందంటే, మరి కొద్దిరోజులలోనే రాజావారి సోదరులు వెంకటరాజ గోపాలకృష్ణ యాచేంద్రగారు వారి సతీమణితోనూ, కుమారుడు మదనగోపాలకృష్ణ యాచేంద్రతోనూ కలసి స్వామిని దర్శించుకున్నారు.

మరికొద్ది రోజుల తేడాలో సర్వజ్ఞ కుమార యాచేంద్ర గారు వారి సతీమణితోనూ, ఇద్దరు కుమారులు, కోడళ్ళతోనూ దర్శించుకున్నారు. వీరు వెళ్ళిన సమయంలో బాబావారి సన్నిధిలో భజన జరుగుతోంది. భజనానంతరం అనుగ్రహించిన ఇంటర్వ్యూలో బాబావారు రాజావారి కుటుంబంతో తమకు ఎంతోకాలంగా పరిచయం ఉన్నట్లు మాటలాడుతూ వారందరినీ తమ దివ్యప్రేమలో ఓలలాడించారు. సర్వరక్షకుడైన భగవంతుని అండ తమకు లభించిందన్న ధైర్యం వారి మనస్సులలో సుస్థిరం చేశారు.

## అవతార వైభవంలో తొలి పాత్ర

రాజావారికి భగవాన్ తమ అవతార వైభవంలో సముచిత స్థానం ప్రసాదించాలన్న సంకల్పంతో, బుక్కపట్నం స్కూలు భవన నిర్మాణపు బాధ్యతను ఆయనకు అప్పగించారు. ఆ వివరాలలోకి వెళ్ళే ముందు జరిగిన సంఘటనను చెప్పుకుతీరాలి.

బాబావారు చిన్నప్పుడు చదువుకున్న బుక్కపట్నం స్కూలును ఉన్నత పాఠశాలగా మార్చాలన్న ప్రతిపాదనను అప్పట్లో ఆంధ్రాప్రాంతం మద్రాసు స్టేటులో ఉండటంవల్ల మద్రాసు ప్రభుత్వానికి పంపారు. ప్రతిపాదనకు అనుమతి రావటంలో జాప్యం జరుగుతూ ఉండటంవల్ల విద్యాశాఖ కార్యదర్శిని కలుసుకొనేందుకు స్వామి స్వయానా కారు నడుపుకుంటూ మద్రాసు వెళ్ళిరావటం జరిగింది. బాబావారికి అంతటి ప్రీతిపాత్రమైన బుక్కపట్నం స్కూలును వారి ఆశయాలకు, ఆదేశాలకు అనుగుణంగా సర్వాంగసుందరంగా నిర్మించి భక్తిప్రపత్తులతో బాబావారి పాదపద్మాలచెంత పూజాకుసుమంగా సమర్పించారు రాజావారు. 'శ్రమకు తగ్గ ఫలం' అన్నట్లు తమ దివ్య సమక్షంలో భవనాన్ని ప్రారంభించే సదవకాశాన్ని బాబావారు వెంకటగిరి రాజావారికి ప్రసాదించారు. ఆ ప్రారంభోత్సవ సభలో బాబావారు దివ్యోపన్యాసం గావిస్తూ, భవిష్యత్తులో పుట్టపర్తిలో విశ్వవిద్యాలయం రానున్నదని ప్రకటించి అందరినీ ఆశ్చర్యానందాలలో ఓలలాడించారు.

ఆ రాత్రికి బుక్కపట్నం గెస్టుహౌస్‌లో విశ్రమించిన రాజావారు మరుసటిరోజు పుట్టపర్తికి వెళ్ళి బాబావారిని వెంకటగిరి సంస్థానానికి విచ్చేసి పునీతం చేయవలసిందిగా వేడుకోగా బాబావారు దయతో అంగీకరించారు. 1950 సెప్టెంబరు 7 బాబావారి దివ్యాగమనానికి సుముహూర్తంగా నిర్ణయించారు. అప్పుడు రాజావారు సెప్టెంబరు 5 నాటికి రాజ కుటుంబీకులు వచ్చి స్వామివారిని భక్తిపురస్సరంగా వెంకటగిరికి తోడ్కొని వస్తారని విన్నవించుకున్నారు.

అనుకున్న సమయానికి రాజావారి పెద్ద కుమారుడు ఊళ్ళో లేనందువల్ల చిన్న కుమారుడైన వెలిగోటి గోపాలకృష్ణ యాచేంద్రను పంపటానికి నిశ్చయించారు రాజావారు. అయితే, చిన్న కుమారుడు 368 కిలోమీటర్ల దూరం ప్రయాణించటానికి, ముఖ్యంగా పుట్టపర్తికి వెళ్ళే రోడ్డు సరిగా లేని కారణాన, కారును కర్నాటనాగేపల్లివద్ద వదలి చిత్రావతి నది ఇసుకలో నడుచుకుంటూ వెళ్ళాల్సి ఉన్నందువలన బాబావారిని తోడ్కొని రావటానికి విముఖత చూపటంతో నొచ్చుకున్న రాజావారు బాబావారికి ఇచ్చిన మాట తప్పకూడదనే భావనతో రాజకుటుంబ సభ్యులొకరిని పంపటానికి నిశ్చయించారు.

## మొదలైన లీలా నాటకం

ప్రయాణ భారం తప్పినందుకు హాయిగా నిద్రకు ఉపక్రమించారు గోపాలకృష్ణ యాచేంద్రగారు. అర్ధరాత్రి సమయంలో విచిత్రమైన కల. ఆ కలలో బాబావారు గోపాలకృష్ణ యాచేంద్రగారికి రెండు మామిడి పళ్ళిచ్చి, "నీకు మామిడి పళ్ళంటే ఇష్టం కదా, తిను" అన్నారు. గోపాలకృష్ణగారు తిన్నారు. ఎంతో రుచిగా ఉన్నాయి. ఆ మధురానుభూతిలో ఓలలాడుతుండగా మెళకువ వచ్చింది. టైమ్ చూస్తే రాత్రి 12.30 గంటలయింది. వెంటనే వెళ్ళి బాబావారిని తోడ్కొని రావాలన్న భావం ఆయనలో కలిగింది. క్రమశిక్షణకు మారుపేరైన రాజావారిని ఆ సమయంలో మామూలు పరిస్థితిలో అయితే కలవటం సాధ్యం కాదుగానీ, బాబావారిని వెంటనే వెళ్ళి దర్శించుకోవాలన్న తపన ఒక కారణం అయితే, తాను పుట్టపర్తికి వెళ్ళటానికి సానుకూలంగా మారటం తండ్రి గారికి సంతోషం కలిగిస్తుందన్న భావంతో ధైర్యం చేసి వెళ్ళి తండ్రిగారిని నిద్రలేపి విషయం విన్నవించుకున్నారు. అయితే, కల సంగతి మాత్రం చెప్పలేదు.

తండ్రిగారు ఇంతలో ఇంత మార్పేమిటని ఆశ్చర్యపడ్డా, "పోనీలే, భగవంతుని దయవల్ల మంచి మార్పే" అన్న భావంతో ప్రయాణానికి అన్ని ఏర్పాట్లు చేసి, గోపాలకృష్ణ యాచేంద్రగారికి తోడుగా బంధువైన రామ్మోహనరావు గారిని, ఒక అటెండర్‌ని పంపిస్తూ, బాబావారికి వెంకటగిరిలో సముచితరీతిలో స్వాగతం పలకటానికి అనువుగా పుట్టపర్తిలో బయలుదేరిన వెంటనే టెలిగ్రామ్‌ద్వారా తెలియజేయమని, అలాగే మధ్యలో ప్రధాన పట్టణాలు చేరుకున్నప్పుడు కూడా తెలియపరచమని గట్టిగా చెప్పి వీడ్కోలు పలికారు.

బాబావారిని చూడాలన్న ఆతురతతో కారు ఎక్కడా ఆపకుండా వేగంగా నడపటంవల్ల ఉదయం 7.30 కు చిత్రావతి నది ఆవలి ఒడ్డుకు చేరుకుని, కారును అక్కడ ఆపి, నడుచుకుంటూ ఈవలి ఒడ్డుకు చేరుకున్నారు. అక్కడ వీరిగురించే ఎదురుచూస్తున్నట్లు నిలబడి ఉన్న బాబావారు గోపాలకృష్ణ యాచేంద్రగారి వంక కొంటెగా చూస్తూ, "ఏమి, మామిడిపళ్ళు తిని పరుగెత్తుకొచ్చావే" అన్నారు. ఆ మాటలతో గోపాలకృష్ణగారు తన స్వప్నం బాబావారి సంకల్పమేనన్న నిశ్చయానికి వచ్చి ఆనందపడ్డారు. తరువాత అందరూ పాత మందిరం చేరుకున్నారు.

ఆరోజు కృష్ణాష్టమి కావటంతో పాతమందిరంలో భజన జరిగింది. స్వామి స్వయాన అత్యంత హృద్యంగా, 'గోపాలబాల సాయి' అన్న పాట పాడుతున్నారు. గోపాలకృష్ణ యాచేంద్రగారు ఆ గానమాధుర్యంలో ఓలలాడుతున్నారు. ఆ ఆనంద పారవశ్యాన్ని అద్వితీయం చేస్తూ స్వామి నీలమేఘశ్యాముడైన శ్రీకృష్ణ భగవానునిగా ఆయనకు దర్శనభాగ్యం ప్రసాదించారు.

## వెంకటగిరికి స్వామి ప్రయాణం

మరునాడు ఉదయం వెంకటగిరికి ప్రయాణం మొదలైంది. గోపాలకృష్ణగారికి వాళ్ళ నాన్నగారు చెప్పిన ప్రకారం బాబావారు బయలుదేరినట్లు టెలిగ్రామ్ ఇవ్వాలని ఒకటే తపన. ఆరోజులలో పుట్టపర్తిలో టెలిగ్రామ్ ఇచ్చే సౌకర్యం లేనందువల్ల పలమనేరు నుంచి ఇవ్వచ్చులే అనుకున్నారు. కానీ స్వామి కారును ఆపనీయకుండా, "పోనీ, పోనీ" అన్నారు. మదనపల్లి, చిత్తూరులలో కూడా టెలిగ్రామ్ ఇచ్చే అవకాశం స్వామి ఇవ్వలేదు. అప్పుడు గోపాలకృష్ణగారు, "స్వామీ, టెలిగ్రామ్ ఇవ్వకపోతే మా నాన్నగారు కోప్పడతారు" అన్నారు. దానికి స్వామి నవ్వి, "ఏం ఫరవాలేదులే" అన్నారు. చివరిగా తన మీద జాలితో తిరుపతిలోనైనా కారు ఆపడానికి అనుమతిస్తారేమోనని ఆశిస్తే అక్కడా నిరాశే ఎదురయింది.

## ప్రయాణంలో పదనిసలు

పోనీ, ఆకలవుతోంది స్వామీ, అంటే హోటల్ సౌకర్యం ఉన్న పట్టణంలో ఆగమంటారేమో ననుకుంటే, స్వామి తమ దివ్యహస్తాలనంతో వేడివేడి దోసెలు సృష్టించి ఇచ్చారు. ఇంతకు ముందెన్నడూ తిని ఎరుగనంత రుచిగా ఉన్నాయి. టెలిగ్రామ్ మాట ఎత్తకుండా భజన పాటలు పాడుతూ, ఆధ్యాత్మిక విషయాలు ముచ్చటిస్తూ కాలం తెలియకుండా చేశారు. ఇంతలోనే, "మీకేం కావాలో కోరుకోండి" అన్నారు. అప్పుడు ఒకరు మామిడిపళ్ళ సీజన్ కాకపోయినా, "బంగినపల్లి మామిడి పండు కావాలి స్వామీ" అన్నారు. గోపాలకృష్ణగారు 'పేర్ ఫ్రూట్' కావాలన్నారు. మిగిలినవారు వేరేవేరే పళ్ళు కోరారు. స్వామి ఒకచోట కారు ఆపుచేయించి, అక్కడున్న ముళ్ళచెట్టును చూపించి, "ఆ చెట్టునుంచి మీకు కావలసిన పళ్ళు కోసి తెచ్చుకోండి" అన్నారు. ఆశ్చర్యంగా ఆ ముళ్ళచెట్టుకి వీళ్ళు కోరిన ఫలాలు మాత్రమే వ్రేలాడుతున్నాయి. స్వామి మహిమకు మురిసిపోతూ, కోరుకున్న ఫలాన్ని కోసి తెచ్చుకుని కడుపారా ఆరగించారు. మళ్ళీ టెలిగ్రామ్ ప్రసక్తి లేకుండా స్వామి ఈసారి వెంకటగిరి ప్యాలెస్‌ని వర్ణించటం మొదలుపెట్టారు. గోపాలకృష్ణగారు, కారులో ప్రయాణిస్తున్న ఇతరులు స్వామి చేస్తున్న ప్యాలెస్ వర్ణనను విని అవాక్కయ్యారు. ఎందుకనంటే బాబావారు వెంకటగిరికి ప్రయాణం చేయడం అదే ప్రథమం. అయినా వెంకటగిరి రాయల్ ప్యాలెస్ తమకు ఎంతో పరిచయం ఉన్నట్లు ఎవరెవరు ఏఏ భాగాలలో నివసిస్తున్నదీ ఎలా చెప్పగలుగుతున్నారని ఆశ్చర్యపోయారు. ఈవిధంగా ఆశ్చర్యం గొల్పే సంభాషణలతోనూ, అద్భుత మహిమలతోనూ, ఛలోక్తులతోనూ, దివ్య సంకల్పసృష్టితో అందించిన రుచికరమైన ఆహారాలను తనివితీరా ఆస్వాదిస్తూ కొనసాగిన 368 కిలోమీటర్ల ప్రయాణం సుఖంగా, శుభప్రదంగా వెంకటగిరి సంస్థానానికి చేరింది.

## ఘన స్వాగతం

గోపాలకృష్ణగారు ఆశ్చర్యపడేలా అత్యద్భుతంగా స్వాగత సన్నాహాలు చేయబడి ఉన్నాయి. ఊరేగింపుకు ముందు భాగాన మంగళవాయిద్యాలు మంగళప్రదంగా ముందుకు సాగుతూండగా, ఆ వెనుకనే అత్యంత సుందరంగా అలంకరించబడి గజదళాలు, అశ్వదళాలు అనుసరిస్తూ ఉండగా, ఆ వెనుక పూర్ణకుంభంతో

వేదపఠనం చేస్తున్న పండితోత్తములు ముందుకు సాగుతుండగా, భగవాన్ బాబావారికి స్వయాన ఛత్ర చామర సేవలు చేస్తూ రాజావారితోపాటు వారి కుటుంబ సభ్యులెల్లరు సాదర స్వాగత వచనాలతో, జయజయ ధ్వానాలతో ఊరేగింపుగా రాజసౌధానికి తోడ్కొని వెళ్ళారు.

## టెలిగ్రామ్‌లు ఇవ్వకపోయినా...

సంప్రదాయబద్ధంగా ఘనంగా జరిగిన స్వాగతోత్సవం చూసి గోపాలకృష్ణ యాచేంద్రగారు ఆశ్చర్యపోయారు. కార్యక్రమం పూర్తయి, బాబావారు విశ్రాంతికై లోపలికి వెళ్ళిన తరువాత తండ్రిగారితో, "కారణాంతరాలవల్ల నేను టెలిగ్రామ్‌లు ఇవ్వకపోయినా బాబావారు విచ్చేసే సమయాన్ని ఎలా అంచనా వేయగలిగారు? ఇంత ఘనంగా స్వాగత సన్నాహాలు సరియైన సమయానికి ఎలా చేయగలిగారు?" అని అడుగగా రాజావారు విస్మయంతో, "నీవు టెలిగ్రామ్‌లు పంపకపోవడమేమిటి!" అంటూ టెలిగ్రామ్‌ల కట్టను తెచ్చి చూపించారు. ఆశ్చర్యంగా ఆ టెలిగ్రామ్‌లలో 'మదనపల్లి దాటాము', 'తిరుపతి దాటాము' అంటూ ప్రధాన పట్టణాలు అన్నిచోట్లనుంచి టెలిగ్రామ్‌లు అందినట్లు ఉన్నది.

అప్పుడు గోపాలకృష్ణగారు తండ్రిగారికి జరిగిన వృత్తాంతం పూర్తిగా వివరించి, తనకు టెలిగ్రామ్ ఇచ్చే అవకాశమే స్వామి ఇవ్వలేదని చెప్పటంతో రాజావారు స్థానిక పోస్టుమాస్టరును రప్పించి, ఈ టెలిగ్రామ్‌లు ఎక్కడెక్కడినుండి వచ్చినాయో చెప్పమని అడిగారు. పోస్టుమాస్టరు ఆ టెలిగ్రామ్‌లను పరిశీలించి, ఇవి మా పోస్టాఫీసునుండి వచ్చిన టెలిగ్రామ్‌లు కావు. మా ఆఫీసు ద్వారా వస్తే ఆఫీసు స్టాంపు ఉంటుంది కదా" అన్నాడు. అప్పుడు ఇదంతా స్వామి నెరపిన దివ్యలీల అని అర్థమైనా, స్వామి ముఖతః తెలుసుకుందామన్న భావంతో వెళ్ళి స్వామిని అడుగగా స్వామి చిరునవ్వులు చిందిస్తూ, "అవును, ఇది సాయిలీల. ఇవి స్వామి స్టోర్స్‌నుండి వచ్చిన దివ్యటెలిగ్రామ్‌లు" అన్నారు. ఆ మాటలకు తండ్రీ తనయుల హృదయాలు ఆనందంతో ఉప్పొంగిపోయాయి.

ఈ తొలి పర్యటనలో స్వామి వెంకటగిరిలో పది రోజులున్నారు. ఏరోజుకారోజు సంభ్రమాశ్చర్యాలలో ఓలలాడించే అద్భుతాలను నెరపుతూ వచ్చారు. ప్రతి రోజూ రాజావారి కుటుంబ సభ్యులను వెంకటగిరికి సమీపంలోని కైవల్యానది ఒడ్డుకు తీసుకువెళ్ళి అనేక ఆధ్యాత్మిక విషయాలు బోధించేవారు. ఇసుకనుండి అనేక విగ్రహాలను సృష్టించి పూజించుకొమ్మని కొందరికి అనుగ్రహించేవారు. రకరకాల తినుబండారాలను సృష్టించి ప్రసాదించేవారు. ఆ ఆహార పదార్థాలు మున్నెన్నడూ చవి చూడనంత మధురాతి మధురంగా ఉన్నాయి.

ఆవిధంగా స్వామి ప్రసాదించిన దివ్యానుభవాలలో రాజావారి కుటుంబ సభ్యులందరూ ఓలలాడసాగారు. ఇంతలో పుట్టపర్తినుండి రేవతమ్మ అనే మహిళ రాజకుటుంబానికి సంభ్రమాశ్చర్యాలు గొలిపే ఉత్తరం వ్రాశారు. బాబావారు వెంకటగిరిలో దివ్యలీలలు జరుపుతున్న సమయంలోనే పుట్టపర్తిలో అందరికీ దర్శన భాగ్యం ప్రసాదించారనీ, తామంతా పారవశ్యంతో భజన నిర్వహించి హారతినివ్వగా బాబావారు దయతో స్వీకరించారని ఆ ఉత్తరం సారాంశం. ఆ ఉత్తరం రాజ కుటుంబీకులను దివ్యలోకాలలో విహరింపజేసింది. అప్పటినుండి వారికెల్లరకూ స్వామితోటిదే లోకం. మాతా పితా గురు దైవం అన్నట్లు అన్నింటికీ స్వామే! బారసాల అయినా, పుట్టినరోజు అయినా, పెళ్ళి వేడుక అయినా, నూతన నిర్మాణాలయినా... అదీ ఇదీ అని ఏముంది, ప్రతిదీ స్వామి అనుమతితో, స్వామి దివ్య సమక్షంలో జరగ వలసిందే! ఆవిధంగా బాబావారు 1950 నుండి 1970 వరకు దాదాపుగా ప్రతి సంవత్సరం రెండుసార్లయినా వెంకటగిరికి విచ్చేసేవారు. ఆ దివ్యస్మృతులను బాబావారు వెంకటగిరికి విచ్చేసినప్పుడు విడిది చేసే రాజమహల్‌లోని తూర్పు సౌధంలో ఫోటోల రూపంలో పెద్దపెద్ద ఫ్రేమ్‌లలో నిక్షిప్తం చేశారు. సందర్భానుసారంగా ఆ మధుర స్మృతులను స్మరించుకుందాం.

## మరో ప్రముఖ పాత్రధారి

స్వామి అవతార వైభవంలో ప్రముఖ పాత్రను పోషించబోయే నూతన పాత్రధారి ప్రవేశానికి వెంకటగిరి సంస్థానం వేదిక కావటం ముదావహం. రండి, ఆ కథనంతో మమేకమవుతూ ముందుకు సాగుదాం.

బాబావారు తొలిసారి వెంకటగిరికి వేంచేసిన సమయంలో ఉభయ భాషాప్రవీణులు, జ్యోతిశ్శాస్త్ర నిష్ణాతులు అయిన దూపాటి తిరుమలాచారిగారు అక్కడ లేకపోవటం పెద్ద లోటుగా అందరూ భావించసాగారు. సర్వజ్ఞులు, సర్వహృద్వాసి అయిన బాబావారు సంస్థానం వారితో, "మీ తెలుగు పండితుడైన దూపాటి తిరుమలాచారి వెళ్ళిన ప్రదేశంలో భారీ వర్షాలు, వరదలవల్ల ఆయన సమయానికి ఇక్కడకు రాలేకపోయాడు, రేపటికి రాగలడు" అని చెప్పి అందరినీ ఆశ్చర్యపరిచారు. భగవాన్ సెలవిచ్చినట్లే మరుసటిరోజు వచ్చిన దూపాటివారు అక్కడెక్కడో జరిగిన విషయాలు ఎలా చెప్పగలిగారు అంటూ విస్మయంతో సంస్థానానికి వచ్చారు. ఆయనను చూడగానే బాబావారు, "నేను నీకోసం వచ్చాను. నేను నువ్వు పూజించే అమ్మవారిని" అని ప్రకటించడంతో ఆయన ముగ్ధులై బాబావారి పాదాలపై వ్రాలారు.

మర్నాడు బాబావారు దూపాటివారి గృహాన్ని పావనం చేసి, హస్తచాలనంతో ఒక పతకాన్ని సృష్టించి ప్రసాదించారు. ఆ పతకంలో అమ్మవారు ఒకవైపు, బాబావారి ఫోటో మరోవైపు ఉన్నాయి. ఆశ్చర్యం గొలిపే విషయమేమిటంటే, బాబావారి హృదయభాగంలో దూపాటివారి ఫోటో ఉండటం! అటు తరువాత బాబావారు తిరుమలాచారిగారిని, "సగటు మనిషి జీవితకాలం ఎంత?" అని అడిగారు. అప్పటి ప్రమాణాలను బట్టి ఆయన 55 యేళ్ళు అని చెప్పారు. అప్పుడు స్వామి, "కానీ నీకు వేరుగా ఉందిలే" అన్నారు. అంటూనే, "పుట్టపర్తికి రా, నిన్ను 32 సంవత్సరాలపాటు సన్మానిస్తాను" అన్నారు.

అన్నవిధంగానే బాబావారు దూపాటివారిని ప్రతి సంవత్సరం దసరా వేడుకలప్పుడు జరిగే కవిసమ్మేళనంలో శాలువా కప్పి 32 సంవత్సరాలపాటు సత్కరించారు. సత్యమైన మాట సాయిమాట కదా! ఒకసారి దూపాటి వారు అనారోగ్యకారణంగా కవిసమ్మేళనంలో పాల్గొనటానికి రాలేకపోయారు. అప్పుడు బాబావారు కవి సమ్మేళనాన్ని మర్నాటికి మార్చి, దూపాటివారికోసం కబురుపెట్టి మరీ పుట్టపర్తికి రప్పించుకుని కవిసమ్మేళనం జరిపించారు. అదీ భగవంతునికీ నిజ భక్తునికీ మధ్య ఉండే పవిత్ర బంధం.

భగవాన్ సన్నిధిలో దూపాటి తిరుమలాచారిగారు

భగవంతుని దర్శన స్పర్శన సంభాషణలతోపాటు సత్కారాలు సైతం అందుకుని అవతార వైభవంతో మమేకమై, ఆ దివ్యప్రేమవాహినిలో ఓలలాడిన దూపాటి వారు బాబావారి సుప్రభాతాన్ని రచించి భక్తి శ్రద్ధలతో సమర్పించుకున్నారు. స్వామి ఈ సుప్రభాత శ్లోకాలను సరిదిద్ది స్వయాన బాణీ కట్టి ఆలపించారు. అంతేకాక, 1963 ఫిబ్రవరి 22 శివరాత్రి ఉషోదయ సమయాన వేదపాఠశాల విద్యార్థులచే 21సార్లు ఓంకారం చేయించి, మొట్టమొదటిసారిగా సుప్రభాతాన్ని పఠింపజేశారు. అది మొదలు కోట్లాది ప్రపంచవ్యాప్త సాయిభక్తజనావళికి ప్రధాన సాధనాంశమై తరింపజేస్తున్నదీ పరమ పవిత్రమైన సుప్రభాతం. అంతేగాక, బాబావారి ప్రియ భక్తులు, ప్రాతః స్మరణీయులు కస్తూరిగారు ఇంగ్లీషులో రచించిన బాబావారి దివ్యచరిత్ర "సత్యం శివం సుందరం" మొదటి మూడు భాగాలను తెలుగులో స్వేచ్ఛానువాదం చేసిన అదృష్టం కూడా దూపాటివారిని చిరస్మరణీయులను చేసింది.

(తరువాయి వచ్చే సంచికలో)

సాయి విద్యార్థి దివ్యస్మృతులు

# ప్రేమామృతధార

❖ బి.వి.ఎస్. సాగర్ ❖

బృందావనంలో విద్యార్థి దశలో మేము అనుభవించిన మహత్ భాగ్యములలో ఒకటి స్వామివారు మమ్ముల నుద్దేశించి వ్రాసిన దివ్య లేఖలను అందుకోవటం. ప్రతి ఉత్తరం ఒక ఆశీర్వాదమే. ప్రతి జాబు మాలో ఆధ్యాత్మిక జిజ్ఞాసను పెంపొందించే ఒక ప్రేమామృత గుళికయే. విద్యార్థులపట్ల భగవానుల కరుణ, ప్రేమలు వారు వ్రాసే లేఖలలో ప్రతి పదంలోనూ ప్రస్ఫుటమవుతూ ఉంటాయి. స్వామి తరచు ఇంగ్లీషులో కూడా వ్రాసేవారు. ఎంతటి నిగూఢమైన ఆధ్యాత్మిక భావన అయినా విద్యార్థులకు అర్థమయ్యేటట్లు సరళ సుందరమైన భాషలో వ్యక్తీకరించేవారు.

కొన్ని ఉత్తరాలలో స్వామి విద్యార్థుల నుండి తాము ఆశిస్తున్న సద్గుణములు, క్రమశిక్షణ, కర్తవ్యపాలనలగురించి ప్రస్తావిస్తే, మరికొన్నిటిలో ఆధ్యాత్మికత, భక్తిప్రపత్తులు, శీలనిర్మాణము వంటి అంశాలను గురించి ముచ్చటించేవారు. గోపికా భక్తి గురించి వ్రాస్తూ స్వామి, 'కృష్ణుడు' అని వ్రాసినప్పుడల్లా ప్రక్కనే బ్రాకెట్‌లో 'సాయి' అనో, 'సాయికృష్ణ' అనో వ్రాసేవారు. ఈ బృందావనం ఆ బృందావనం అయితే పుట్టపర్తిని మథురగా వర్ణించేవారు. ఈ దివ్యమైన ఉపమానాలతో మేమంతా ఉత్తేజితులమయ్యే వారము. ఈనాటి విద్యార్థులు ఆనాటి గోపాలురే అనే ఆధ్యాత్మిక భావన అనుభవంలోకి వచ్చేది. ఆ భావన అనిర్వచనీయం.

అలాగే ఇంకొకసారి వ్రాసిన లేఖలో, "...ఇంతటి అదృష్టానికి నోచుకొన్న బృందావనం పిల్లలు పుణ్యులు, ధన్యులు" అని ఆశీర్వదించారు. అయితే ఒక్కొక్కసారి అదే వేయి తల్లుల ప్రేమతో స్వామి పిల్లల క్రమశిక్షణారాహిత్యం, అధిక ప్రసంగాలపైన అసంతృప్తిని, ఒక్కొక్కసారి కోపాన్ని కూడా వ్యక్తపరచేవారు. కొన్ని జాబులలో అయితే కొంతమంది విద్యార్థుల పేర్లు వ్రాసి మరీ మందలించేవారు. స్వామి వ్రాసిన ఈ రెండు కోవలకు చెందిన విద్యార్థులలో నా అదృష్టంకొద్దీ నేనూ ఉండేవాణ్ణి. తిట్టినా, పెట్టినా వారే కదా మనల్ని కాచేది. అది ఒక అపూర్వ అవకాశం ఒక దివ్యవరం, భగవానుల ఆశీర్వాదం. అదేవిధంగా పండుగలప్పుడు, న్యూ ఇయర్స్‌కి ప్రత్యేకంగా ఆశీఃపూర్వక లేఖలు పంపుతూ, మమ్మల్నందరినీ గ్రూపులుగ్రూపులుగా, "లా కాలేజి పిల్లలు, 'సి.ఎ. పిల్లలు', 'సెంట్రల్ కాలేజి పిల్లలు', 'ఫ్యాక్టరీ పిల్లలు' అంటూ విడివిడిగా సంబోధిస్తూ తమ ప్రేమానుగ్రహాలు కురిపించేవారు. (ఆరోజుల్లో మాలో కొంతమందిమి స్వామి సన్నిధిలో ఉంటూ బెంగళూరు సిటీకి వెళ్ళి లా కాలేజి, సెంట్రల్ కాలేజిలలో చదువుకొనేవారము, కొందరు పిల్లలు సి.ఎ. చేసేవారు, మరికొందరు బృందావన్‌కి సమీపంలో ఉన్న ఒక ఫ్యాక్టరీలో పని చేసేవారు)

స్వామి తమ జాబులలో ఒక తల్లిలాగ లాలిస్తారు, తండ్రిలా ఆదేశిస్తారు, ఒక గురువులా బోధిస్తారు, మన దైవముగా ప్రేమను చూపుతారు, ఆశీర్వదిస్తారు. స్వామి మాకు వ్రాసిన చాలా జాబులలో, "పిల్లలు పంపిన ప్రేమతో కూడిన జాబులు అందినవి" అనో, లేకపోతే, "పిల్లల పూజాకుసుమాలు", "వారి ప్రార్థనలు", "వారి విన్నపాలు" అంటూ విద్యార్థులు వ్రాసిన జాబులను ఎక్నాలెడ్జ్ చేసేవారు. దానితో విద్యార్థులు అవధుల్లేని ఆనందాన్ని పొందేవారు. దానికితోడు స్వామి అప్పుడప్పుడు విద్యార్థులలో ఎవరో ఒకరిని, "అలా ఎందుకు వ్రాశావురా?" అంటూనో, లేక "స్వామి ఆశీర్వాదములు దండిగా ఉన్నాయిలే" అంటూనో పలకరించి మరీ వారి ఉత్తరాల్ని ఎక్నాలెడ్జ్ చేసేవారు.

ఒకనాడు స్వామి పిల్లలందరితో మాట్లాడుతూ నావైపు తిరిగి, "నీకు జాబు రాయాలనిపించదా? ఎందుకు ఎప్పుడూ రాయలేదు?" అని ప్రశ్నించారు.

అవును, అంతవరకు నేనెప్పుడూ స్వామికి జాబు రాసుకోలేదు. వ్రాయాలనే ఆలోచనకూడా ఉండేది కాదు. "స్వామికి ఏవైనా విన్నపాలు చేసుకోదలచినవాళ్ళే వారికి జాబులు వ్రాస్తారు" అనుకునేవాణ్ణి. స్వామిదయవలన నాకు అటువంటి అవసరం కలగకపోవటంచేత నేనెప్పుడూ వారికి జాబు వ్రాయలేదు. అంతకుముందు స్వామి నాపై కోపించినా, స్వామి ఉత్తరాలలో నా పేరుకూడా వ్రాసి చీవాట్లు పెట్టినా నేనెప్పుడూ స్వామికి క్షమించమనిగానీ, తప్పయిందనిగానీ వ్రాసుకోలేదు. స్వామి సూచించిన విధంగా ఇంకొంచెం జాగ్రత్తగా ఉంటూ వారి క్షమాభిక్షకై ప్రార్థిస్తూ ఉండేవాడిని. దానికి తగ్గట్టుగా స్వామి కూడా దయతో క్షమించి నాతో మాట్లాడుతూ ఉండటం జరిగేది. అందువలన స్వామికి ఉత్తరం వ్రాయడం అనేది అప్పటికి నాకు తెలియని విషయం.

అయితే, స్వామి నన్ను అలా ప్రశ్నించేసరికి నేను చేష్టలుడిగి అట్లే నమస్కరిస్తూ నిలబడిపోయాను.

"చెప్పు, ఎందుకు వ్రాయడం లేదు?" అని స్వామి మళ్ళీ రెట్టించేసరికి నీళ్ళు నములుతూ, "స్వామికి అంతా తెలుసు. నాకు స్వామికి ఏమి వ్రాయాలో తెలీదు స్వామీ" అని విన్నవించుకున్నాను. "ఏది తెలిస్తే అదే రాయి" అని చెప్పి భుజం తట్టి అనునయంగా ఆదేశించారు స్వామి.

ఇంక అప్పటినుండి బృందావనం నుండి ప్రశాంతి నిలయం ఎవరు వెళ్తున్నా మా సీనియర్లు కొందరు, మా వార్డెనుగారు కూడా స్వామికి జాబు వ్రాసి పంపమని నన్ను హెచ్చరించేవారు.

అప్పటివరకు నేను ఉత్తరం అంటూ వ్రాస్తే మా అమ్మగారికి మాత్రమే వ్రాయడం తెలుసు. ఇంకెవరికీ వ్రాసి ఎఱుగను. అమ్మకు వ్రాసినప్పుడు క్షేమ సమాచారములు, చదువు విషయాలు, స్వామి పలకరించారు, ఆశీర్వదించారు లాంటి తీపి కబుర్లు ఉండేవి. మరి ఇప్పుడు స్వామికి రాయడమంటే...!!!

నాకు మొట్టమొదటగా కలిగిన ప్రశ్న, ఉత్తరంలో స్వామివారిని ఎలా సంబోధించడం? రెండవది ఏమి వ్రాయడం? మొత్తానికి ఏమైతేనేమి, నేను నా మొట్టమొదటి జాబు, తప్పులుంటే క్షమించమని ప్రార్థిస్తూ స్వామివారి దివ్యపాదసన్నిధికి సమర్పించుకున్నాను. అందులో "శ్రీ సాయిమాత పాదపద్మములకు ప్రణామములతో" అని సంబోధిస్తూ వ్రాశాను. ఆ తర్వాత ఒకటి రెండు సందర్భాల్లోకూడా అదేరీతిగా జాబులు వ్రాసి పంపించాను.

కొన్ని దినముల తరువాత స్వామి బృందావనం విచ్చేయడం జరిగింది. స్వామి ఒకరోజు ఉన్నట్లుండి మా అందరితో, "మీకు మీరుగా సాయిమాత బిడ్డలమనుకుంటే సరిపోతుందా?! మీరు సాయిమాతకు తగిన బిడ్డలుగా నడుచుకున్నప్పుడు స్వామే "నేను మీ సాయిమాతను" అని అంగీకరిస్తారు. మీరందరూ ఈ సాయిమాత బిడ్డలని అప్పుడే 'ఎక్నాలెడ్జ్' చేస్తారు" అని సెలవిచ్చారు.

స్వామి పలికే ప్రతి మాటలోనూ ఒక నీతి, ఒక దివ్యభావం వీటితోపాటు ఒక ఆదేశంకూడా ఉండటం సహజం. స్వామి ఆనాడు విద్యార్థులనుద్దేశించి అన్న మాటల్ని నాపరంగా అన్వయించుకొని స్వామిని ప్రార్థిస్తూ ఉండిపోయాను.

ఒక సంక్రాంతినాడు (1974) స్వామి ప్రశాంతి నిలయం నుండి బృందావనంలోని పిల్లలందరినీ ఉద్దేశించి

ఒక అద్భుతమైన సందేశం పంపించారు. అందులో వివిధ బోధనలు చేస్తూ చివరలో, "స్వామి కరుణని, ప్రేమను సంపూర్ణంగా అందుకోండి. సాయి మీ హృదయస్థాయి. స్వామియే మీ అందరి జీవితాలకు శాంతిని ప్రసాదిస్తారు. సాయి మీ సమస్త కోరికలు తీరుస్తారు" అని వ్రాస్తూ సంతకానికి పైన **"ఈ సాయియే మీ తాయి (తల్లి)"** అని వ్రాశారు.

స్వామి పంపిన ఈ సందేశం హాస్టల్‌లో మాకందరికీ చదివి వినిపించారు. "స్వామి చివరకు మా అందర్నీ బిడ్డలుగా అంగీకరించి ఆశీర్వదించారు కదా" అని నాలో నేను ఎంతో ఆనందించాను.

కొద్దిరోజుల తరువాత స్వామివారు బృందావనం వేంచేశారు. ఒకరోజు దర్శన సమయంలో అందరు విద్యార్థులతోపాటు నేనుకూడా లైనులో నిల్చున్నప్పుడు స్వామి నాదగ్గరకు వచ్చి, "ఏమిరా, జాబు ముట్టిందా?" అని అడిగారు.

నేను ఆశ్చర్యపోయి అయోమయంగా, "ఏమి జాబు స్వామీ?" అని అడిగాను.

స్వామి నవ్వుతూ, "అదే, నీ సాయిమాత వ్రాసిన జాబు" అని నవ్వుతూ ముందుకు వెళ్ళిపోయారు.

నేను తన్మయత్వంతో అవాక్కయిపోయాను. అప్పటి నుండి స్వామికి జాబులు సమర్పించుకోవటం నా ప్రార్థనలో ఒక భాగమైపోయింది.

"సిరులకేమి ప్రసన్న చిత్తుండవైనచో
జాలు నాకదె పదివేలు తండ్రీ!
సుఖసంపదలకేమి సుముఖుండవైనచో
జాలు నాకదె పదివేలు తండ్రీ!
కోర్కెలకేమి నీకు కటాక్షమున్నచో
జాలు నాకదె పదివేలు తండ్రీ!
విభవానికేమి నీ యభిమానమున్నచో
జాలు నాకదె పదివేలు తండ్రీ!
ఇచ్చినవి యేవొ యున్నవి యింతె చాలు
అధికములకేమి యవి యెప్పుడైన గలుగు
వీడు నా భక్తుడని యెల్లవేళ నీకు
ఒక్కరీతి ననుగ్రహమున్న జాలు" ❖

# సేవాచందనం

❖ డా॥ వజ్జల సత్యకమలాకర్ ❖

సీ. వ్రతములెన్నొసలిపి పారాయణల్ చేసి
జాగరణల్ సల్పి శ్వాస నిల్పి
జపమాల త్రిప్పుచు సత్సంగములొనర్చి
మంత్రములు పఠించి మౌనముండి
అభిషేకములు చేసి అవధూతలన్ చూసి
నామస్మరణ చేసి నదుల మున్గి
గ్రంథముల్ చదివి విగ్రహముల పూజించి
శాంతి బడయనైతి జగతిలోన

గీ. సాధనల కాదు, ధర దీన జనుల సేవ
ముక్తి సోపానమని స్వామి బోధ సేయ
మనసు వాక్కు కర్మలను సమమొనరించి
బూనుకొంటి సేవకు స్వామి ముదమునొంద

గీ. బిల్వపత్రములగు ప్రేమ దయ కరుణల్
నమ్రమైన వాక్కు నమకమౌను
ఆర్ద్రమౌ హృదయము అభిషేక జలమైన
సేవ పూజకాగ శివుడు మెచ్చు.

గీ. చిత్త శుద్ధికై ధ్యానమ్ము సేయరేమి
వక్త్రమలయురీతి భజనల్ పాడరేమి
చేతులలయునటుల సేవ చేయరేమి
ఏటి సేయని జన్మంబు ఓటికుండ ❖

# శరణాగతవత్సలుడు

❖ బి.ఎస్. వరదరాజన్ ❖

**నా**కు స్వామి గురించి ఏమీ తెలియనప్పటికీ మా అత్తగారి ప్రోద్బలం వలన 1968లో ప్రశాంతి నిలయానికి వెళ్లాను. ఆ సమయంలో నేను హైదరాబాదులోని అకౌంటెంట్ జనరల్ ఆఫీసులో ఆడిటరుగా పని చేస్తూ ఉండేవాడిని. తొలి దర్శనములోనే భగవాన్ నావద్దకు నేరుగా వచ్చి, "ప్రమోషన్‌కోసం నీవు వ్రాయబోయే పరీక్షలో విజయం సాధిస్తావు" అని చెప్పారు. నాకు చాలా ఆశ్చర్యమనిపించింది. ఎందుకంటే, అప్పటికే నేను ఆ పరీక్ష నాలుగుసార్లు వ్రాసికూడా ప్రమోషన్ సాధించలేకపోయాను. పైగా మరొకసారి ఆ పరీక్ష వ్రాసే అవకాశం ఇంక నాకు లేదు. విజయం సాధించటం మాట అటుంచి అసలు పరీక్ష వ్రాసే అవకాశమే లేకపోవడంవల్ల నేను స్వామి మాటల్ని అంతగా పట్టించుకోలేదు. ఐతే, నేను హైద్రాబాదుకు తిరిగి వచ్చిన తరువాత ఆఫీసుకు వెళ్లగానే నా చేతికి ఒక సర్క్యులర్ అందింది. ఇంతకుపూర్వం ఆ పరీక్షలో ఉత్తీర్ణులైనప్పటికీ 60 శాతం మార్కులు సాధించలేకపోయినవారికి మరొకసారి పరీక్ష వ్రాసే అవకాశ మిస్తున్నట్లుగా ఆ సర్క్యులర్‌లో ఉన్నది! స్వామి చెప్పినవిధంగా నేను ఆ పరీక్ష వ్రాయటం, ప్రమోషన్ పొందటం జరిగింది. స్వామికి నా గురించిన అన్ని విషయాలూ తెలుసునని, వారు ఎల్లప్పుడూ నన్ను కనిపెట్టుకుని కాపాడుతుంటారని ఈ సంఘటన ద్వారా నాకు స్పష్టమైంది.

❖❖❖

క్రమంగా నేను సేవాకార్యక్రమాల్లో పాల్గొనటం ప్రారంభించాను. 1968లో నేను హైదరాబాదులో ఉన్నాను. అప్పుడే స్వామి తమ తూర్పు ఆఫ్రికా పర్యటనను ముగించుకొని వచ్చారు. ఒక భక్తుని ఇంట్లో విడిది చేశారు. స్వామి మొదటి అంతస్తులో ఉండగా మేమంతా క్రింద నిలబడి ఉన్నాం. స్వామి బాల్కనీలోకి వచ్చి క్రింద ఉన్న మాతో, "మీలో ఎవరు నా సేవాదళంలో చేరడానికి సిద్ధంగా ఉన్నారు?" అని అడిగారు.

కొద్దిరోజులలో దసరా పండుగ రాబోతున్నది. ఆ పండగ సమయంలో ప్రశాంతినిలయానికి వచ్చే భక్తులకు సేవ చేయటంకోసం సేవాదళ్ సభ్యులను ఎంపిక చేయాలని స్వామి సంకల్పించారు. అక్కడ మేము పదిమందిమి ఉన్నాము. అందరం ఎంతో ఆనందంగా చేతులెత్తి మా సంసిద్ధతను తెలియజేశాము. అప్పుడు స్వామి క్రిందకి వచ్చి మా చొక్కాలకు స్వయంగా సేవాదళ్ బేడ్జీలను పిన్నులతో పెట్టారు. నా జీవితంలో మరపురాని మధుర క్షణాలలో ఇది ఒకటి. ఆ సేవాదళ్ బేడ్జీని ఇప్పటికీ నా దగ్గర జాగ్రత్తగా భద్రపరచుకున్నాను. స్వామి మమ్మల్ని అందరినీ ఉద్దేశించి ప్రసంగిస్తూ, "ఇకమీదట జీవితంలో మీరు ఎటువంటి తప్పులు చేయకుండా ఉంటే మీకింక మరో జన్మ ఉండదు" అన్నారు.

ఆ రోజుల్లో పుట్టపర్తిలో ఒక మారుమూల ప్రాంతంలో భక్తులు కాలకృత్యములు తీర్చుకుంటూ ఉండేవారు. ఒకరోజు స్వామి మా సేవాదళ్ బృందంతో, "రేపు మీరంతా ఆ మారుమూల ప్రాంతానికి వెళ్ళి అంతా శుభ్రం చేసి రండి" అన్నారు. సేవాదళ్ కార్యకర్తలుగా మేమంతా ఎదురుచూసే అవకాశం ఇది. మరునాడు ఉదయం లేచి మేమంతా ఒక దగ్గర చేరి బకెట్లు, పారలు, చీపుళ్ళు మొదలైన సామాన్లు అన్నీ తీసికొనివెళ్ళి, పని ప్రారంభించాము. చేయవలసిన పని చాలా మురికిపని అన్న భావనతో మేము ఎవ్వరం స్నానాలు చెయ్యకుండా, చినిగిన దుస్తులు వేసుకుని వెళ్ళాము. పాడయితే ఆ దుస్తులు పారవెయ్యవచ్చు అని మా ఉద్దేశ్యం.

మూడు గంటలపాటు పనిచేసిన తరువాత మేము తిరిగి వస్తుండగా స్వామి తమ నివాస మందిరం బాల్కనీలో నుంచి మమ్మల్ని చూశారు. వెంటనే క్రిందికి దిగి గబగబా మావైపుకు నడిచి వచ్చారు. వచ్చి మాలో ప్రతి ఒక్కరినీ ఎంతో ఆప్యాయంగా కౌగలించుకున్నారు. మేమందరం ఆశ్చర్యంతో నిర్ఘాంతపోయాము. మా ఒళ్లంతా దుమ్ము, మురికి, చెమటలతో దుర్గంధభూయిష్టంగా ఉంది. కానీ స్వామి ఇవేవీ పట్టించుకోలేదు. తరువాత ఎంతో మెల్లగా, మృదువుగా, "అయితే మీరంతా నేను ఇచ్చిన పని చాలా మురికిపని అని భావించి స్నానం చేయకుండా, మంచి బట్టలు వేసుకోకుండా సేవకు వెళ్లారు కదూ!" అన్నారు. ప్రశ్న మాకు సూటిగా తగలగానే మేము చేసిన తప్పు ఏమిటో మాకు అర్థం అయింది. స్వామి మాకు ఒక సేవను అప్పగించారు. ఆ సృష్టికర్తే స్వయంగా మాకు ఒక పని చెయ్యమని ఆదేశించినప్పుడు మేము సంకుచితమైన మనస్సులతో అది చాలా అల్పమైన పనిగా భావించి స్నానం కూడా చెయ్యకుండా చిరిగిన బట్టలు వేసుకుని సేవకు వెళ్ళాము. ఎంత తప్పు చేశాము!

అప్పుడు స్వామి మాతో, "మీరు ఎప్పుడూ ఒక విషయం గుర్తు పెట్టుకోండి. స్వామి ఎప్పుడు ఏ పని చెయ్యమని చెప్పినా తప్పకుండా స్నానం చేసి పరిశుభ్రమైన బట్టలు ధరించి విభూతి పెట్టుకుని అప్పుడు మాత్రమే సేవ ప్రారంభించాలి, అర్థమైందా?" అన్నారు. వినమ్రతతో మేము మెల్లగా తలలు ఊపాము అర్థమైంది అన్నట్లుగా. సేవ అంటే కేవలం అది ఏదో ఒక పని మాత్రమే కాదు. అశుద్ధమును తొలగించే పని అయినా అది ఒక పూజతో సమానం.

❖❖❖

1968లో ఒకసారి నాకు జ్వరం వచ్చింది. ఎంతకీ తగ్గటంలేదు. హైదరాబాదులోని ఒక పెద్ద ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లాను. చాలా పరీక్షలు చేసిన తరువాత ఇంకా రోగ నిర్ధారణ కాకపోవటం వలన నన్ను ఆసుపత్రిలో చేరమని చెప్పారు. ఆ ఆసుపత్రిలోనే డా॥ టి.హేమచంద్ర ఒక చర్మవ్యాధినిపుణులు ఉండేవారు. ఆయన స్వామి భక్తులు. స్వామి ఆయనకు కలలో కనబడి, తాము నా కర్మను తొలగిస్తున్నందువలన నాకు జ్వరం వచ్చిందనీ, దాని గురించి విచారించవలసిన అవసరం లేదని, ఎలా వచ్చిందో అలాగే పోతుందని నాకు చెప్పమని చెప్పారుట. నేను పదిహేను రోజులపాటు ఆసుపత్రిలో ఉండి, జ్వరానికి కారణం మాత్రం నిర్ధారణ కాకుండానే ఇంటికి వచ్చేశాను. కొన్ని రోజుల తర్వాత జ్వరం దానంతటదే తగ్గిపోయింది.

❖❖❖

1992లో పుట్టపర్తి ప్రశాంతిగ్రామ్‌లోని సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ప్రారంభించబడిన కొద్ది రోజుల తరువాత నేను అక్కడ సేవ చేయటానికై చేరాను. ఆ సమయంలో వివిధ రకములైన వస్తువులతో కొన్ని వందల పెట్టెలు వచ్చాయి. కొన్ని పెట్టెలలో మందులు, కొన్ని పెట్టెలలో వైద్య పరికరాలు, కొన్నింటిలో పుస్తకాలు, ఇలా ఏవేవో ఉన్నాయి. ఒకరోజున స్వామి హాస్పిటల్ డైరెక్టర్ డా॥ సఫాయాగారిని పిలిచి ఆ పెట్టెలలో ఉన్న వివిధ రకాలైన వస్తువులను బయటకి తీసి, ఒక క్రమపద్ధతిలో అమర్చి సంబంధిత విభాగాలకు పంపించే పనిని నాకు అప్పగించమని ఆదేశించారు. ఆయా వస్తువులను శ్రద్ధగా వేరుచేసి లెక్కపెట్టి పంపటం వలన సంబంధిత విభాగాల వారికి వాటిని స్వీకరించటం సులభం అవుతుంది. సుమారు ఒక నెలరోజులపాటు ఆ పని చేయవలసి వచ్చింది. నెల తరువాత స్వామి దర్శనం సమయంలో

సఫాయాగారిని, "పని పూర్తి అయిందా?" అని అడిగారు. "అయింది స్వామీ" అని ఆయన విన్నవించగా, "లేదు... ఇంకా కాలేదు" అని చెప్పి స్వామి వెళ్ళిపోయారు.

నేను అప్పుడు అక్కడే ఉన్నాను. వస్తువులను వేరు చేయటంలో ఏదో పొరపాటు జరిగిందని గ్రహించాను. అది చాలా పెద్ద పని అయినప్పటికీ మళ్లీ ప్రారంభించాను. అక్కడ ఒక పెద్ద పెట్టె ఉన్నది. తెరచి చూస్తే అందులో వైద్య శాస్త్రమునకు సంబంధించిన పుస్తకాలు ఉన్నాయి. వాటి క్రింద ఇంకా ఏమైనా వస్తువులు ఉన్నాయేమోనని అనుమానం వచ్చి పుస్తకాలన్నీ బయటకి తీశాను. నాకు అమితమైన ఆశ్చర్యమును కలుగజేస్తూ అడుగుభాగంలో 'కేథ్ ల్యాబ్'కి సంబంధించిన పరికరాలు ఉన్నాయి. వెంటనే వాటన్నింటినీ కేథ్ ల్యాబ్‌కి పంపించాను. అదే రోజు ఈ విషయాన్ని డా॥ సఫాయా స్వామికి విన్నవించగా స్వామి తల ఊపుతూ, "ఔను, ఇప్పుడు పని పూర్తయింది" అన్నారు. ఈ సంఘటనగురించి ఇక్కడ ఎందుకు ప్రస్తావించానంటే స్వామికి సర్వం తెలుసునన్న విషయం మనం గుర్తించటానికే. మనం వేసే ప్రతి అడుగునూ వారు గమనిస్తుంటారు. మనకు అప్పగించిన సేవాకార్యక్రమాన్ని నిర్వహించడంలో ఏమాత్రము అలసత్వముగానీ, అజాగ్రత్త గానీ పనికిరాదు.

❖❖❖

మేము కొనుగోలు చేస్తున్న వైద్యపరికరాలకు కస్టమ్స్ విభాగం నుంచి అనుమతి తీసుకోవటంకోసం నేను తరచుగా హైదరాబాదు వెళ్ళవలసి వస్తూ ఉండేది. అప్పట్లో హాస్పిటల్‌కి బాగా దగ్గరలో 40 కి.మీ. దూరంలో ఉన్నది ధర్మవరం రైల్వేస్టేషన్ మాత్రమే. ఒకరోజున నేను ధర్మవరం స్టేషన్‌కి వెళ్లి సాయంత్రం వేళ రైలు ఎక్కాను. రైలు ఎక్కాక నిద్రపోయి మరునాడు ఉదయం లేచాను. లేచి చూస్తే నేను ఇంకా ధర్మవరంలోనే ఉన్నాను! ధర్మవరం ఊరి చివర ఒక రైలు పట్టాలు తప్పటం వలన నేను ఎక్కిన రైలు స్టేషన్ నించి బయలుదేరనేలేదు.

ఆరోజుల్లో మామూలు లాండ్‌లైన్ ఫోన్లు కూడా అంతగా ఉండేవి కాదు. నా గురించిన సమాచారం ఏమీ

భగవాన్ సన్నిధిలో వరదరాజన్‌గారు

తెలియకపోవటం వలన డా॥ సఫాయా కొంత ఆందోళనకు లోనైనారు. నా భార్యకు నాగురించి ఏమైనా సమాచారం తెలిసిందేమోనని ఆమెను అడిగితే ఆమె తనకు ఏమీ తెలియలేదని చెప్పింది. అప్పుడాయన హైదరాబాదులోని కస్టమ్స్ ఆఫీసుకు ఫోను చేశారు. నేను ఆఫీసుకి రాలేదని వాళ్ళు చెప్పారుట. నేను హైదరాబాదులో బస చేసే నా స్నేహితుడికి కూడా ఫోన్ చేశారు. కానీ అతనికి కూడా నా గురించి ఏమీ తెలియలేదు. ఇంక చేసేదేమీ లేక డా॥ సఫాయా స్వామి సన్నిధికి వెళ్ళి, క్రిందటి రోజునుండి నా గురించిన సమాచారం ఏమీ తెలియటంలేదని విన్నవించారు. "విచారించవలసినది ఏమీ లేదు. అతను ఇంకా ధర్మవరంలోనే ఉన్నాడు. వేరే రైలు పట్టాలు తప్పటం వలన ఇతను ఎక్కిన రైలు ధర్మవరంలో బయలుదేరనేలేదు. స్టేషన్‌లోనే ఉండిపోయింది" అంటూ సర్వజ్ఞులైన స్వామి డా॥ సఫాయాకి నా క్షేమ సమాచారం తెలియజేశారు.

❖❖❖

మా అమ్మాయి అనంతపురంలోని స్వామి కళాశాలలో చదువుకుంటూ ఉండేది. క్రిస్‌మస్ సెలవులలో ఆమె కర్నూల్‌లో జరిగిన ఇంటర్ యూనివర్సిటీ స్పోర్ట్స్ మీట్‌కి వెళ్లింది. క్రీడోత్సవాలు ముగిసిన తరువాత హైదరాబాదు రావటంకోసం కర్నూలులో బస్ ఎక్కింది. ఆమెను బస్ ఎక్కించిన వాళ్ల టీచరు మాకు టెలిగ్రామ్ ఇచ్చింది, ఆ రాత్రి మేము బస్ స్టాండ్‌కి వెళ్లి మా అమ్మాయిని రిసీవ్

చేసుకోవాలని. కానీ మాకు ఆ టెలిగ్రామ్ అందనేలేదు. ఆ సమయంలో నేను హైదరాబాద్‌లో లేను, ఏదో పనిమీద వేరే ఊరికి వెళ్లాను. పైగా హైదరాబాదులో ఏవో ఘర్షణలవల్ల కర్ఫ్యూ అమలులో ఉంది. కానీ, కర్నూలులో బస్సెక్కిన మా అమ్మాయికి హైదరాబాదు పరిస్థితి గురించి ఏమీ తెలియదు.

హైదరాబాదుకు 50 కి.మీ. దూరంలో ఉన్న జడ్చర్ల దగ్గర బస్‌లోని ప్రయాణికులు చాలామంది దిగిపోయారు. బస్‌లో కొద్దిమంది ప్రయాణికులు మాత్రమే ఉన్నారు. వారిలో మా అమ్మాయి ఒక్కతే ఆడపిల్ల. జడ్చర్లలో బస్సు బయలుదేరే ముందు ఒక వృద్ధురాలు బస్ ఎక్కింది. ఆవిడ హైదరాబాదులోని పరిస్థితిని గురించి మా అమ్మాయికి వివరించి, కంగారుపడవద్దని ధైర్యం చెప్పి, బస్సు దిగిన తరువాత స్వయంగా వెంట వచ్చి మా అమ్మాయిని ఇంటి దగ్గర దిగబెట్టింది. అప్పటికే రాత్రి చాలా పొద్దుపోవడంచేత మా ఇంట్లోనే నిద్రించింది. ఉదయం కొన్ని గంటలపాటు కర్ఫ్యూని సడలించిన సమయంలో ఆమె వెళ్లిపోయింది. పరిస్థితులు కొంచెం కుదుటపడిన తరువాత ఆమె ఇచ్చిన అడ్రస్ పట్టుకుని ఆవిడని కలుద్దామని వెళితే అసలు మాకు ఆ అడ్రస్ దొరకనే లేదు. అటువంటి క్లిష్ట పరిస్థితిలో కర్ఫ్యూ సమయంలో రాత్రివేళ మా అమ్మాయిని క్షేమంగా ఇంటికి చేర్చటంకోసం స్వయంగా స్వామే ఆ వృద్ధ స్త్రీ రూపంలో వచ్చారని మాకు అర్థమైంది.

❖❖❖

2009 మే నెలలో నాకు వెన్నెముక డిస్క్ ప్రక్కకి తొలగిపోవటంవలన కొద్ది నిమిషాలకంటె ఎక్కువసేపు కూర్చోవటంగాని, నిలబడటంగాని చేయలేకపోయేవాడిని. నేను అప్పుడు సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌లో వైద్యవిద్యకు సంబంధించిన పోస్ట్‌గ్రాడ్యుయేట్, పోస్ట్ డాక్టరల్ కోర్సుల పర్యవేక్షణ చేస్తూ ఉండేవాడిని. నా పరిస్థితిని చూసిన హాస్పిటల్ అధికారులు ఇంక నేను ఉద్యోగ బాధ్యతలు ఎంతమాత్రం నిర్వహించే పరిస్థితిలో లేనని నిర్ధారణకి వచ్చి నా బదులుగా వేరొకరికి నా విధులను అప్పగించారు. నేను మంచానికే పరిమితం అయ్యాను. భోజనం కూడా మంచంలో పడుకునే తినవలసివచ్చేది.

2009 మే 29వ తేదీన దర్శనం సమయంలో స్వామి అకస్మాత్తుగా వెనుదిరిగి ఆడవారు కూర్చునే వైపుకు వచ్చి, "విషయం ఏమిటి?" అని నా భార్యను ప్రశ్నించారు. నేను మంచానపడ్డ విషయం గురించి నా భార్య విన్నవించగా, వెంటనే ఒకవైపున స్వామి, మరొక వైపున ఓంకారముతో ఉన్న ఒక లాకెట్టును గొలుసుతోసహా సృష్టించి ఆమెకు అనుగ్రహించారు. ఆ గొలుసు లాకెట్టు నాకోసం అనుకొని ఆమె తన గుప్పెటలో దానిని భద్రంగా పట్టుకుంది. కానీ స్వామి ఆమెను ఆ గొలుసును అక్కడే మెడలో ధరించమని చెప్పారు. అది ఆమెకేనని చెప్పారు. ఆమె ఆ గొలుసును ధరించేదాకా అక్కడే ఉండి ఆశీర్వదించి వెళ్ళారు. ఆ సమయంలో విపరీతమైన నడుంనొప్పితో నేను ఇంట్లోనే మంచంలో ఉన్నాను. మా ఆవిడ ఇంటికి వచ్చేసరికి వీల్‌ఛైర్‌లో హాయిగా కూర్చుని ఉన్న నన్ను చూసి తెల్లబోయింది. ఎలా మీరు లేచి కుర్చీలో కూర్చోగలిగారని అమితమైన ఆశ్చర్యంతో, ఆనందంతో నన్ను ప్రశ్నించింది.

అక్కడ మందిరంలో స్వామి నా భార్యకు గొలుసు లాకెట్టు ఇచ్చిన క్షణం నుంచీ నాకు స్వస్థత చేకూరింది. ఇంట్లో ఉండగానే నాకు మెల్లగా తగ్గిపోయింది. ఆ తరువాత నాకు అసలు ఏ నొప్పీ లేదు.

ఇన్నేళ్లుగా స్వామి దివ్యసాన్నిధ్యంలో ఉండటంవలన నేను గ్రహించిన విషయం ఏమిటంటే, స్వామికి త్రికరణ శుద్ధిగా శరణాగతి చేస్తే మనము ఊహించిన దానికంటె ఎంతో అధికంగా స్వామి మనకు రక్షణను అనుగ్రహిస్తారు.

**తెలుగుసేత: కొండూరి నాగమణి**

# కరోనా విపత్తు - శ్రీ సత్యసాయి అంతర్జాతీయ సంస్థ సేవలు

డా॥ దివి చతుర్వేది

"జన సేవయే జనార్దన సేవ" అన్నారు భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారు. సర్వజీవులపట్ల ప్రేమభావముతో మెలగడమే భక్తిమార్గంలో అత్యున్నతమైన సాధన అన్నారు. వారి దివ్యజీవితమే జగతికి సందేశము. వారి దివ్యజీవితం, వారి సందేశామృతం, వారు చేపట్టిన కార్యములు ఇచ్చిన స్ఫూర్తితో శ్రీ సత్యసాయి అంతర్జాతీయ సంస్థ 120 దేశాలలో (భారత దేశం కాక) ఎన్నో మానవహిత పథకాలను చేపట్టింది. విద్య వైద్య సేవా రంగాలలో బృహత్ ప్రణాళికలను భగవానులే మానవాళి అభ్యున్నతికై రూపొందించి, మార్గ దర్శకత్వము వహించి, అమలుపరచి, అభివృద్ధిపరచడము మన మహద్భాగ్యం. ఎన్ని సవాళ్లు, ఆటంకాలు ఎదురైనా శ్రీ సత్యసాయి అంతర్జాతీయ సంస్థ భగవాన్ బాబావారు నిర్దేశించిన మార్గాన్ని అనుసరిస్తూనే ఉన్నది.

## కోవిడ్19 మహమ్మారి - శ్రీ సత్యసాయి అంతర్జాతీయ సంస్థ ప్రతిస్పందన

**అన్నార్తుల సేవ:** ఆఫ్రికా ఖండములో తీవ్రమైన ఆహార కొరతవలన 250 మిలియన్ల మంది ఆకలి బాధకు గురిఅయ్యారు. అక్టోబర్ 2020 నాటికి ప్రకృతి వైపరీత్యాల వలన, కోవిడ్-19 మహమ్మారి వలన ఆఫ్రికా ఖండములో కరవుకు గురిఅయిన దేశాలకు 200 టన్నుల ఆహారాన్ని శ్రీ సత్యసాయి అంతర్జాతీయ సేవాసంస్థ సరఫరా చేసింది. 20 అడుగుల పొడవున్న 11 కంటైనర్లద్వారా ఆహారాన్ని అంగోలా, బెనిన్, కామెరూన్, కాంగో, గాబన్, ఐవరీ కోస్ట్, మడగాస్కర్, నైజీరియా, సెనెగల్, సౌత్ ఆఫ్రికా మరియు టోగో దేశాలకు రవాణా చేసింది. శ్రీ సత్యసాయి అంతర్జాతీయ సంస్థ (కెన్యా మరియు ఘనా) ఆయా ప్రాంతాలలో ఉన్న నిరుపేద కుటుంబాలకు ఆహారాన్ని, ఇతర నిత్యావసర వస్తువులను అందజేసింది.

భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి భక్తులు కొన్ని వేల కిలోల ఆహారాన్ని, నిత్యావసర వస్తువులను, ఆస్ట్రేలియా, కెనడా, గ్వాటమాల, హాంకాంగ్, ఇండొనేషియా, కజకస్తాన్, మెక్సికో, మయన్మార్, నేపాల్, రష్యా, శ్రీలంక, ఉక్రెయిన్, యు.కె., యు.ఎస్.ఏ., వెనిజులా ఇంకా మరెన్నో దేశాల్లో ఆర్తులకు అందజేశారు. ఈ సేవలను అందుకున్నవారిలో, నిలువ నీడలేనివారు, అనాథలు, ప్రాణాంతకమైన వ్యాధులతో బాధపడేవారు, బిక్షాటన చేసేవారు ఉన్నారు. కొన్ని వైద్యాలయాలకు కూడా ఈ సహాయము అందింది. ప్రపంచవ్యాప్తముగా కోవిడ్-19 బారినపడి తీవ్రమైన ఆర్థిక నష్టానికి గురియైనవారందరికీ సాయిభక్తులు సహాయము చేశారు. ఆర్థిక మాంద్యమువలన నేపాల్‌లో పెంపుడు జంతువులను వాటి యజమానులు సంరక్షించుకోలేని పరిస్థితులు ఎదురు కాగా, సాయి భక్తులు వాటిని ఆదుకున్నారు.

**వ్యక్తిగత రక్షణ దుస్తులు (పి.పి.ఇ.):** అమెరికాలో సాయి భక్తులు పి.పి.ఇ.ల కొరత తీవ్రముగా ఉండిన సమయంలో వాటి తయారీలో అత్యుత్తమ విధానాలను పరిశోధించి ముడిపదార్థాన్ని సేకరించడంలోనూ, నమూనాలను తయారుచేయడంలోనూ విశేషమైన కృషి చేశారు. అక్టోబర్ 2020 నాటికి 40,000ల ఫేస్ మాస్కులను; 2,500 ఫేస్ షీల్డ్‌లను; 700 హాస్పిటల్ గౌన్లను; 400 స్క్రబ్ కాప్స్‌ను; 5,600 గ్లవ్ బాక్స్‌లను, 800 శానిటైజర్ కంటైనర్లను హాస్పిటల్స్‌కు, క్లినిక్స్‌కు, దంతవైద్య కేంద్రాలకు, శరణాలయాలకు అందజేశారు.

కెనడా, యు. కె., థాయిలాండ్, నేపాల్ తదితర దేశాలలో శ్రీ సత్యసాయి అంతర్జాతీయ సంస్థ సభ్యులు వేలకొలది ఫేస్ మాస్కులను, వందలకొలది ఫేస్ షీల్డ్‌లను,

శానిటైజర్స్‌ను ఆరోగ్య కార్యకర్తలకు విరాళముగా అందజేశారు.

**ఆరోగ్య పరిరక్షణపట్ల అవగాహన:** శ్రీ సత్యసాయి అంతర్జాతీయ సంస్థ 2020 ఏప్రిల్ 11న ఆరోగ్య సంరక్షకులకొరకు ఒక వెబినార్‌ను నిర్వహించింది. వివిధ వైద్యశాఖలలో నిష్ణాతులైనవారు కోవిడ్-19 నియంత్రణకు సంబంధించిన అత్యుత్తమ విధానాలను చర్చించారు. ఏప్రిల్ 12న సాధారణ ప్రజానీకంకొరకు మరొక వెబినార్‌ను నిర్వహించి, కోవిడ్-19 గురించిన యథార్థాలను వివరించారు, అపోహలను తొలగించారు. కోవిడ్-19 ప్రభావానికి సమాజము గురి అయి ఉన్న సమయములో ఎటువంటి సేవలను అందించవచ్చునో తెలియజేశారు. ఈ రెండు వెబినార్లు https://sathyasaiorg/healthy-living/coronavirus/webinars లో అందుబాటులో ఉన్నాయి. మెక్సికోలో, శ్రీలంకలో, ఇంకా అనేక దేశాలలో శ్రీ సత్యసాయి సంస్థ అవగాహన కార్యక్రమాలను నిర్వహించింది.

**శ్రీ సత్యసాయి అంతర్జాతీయ సంస్థ - హరిత రక్షణ:** ప్రకృతియే పరమాత్మస్వరూపం. నేటి ప్రపంచము పర్యావరణమునకు సంబంధించి ఎన్నో సవాళ్ళను ఎదుర్కొంటున్నది. ప్రజల ఆరోగ్యము, సంక్షేమము ఇంకా మానసిక ప్రశాంతత కూడా దెబ్బతింటున్నాయి. ఈ సమస్యల నుండి బయటపడటానికి కోరికలపై ఆదుపును సాధించాలి. పెట్రోలియం, విద్యుచ్ఛక్తి మరియూ ప్లాస్టిక్ వస్తువుల వినియోగాన్ని తగ్గించుకోవాలి. నీటిని పొదుపు చేయాలి. ఇంకా పర్యావరణ పరిరక్షణకు సానుకూలమైన పనులను చేపట్టాలి. అమూల్యమైన ప్రకృతి వనరులను దుర్వినియోగము చేయకూడదు. కలుషితమైన గాలి, నీరు, ఆహారమువలన పర్యావరణము కలుషితమైనది. పంచభూతాలన్నీ దుష్పరిణామానికి గురి అయ్యాయి. అందువలన ప్రజలు వాహనాల వినియోగాన్ని తగ్గించుకోవాలి. పారిశ్రామిక వ్యర్థాలను నియంత్రించాలి.

మానవ జీవిత పూర్ణత్వ సిద్ధికి పర్యావరణ సమతుల్యత ఆవశ్యకమని సెలవిచ్చారు భగవాన్ బాబావారు. శ్రీ సత్యసాయి అంతర్జాతీయ సంస్థ పర్యావరణ పరిరక్షణ ప్రాతిపదికగా ప్రజలలో కోరికలపై అదుపును సాధించాలనే అభిలాషను, మానవతావిలువల ఆచరణపట్ల ఆసక్తిని పెంపొందించడానికి ప్రోత్సాహక చర్యలను చేపట్టింది. ఎన్నో పర్యావరణ పరిరక్షణ ప్రణాళికలను దైవకార్యములో భాగముగా ప్రపంచవ్యాప్తముగా అమలుచేసింది. థాయిలాండ్‌లో సోలార్ ప్రాజెక్ట్; వన్య విస్తరణకై అజర్బైజాన్, ఆస్ట్రేలియా, బహరేన్, కెనడా, జర్మనీ, కజకస్తాన్, కెన్యా, మోల్డోవా, న్యూజిలాండ్, పోలాండ్, సౌత్ ఆఫ్రికా, అమెరికా దేశాలలో మొక్కలను నాటడం; కెనడా, దుబాయ్, ఘనా, మెక్సికో, నేపాల్, రష్యాలలో రేవులను, నదీ తీరములను శుభ్రపరచడం ఈ ప్రణాళికలో అంతర్భాగం. శ్రీ సత్యసాయి అంతర్జాతీయ సంస్థ యువ సభ్యులు ఐక్యరాజ్య సమితి పర్యావరణ పరిరక్షణ కార్యక్రమములో చురుకుగా పాల్గొంటున్నారు.

**దీనజన సంఘాల దత్తత:** భగవాన్ బాబావారి 95 వ జయంతి సమర్పణగా శ్రీ సత్యసాయి అంతర్జాతీయ సంస్థ దీనజనులకు నాణ్యమైన జీవితాన్ని అందించే ప్రణాళికను ప్రారంభించింది. వారికి విద్య, వైద్యము, ఆహారము, ఆశ్రయము, త్రాగునీరు, ఇంకా ఆవశ్యకమైన ఇతర సేవలను అందిస్తున్నది. ఈ పథకంయొక్క లక్ష్యం స్వచ్ఛంద సేవకుల హృదయాలలోనూ, ఈ సేవల వలన ప్రయోజనము పొందుతున్నవారిలోనూ పరివర్తన తీసుకు రావడం. ప్రపంచవ్యాప్తముగా కనీసము 95 దీనజన సంఘాలను దత్తత తీసుకొని వారి సముద్ధరణకు కృషి చేయాలనే లక్ష్యముతో ఈ పథకాన్ని ప్రారంభించినా, ఇప్పటికే 40 దేశాలలో 160 సంఘాలను దత్తత తీసుకోవడం జరిగింది.

**భవిష్యత్ ప్రణాళిక:** భగవాన్ బాబావారి సార్వజనీన సందేశము మానవాళి కోవిడ్ మహమ్మారిని ధైర్యముగా, ఆత్మవిశ్వాసముతో ఎదుర్కోవడానికి దోహదపడుతున్నది. భగవాన్ బాబావారి అనుగ్రహాశీస్సులతో, నిస్వార్థముగా ఐకమత్యముతో, పవిత్ర భావముతో సర్వజనులకు సేవను అందిద్దాము. జీవితాన్ని ప్రేమమయము గావించుకొని, భగవాన్ బాబావారి దివ్యప్రేమామృతాన్ని అందరికీ పంచుదాం.

**- శ్రీ సత్యసాయి అంతర్జాతీయ సంస్థ సౌజన్యంతో...**

**ప్రశాంతినిలయంలో పవిత్ర క్రిస్మస్ గీతాలాపన:** 2020 డిసెంబరు 25న ఉదయం 8 గంటలకు వేద పఠనానంతరము ప్రశాంతి మందిర భజన బృంద సభ్యులు క్రిస్మస్ గీతాలను ఆలపించారు. "ఉయ్ విష్ యు ఎ మెర్రి క్రిస్మస్," "యాజ్ ఉయ్ గేదర్ ఇన్ దిస్ స్పేస్ టుడే," "ఓ హోలీ నైట్," "షైన్ ఆన్ జీసస్," "గ్లోరియా గ్లోరియా," "లార్డ్ ఐ ఆఫర్ మై లైఫ్ టు యూ," "ఓ మై సోల్ డు యు నాట్ నో," "హేవ్ యు నాట్ హర్డ్," "మోర్ లవ్ మోర్ సర్వీస్," "థ్యాంక్యూ లార్డ్," గీతాలను పాడారు. అనంతరం కొంత సమయం భజన చేశారు. భగవాన్ బాబావారి దివ్యగాత్రములో, "లవ్ ఈజ్ మై ఫామ్, ట్రూత్ ఈజ్ మై బ్రెత్"తో సంకీర్తన ముగిసింది. ఆ తరువాత భగవాన్ బాబావారికి మంగళ హారతినిచ్చారు.

**నూతన సంవత్సరానికి స్వాగతం:** ప్రశాంతి మందిర భజన బృందమువారు 2021 జనవరి 1వ తేదీన సాయం సమయంలో, సాయికుల్వంత్ హాలులో, భగవాన్ బాబావారి దివ్యసన్నిధిలో నూతన సంవత్సరానికి స్వాగతం పలుకుతూ, భగవాన్ బాబావారి దివ్యాశీస్సులకై ప్రార్థిస్తూ సంకీర్తన చేశారు. "ఎంత హాయి, ఎంత హాయి ఈనాడు," "వై ఫియర్ వెన్ ఐ యాం హియర్," "ఓ సాయి మా," "సాయిమాత బిడ్డలం అందరం" పాటలు పాడారు.

అనంతరం, భగవాన్ బాబావారి దివ్య ప్రసంగం ప్రసారమయింది. "ఈ కొత్త సంవత్సరం ఈనాటినుండి అందరుకూడా సుఖంగా, సంతోషంగా, ఏవిధమైన బాధలు లేకుండా ఆరోగ్యంగా ఉండాలని ఆశీర్వదిస్తున్నాను. అందరూ సంతోషముగా, ప్రశాంతముగా, ప్రేమతో, దైవభావముతో జీవించండి. ఆ దివ్యమైన ప్రేమ భావముతోనే మీ జీవితాలను సార్థకము చేసుకోండి" అని భగవాన్ ఉద్బోధించారు. "ప్రేమ ముదిత మనసె కహో" పాటతో తమ దివ్య సందేశాన్ని విరమించారు. ❖


# Sri Sathya Sai General Hospital

**Prasanthi Nilayam, Puttaparthi, Anantapur District, Andhra Pradesh - 515134**
**Email: medsupgh@sssihms.org.in, Ph. 08555-287256, 289409**

## Applications are invited to the following vacant posts:

1. **Department of Obstetrics and Gynaecology**
   Post: Junior Consultant / Senior Resident
   Qualification: M.D. / M.S. / D.N.B. (OB & GY) with relevant experience
2. **Department of Paediatrics**
   Post: Junior Consultant / Senior Resident
   Qualification: M.D. / D.N.B (Paediatrics) with relevant experience
3. **Department of General Surgery**
   Post: Junior Consultant / Senior Resident
   Qualification: M.S. / D.N.B (General Surgery) with relevant experience
4. **Department of Anaesthesia**
   Post: Junior Consultant / Senior Resident
   Qualification: M.D. / D.N.B (Anaesthesiology) / D.A. with relevant experience

**– Medical Superintendent**

'సనాతన' అక్షర సౌరభాలు:

# లోకపితా

**భ**గవాన్ శ్రీ సత్యసాయిబాబావారి జీవిత చరిత్రయగు "సత్యం, శివం, సుందరం" గ్రంథమును ఢిల్లీలో భారత జ్యోతిష్యశాస్త్ర పరిశోధనా సంఘ నిర్వాహకుడైన డాక్టరు ఇ.వి.శాస్త్రిగారు చదివిరి. వారు అది చదువగానే అరవ దేశములో సుప్రసిద్ధి బడసిన తాటియాకుపై వ్రాయబడిన జ్యోతిష్యశాస్త్ర సంబంధిత నాడీగ్రంథములందు భగవాన్ బాబావారి అవతార విషయమేమైనా వ్రాయబడినదేమోయని తెలిసికొనగోరిరి.

అనేక వందల సంవత్సరముల క్రిందట వ్రాయబడిన ఈ తాటియాకు గ్రంథములందు శ్రీ బాబావారి దివ్య అవతార విషయములనుగూర్చి వ్రాయబడియుండుటయు; ఈ విషయములకును, బాబావారి దివ్యజీవిత చరిత్రయగు "సత్యం శివం సుందరం"నందు వ్రాయబడిన విషయములకును ఏమాత్రము భేదము లేకుండుటచే శాస్త్రిగారికి అమితాశ్చర్యము, బాబావారి అవతారముపై దృఢ విశ్వాసము కలిగినందున, ఆయన గత నవంబరు నెలలో బాబావారి జన్మదినమున పుట్టపర్తికి వచ్చి, శ్రీ స్వామివారి అవతారమునుగూర్చి ప్రాచీన మహర్షులగు అగస్త్య, బుధ, శుక్ర మున్నగువారిచే వ్రాయబడిన తాటియాకులలో ఒకదానిని తెచ్చి శ్రీవారి పాదపద్మములకు అర్పించిరి. ఆ ప్రాచీన మహర్షుల జ్యోతిష్యశాస్త్ర జ్ఞానము నిశ్చయముగా మహాద్భుతము.

ఆ తాటియాకు పొడవు 36 సెంటీమీటర్లు! వెడల్పు 2 1/2 సెంటీమీటర్లు! దానియొక్క ప్రతివైపున 26 పంక్తులు వ్రాయబడినవి. ఒక్కొక్క పంక్తిలో 250 అక్షరములున్నవి! ఈ అతి సూక్ష్మములగు అక్షరములను ఎక్కువ శక్తిగల మంచి భూతద్దము సహాయముననే ఎవరుకాని చదువగలరు. దీనియందు అరవములో ప్రాచీనశైలిలో శ్లోకరూపమున వ్రాయబడినది.

అగస్త్యనాడి, బుధనాడి, శుక్రనాడియను, ఈ నాడీగ్రంథములు గల ముమ్వురునుండి శాస్త్రిగారు బాబావారి అవతారమును గూర్చి ముందుగనే వ్రాయబడిన విషయములను తెలిసికొనిరి. బాబావారి అవతార జాతక కుండలి ఈ ముమ్వురు వ్రాసినవి నొకేవిధముగా నుండుట చాలా ఆశ్చర్యముగ నున్నది.

ఆ శ్లోకములను చదివినచో మన పూర్వ మహర్షులు రాబోవు విషయములనుగూర్చి ఎంత సరిగా రాసినారో, వారి భవిష్యత్ జ్ఞానము మనలను ఆశ్చర్యచకితుల జేయును.

“శ్రీ బాబావారు పూర్వావతారములో సాయిబాబాయను గురువుగా ప్రజలచే నెల్లెడల పూజింపబడుచునుండిరని ఒక నాడీగ్రంథమున వ్రాయబడినది. “శ్రీ బాబావారు శ్రీ సాయి అవతారమే” యని మరొక నాడీగ్రంథమున వ్రాయబడినది (“సాయియే తాన్”)

ఈ ముపృరు వ్రాసిన గ్రంథములందును శ్రీ బాబావారి మాతాపితల పేర్లు తెలిపినారు. “శ్రీ బాబావారి పేరు సత్యనారాయణరాజు అనియు, వీరు పాఠశాలలను, చికిత్సాలయములను నిర్మింతురనియు, ప్రజల అజ్ఞానమును తొలగించుటకై గ్రంథములను వ్రాయుదురనియు, ధర్మస్వరూపులైన శ్రీ బాబావారు ధర్మబోధను చేయుదురనియు” ఈ ముప్వురు వారివారి నాడీ గ్రంథములందు రాసినారు.

“శ్రీ సత్యసాయిబాబావారు సచ్చిదానందస్వరూపులని బుధనాడీ గ్రంథమునను; వారు శీఘ్రవైద్యులనియు, కరుణావతారులనియు, మానవకోటికంతయు వీరే తండ్రి, “అఖిల రుక్కు పితా” అని అగస్త్యనాడీ గ్రంథమునను; వీరు ప్రేమ, కరుణ, జ్ఞానబోధనచే ప్రజలెల్లరికీ శాశ్వత ఆనంద సౌఖ్యము నొసంగుదురనియు, వీరు నిర్మించిన మందిరము తపోనిలయమనియు, వీరు అవతారమూర్తులనియు, మానవసేవయే స్వామి ఆనందమనియు” శుక్రనాడీ గ్రంథమున రాయబడినది.

నిశ్చయముగా శ్రీ బాబావారొనర్చు కార్యములందలి మాధుర్యమును చవిచూచినవారికి, వీరిట్టివారని సహస్రాంశమైన గ్రహించినవారికి, ఈ తాటియాకు గ్రంథములందు రాయబడిన విషయములు కేవలము తేలికయైనవి. కానీ అనేక వందల సంవత్సరముల క్రిందట బాబావారి అవతారమునుగూర్చి రాయబడిన శ్లోకములను చదివినచో అవి ప్రతియొకరికీ అత్యంత ఆశ్చర్యమును గలుగజేయును, నమ్మకమును దృఢము జేయును.

**(‘సనాతన సారథి’ 1961 ఫిబ్రవరి సంచిక నుండి)**

❖❖❖

## మనకోసం పుట్టిన దేవుడు

పుట్టపర్తీశుడు పుడమిపై కేతెంచె
భువిని ధర్మము నిల్పి బ్రోచుటకును
సత్యసాయి విభుడు సంభవించెను పర్తి
దారి తప్పినవారి దరికి చేర్చ
ఈశ్వరాంబ కొమరుడీ జగతిని పుట్టె
దీనజనులకెల్ల దిక్కుగాగ
వేంకమాఖ్యు సుతుడు విచ్చేసె నీ ధాత్రి
భక్తకోటుల నేలి ముక్తి నీయ
సర్వదిక్కులయందు ప్రశాంతినిలయు
డెల్లవేళల నిండియుండె, నతని దయ
క్రమము తప్పని రీతి నాకాశమందు
తిరుగుచున్నవి లోకముల్ పరిధిలోన.

**– పలివెల సుబ్బారాయుడు**

## సర్వదేవతాతీతుడు

ఎవ్వాని కనుసైగ ఏడేడు లోకాలు
నిత్యకృత్యాలలో నియతి మసలు
ఎవ్వాని చిరునవ్వు ఏడేడు లోకాల
రోగుల బాధలన్ రూపుమాపు
ఎవ్వాని చేతులు ఏడేడు లోకాల
ఆర్తుల హృదయాలు హత్తుకొనును
ఎవ్వాని పాదాలు ఏడేడు లోకాల
ముక్తి వాంఛితులకున్ మోక్షమొసగు
అతడె – ‘శ్రీ సత్యసాయీశ’ – హరిహరుండు
జీవి కర్మల సాక్షియై చెలగువాడు
మనదు ప్రార్థన లాలించు మహితమూర్తి
సర్వదేవతాతీతుడౌ సత్యమతడు.

**– గాదె శ్రీరామచంద్రమూర్తి**

“భయమేల సాయి ఉండగా, భక్తుల పాలిటి అండగా”

REGD. WITH REGISTRAR OF NEWSPAPERS R.NO. 10772/64 REGN.NO. HDP/001/2021-2023
Licenced to post without prepayment No. PMGK/RNP/WPP-02/2021-2023

Date of Publication 8th February 2021

## బుద్ధి పరిశుద్ధమైన అద్దము వంటిది

మానవుడు తనను తాను గుర్తించుకొనే నిమిత్తం భగవంతుడు అతనికి పవిత్రమైన బుద్ధిని అనుగ్రహించాడు. మీరు స్వస్వరూపాన్ని గుర్తించుకోవాలంటే మీ బుద్ధి అనే అద్దమునకు ఒకవైపున ప్రేమ అనే రసాయనమును పూయాలి. రసాయనము పూయని అద్దమును ఎదురుగా పెట్టుకుంటే దాని వెనుక భాగమున ఉన్నదేదో కనిపిస్తుందికానీ, మీకు మీరు కనిపించరు. కనుకనే, ఈనాడు ప్రతి ఒక్కరూ, "ఎవరండీ మీరు? ఎక్కడినుండి వచ్చారు?" అని ఎదుటివారిని ప్రశ్నిస్తున్నారేగాని, "నేనెవరు? ఎక్కడినుండి వచ్చాను?" అని తమను తాము ప్రశ్నించుకోవడం లేదు. మొట్టమొదట "నీవెవరు?" అనే ప్రశ్నను వదలిపెట్టి మీరు "నేనెవరు?" అనే విచారణను ప్రారంభించాలి. ఇతరుల దోషాలను చూడటం మానివేసి మీలోని దోషాలను గుర్తించుకోవాలి.

- శ్రీసత్యసాయి

వార్షిక చందా: ₹ 90 (భారతదేశంలో) ₹ 900 లేక UK £ 13 లేక US $ 18 (విదేశాలకు) చందారుసుమును 1 లేదా 2 లేదా 3 సంవత్సరములకు చెల్లించవచ్చును.

సనాతన సారథి చందాలు మనీయార్డరుద్వారా, లేక పర్సనల్ చెక్‌ద్వారా, లేక డిమాండ్ డ్రాఫ్ట్‌ద్వారా లేక, ఆన్‌లైన్ పద్ధతిన మా వెబ్‌సైటు **www.sanathanasarathi.org** ద్వారా చెల్లించవచ్చును. చందాలు పంపవలసిన చిరునామా: కన్వీనర్, శ్రీ సత్యసాయి సాధనా ట్రస్టు, పబ్లికేషన్స్ విభాగం, ప్రశాంతి నిలయం – 515134, ఆంధ్రప్రదేశ్.

Printed and published by K.S. Rajan on behalf of the owner Sri Sathya Sai Sadhana Trust, Publications Division, Prasanthi Nilayam - 515134, Ananthapuram district (A.P.) and printed at Sri Sathya Sai Press, within Sri Sathya Sai Ashram premises, Prasanthi Nilayam and published at Prasanthi Nilayam. Editor : V. Srinivasulu